


ఈనాడు



కరీంనగర్ 1-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 22+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

TG

హోదా తెస్తే సంతోషమే

- పారిశ్రామిక రాయితీలను వద్దంటామా?
- మోదీ, కేసీఆర్, జగన్ కలిసి ఇప్పించొచ్చు
- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'మీరు (జగన్), మోదీ, కేసీఆర్ ఒకటే కదా? ముగ్గురు మోదీలు కలిసే పోటీ చేయాలనుకుంటున్నారుగా? అలాంటప్పుడు ప్రత్యేక హోదా తేవొచ్చుగా.. రాష్ట్రానికి పారిశ్రామిక రాయితీలొస్తే వద్దంటామా?' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 'ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ కేసీఆర్ లేఖ ఇస్తానంటే బాధేంటని జగన్ అడుగుతున్నారు. నేనేం వద్దనడం లేదే. ఇప్పించమనే అడుగుతున్నా' అని స్పష్టం చేశారు. 'పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఆయన సోమవారం ఉండవల్లిలోని ప్రజా వేదికలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అన్ని పత్రికలు ఒకలా రాస్తుంటే జగన్ పత్రిక ఇష్టానుసారం రాస్తోందని మండిపడ్డారు. 'తలాక్ చెల్లదన్నప్పుడు పౌరులందరితోపాటే ముస్లింలకూ ఒకే రకమైన చట్టం వర్తించాలి కదా.. కానీ వారిపైనే తీవ్రమైన కేసులు పెట్టడం దారుణం. వారూ ఈ దేశంలోని పౌరులే. కావాలని వేధించడం, భయభ్రాంతులకు గురి చేయడం మంచి పద్ధతి కాదు. మతానికో చట్టం, కులానికో చట్టం ఉండదు. రాజ్యసభలో తలాక్ బిల్లుపై సోమవారం ఉదయం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, పశ్చిమ్ బెంగాల్, దిల్లీ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, కేజ్రీవాల్‌లతో మాట్లాడా. భాజపా తీరును గట్టిగా వ్యతిరేకించాలని కోరా. దీనిపై మా పార్టీ ఎంపీలకూ స్పష్టమైన సూచనలు చేశా. వారంతా గట్టిగా పోరాడబోతున్నారు. బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని కోరుతున్నాం. హైకోర్టు విభజన విషయంలో కొంత గడువు ఇస్తే.. వారంతా ఇక్కడకు వచ్చి అన్నీ చూసుకునేవారని చెప్పా. ఆ మాట చెప్పినందుకే కేసీఆర్ నాపై విరుచుకుపడుతున్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఓర్వకల్లుకు విమానం

ఈనాడు డిజిటల్, కర్నూలు: కర్నూలుకు విమానాశ్రయ కల నెరవేరే సమయం ఆసన్నమైంది. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన 'సెస్నా సైటేషన్ సీజే-2' టర్బో విమానం సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు రన్-వేపై వాలింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విమానం దిగడంతో ట్రయల్ రన్ విజయవంతమైంది. జనవరి 8న ఈ విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితమివ్వనున్నారు.

కోటి ఎకరాల మాగాణ.. బిరబిరాన

- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేటి నుంచి పనులను పరిశీలించనున్న సీఎం కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆది నుంచీ అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. వాటి పనుల్లో మరింత జోరు పెంచాలని నిర్ణయించింది. లక్ష్యానికి తగ్గట్లుగా పనులు పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించింది. కోటి ఎకరాలకు సాగునీరే లక్ష్యంతో ముందుకెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రధాన ప్రాజెక్టుల పనులను స్వయంగా పరిశీలించి దిశానిర్దేశం చేయనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం సందర్శనతో మంగళవారం నుంచి సీఎం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి ప్రాజెక్టుకు ముందుగా విశ్రాంత ఇంజినీర్ల బృందాన్ని పంపి వారు పరిశీలించి ఇచ్చిన నివేదికల ఆధారంగా ముఖ్యమంత్రి సమీక్ష చేయనున్నారు.

రెండేళ్లలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై భారీగా వ్యయం చేయడంతోపాటు పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, తుపాకులగూడెం తదితర ప్రాజెక్టుల పనులను ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. పునరాకృతి ద్వారా చేపట్టిన ప్రాజెక్టులతోపాటు గతంలో ప్రారంభించి ఓ కొలిక్కి వచ్చిన వాటిని కూడా పూర్తి చేయడానికి రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సాగునీటి రంగంపై సుమారు రూ.20 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇదే రీతిలో ఖర్చుచేసి.. లక్ష్యానికి తగ్గట్లుగా గుత్తేదారులు పనులు చేస్తే వచ్చే మూడు, నాలుగేళ్లలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ ఓ కొలిక్కి వచ్చే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

కాళేశ్వరం పూర్తికి మరో రూ.40 వేల కోట్లు

దేశంలో అత్యంత వేగంగా పనులు జరుగుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి ప్రస్తుత అంచనాల ప్రకారం మరో రూ.40 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రూ.80,500 కోట్లతో చేపట్టిన ఈ పథకంపై ఇప్పటి వరకు రూ.40,500 కోట్లను ప్రభుత్వం ఖర్చుచేసింది. రెండేళ్లలో ఓ ప్రాజెక్టుపై ఇంత భారీ వ్యయం చేయడం ఇదే మొదటిసారి. ఈ ఖరీఫ్ నాటికి మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి మధ్యమానేరుకు నీటిని మళ్లించడానికి ఉన్న సమస్యలపై సర్కారు ప్రధానంగా దృష్టి పెట్టింది. ఐదు పంపింగ్ స్టేషన్లలో పంపులు, మోటార్ల అమరిక పూర్తి చేయడంతో పాటు, ఎల్లంపల్లి-మధ్యమానేరు మార్గంలో సొరంగాన్ని మరో మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 17 వేల ఎకరాల భూమిని ఇంకా సేకరించాల్సి ఉంది.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల..

కాళేశ్వరం ఎత్తిపోతల తర్వాత మరో పెద్ద ప్రాజెక్టు ఇది. రూ.35,200 కోట్ల పరిపాలనా అనుమతులతో చేపట్టిన ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తి చేసేలా గుత్తేదారులతో ఒప్పందం చేసుకొన్నా.. నిధులు, భూసేకరణ తదితర సమస్యలతో నిర్ణీత వ్యవధిలో లక్ష్యం నెరవేరలేదు. ఇప్పటివరకు సుమారు రూ.ఐదు వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇంకా కొన్ని పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఈ పథకాన్ని పూర్తి చేయడానికి మరో రూ.40 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.17 వేల కోట్ల రుణం తీసుకొని పనులను వేగవంతం చేయడానికి ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది.

సీతారామ పనులపై సీఎం అసంతృప్తి

ఇప్పటికే అటవీ అనుమతులు వచ్చినా.. నిధులకు సమస్య లేకపోయినా.. సీతారామ ఎత్తిపోతల పనులు నత్తనడకన సాగుతుండటంపై ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. రూ.13 వేల కోట్లు ఖర్చయ్యే ఈ పథకానికి ఇప్పటి వరకు రూ.1200 కోట్లు మాత్రమే వ్యయం చేశారు. కొన్ని పనులకు ఇంకా టెండర్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పనుల వేగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. తుపాకులగూడెం బ్యారేజీ నిర్మాణంతోపాటు దేవాదుల వరద కాలువ, దిండి.. ఇలా అన్ని పథకాలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. అన్నింటినీ వీలైనంత తొందరగా పూర్తిచేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది.



సోమవారం కాళేశ్వరం ఎత్తిపోతల పనులను పరిశీలిస్తున్న విశ్రాంత ఇంజినీర్లు

వేగంగా మేడిగడ్డ పనులు

- ముఖ్యమంత్రికి విశ్రాంత ఇంజినీర్ల నివేదన

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు పనులు వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఖరీఫ్‌లో మొదటి వరద సమయంలోనే నీటిని మళ్లించడానికి ఎలాంటి సమస్యా ఉండదని విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఎక్కువ భాగం పనులు ఏప్రిల్ నాటికే పూర్తవుతాయని, బ్యారేజీల రివెట్‌మెంట్(రాతి కట్టడాలు) పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందని నివేదించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సూచన మేరకు విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో చంద్రమౌళి, వెంకటరామారావు, వేణుగోపాల్, రాంరెడ్డి, సత్తిరెడ్డిల బృందం సోమవారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపుహౌస్‌ల పనులను పరిశీలించింది. రాత్రి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమావేశమై నివేదిక ఇచ్చింది. బ్యారేజీలు, పంపుహౌస్‌ల పనులు వేగంగా, సంతృప్తికరంగా జరుగుతున్నాయని నివేదించింది. మేడిగడ్డ బ్యారేజీ పని కొంత వెనకబడి ఉన్నా.. ప్రస్తుతం వేగం పెంచినందున రెండు మూడు నెలల్లో పూర్తవుతుందని నివేదించినట్లు తెలిసింది. మొత్తంమీద వచ్చే సీజన్‌లో నీటిని మళ్లించడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపినట్లు సమాచారం. ఏయే పనులు వేగం పెంచాల్సిన అవసరం ఉందో కూడా నివేదించినట్లు తెలిసింది.

అడ్డదారుల్లో అధికారంలోకి తెరాస

- రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా
- ప్రజాకూటమి కొనసాగుతుందని స్పష్టత
- తక్కువ ఓట్లతో ఓడిన స్థానాలపై కోర్టుకు: ఉత్తమ్
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష

హైదరాబాద్, న్యూస్‌టుడే: అధికార దుర్వినియోగం, ఈవీఎంల ట్యాంపరింగ్, డబ్బుల పంపిణీ, ఎన్నికల అధికారుల సహకారంతో తెరాస అడ్డదారుల్లో అధికారాన్ని చేజిక్కించుకుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు ఆర్.సి. కుంతియా ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన తీరు, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్ కుమార్ వ్యవహారశైలి, ఓట్ల లెక్కింపులో వ్యత్యాసం తదితర అంశాలపై వచ్చేవారం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. గతంలో నమోదైన కేసుల నుంచి బయటపడేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో తిరుగుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోవడానికి కారణాలు, త్వరలో జరగబోయే పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు రాష్ట్ర ముఖ్యనేతలతో సోమవారం కుంతియా భేటీ అయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, కుసుమకుమార్, అజాహరుద్దీన్, సీనియర్ నేతలు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, షబ్బీర్‌అలీ, బలరాం నాయక్, దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శులు మధుయాస్కీ, సలీం అహ్మద్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు విజయశాంతి హాజరయ్యారు. అనంతరం కుంతియా మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఆర్నెళ్ల సమయం ఉన్నప్పటికీ, 22 లక్షల మంది అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చకుండా హడావుడిగా ఎన్నికలు నిర్వహించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పోలింగ్ రోజు సాయంత్రం 4 గంటల వరకు 50 శాతం నమోదైన పోలింగ్ చివరి గంటలో దాదాపు 30 శాతం ఎలా నమోదవుతుందని అనుమానం వ్యక్తం చేశారు. తెరాస నేతలు చివరి గంటలో భారీగా రిగ్గింగ్‌కు పాల్పడటం వల్లే పోలింగ్ శాతం సరాసరి 80 శాతానికి పైగా నమోదైందని తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. అందువల్లే పోలింగ్ శాతానికి, లెక్కించిన ఓట్లకు చాలా వ్యత్యాసం వచ్చిందని.. తుది పోలింగ్ శాతం చెప్పడానికి రెండ్రోజుల సమయం తీసుకోవడానికి కారణం కూడా ఇదేనన్నారు. రీకౌంటింగ్ అవసరమైన ప్రాంతాల్లో అనుమతించలేదన్నారు. ఓడినంత మాత్రాన కాంగ్రెస్ పనైపోయిందనుకుంటే పొరపాటేనని పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుతామని కుంతియా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాకూటమి కొనసాగుతోందని దీనిపై అనుమానాలు అవసరం లేదన్నారు.



పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ముఖ్య నేతల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి. పక్కన మల్లురవి, సలీం, కుంతియా తదితరులు

ధర్మపురి, కోదాడ, ఇబ్రహీంపట్నంపై కోర్టుకు

ఉత్తమ్ మాట్లాడుతూ.. తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన ధర్మపురి, కోదాడ, ఇబ్రహీంపట్నం లాంటి స్థానాల్లో న్యాయపోరాటం చేస్తామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలున్నా వీవీప్యాట్ పత్రాలను ఎందుకు లెక్కించడం లేదో ఎన్నికల కమిషన్ చెప్పాలన్నారు. పంచాయతీ, పార్లమెంటు ఎన్నికలకు ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జులు ఉంటారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేశారని దీనిపై న్యాయపోరాటం చేస్తామని, బీసీలకు న్యాయం జరిగేలా పోరాడతామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేసిన ఈసీ...రైతుబంధు డబ్బుల పంపిణీకి ఎందుకు అభ్యంతరం చెప్పలేదని దామోదర రాజనర్సింహ ప్రశ్నించారు.

విద్యారంగానికి రెట్టింపు బడ్జెట్ ఇవ్వాలి

- తెరాస ఎంపీ వినోద్ డిమాండ్

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి రెట్టింపు బడ్జెట్ కేటాయించాలని తెరాస లోక్‌సభాపక్ష ఉపనేత బి.వినోద్ కుమార్ డిమాండు చేశారు. విద్య అనేది దేశాన్ని అభివృద్ధి చేసే రంగాల్లో ఒకటని తెలిపారు. సోమవారం లోక్‌సభలో 377వ నిబంధన కింద ఈ అంశంపై ఆయన మాట్లాడారు. దేశ జనాభా పెరుగుదల రేటు 1.26 శాతం ఉందని, 2020 నాటికి దేశంలో యువత 34.33 శాతం ఉంటారన్నారు. తద్వారా విద్యాసంస్థల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. 2014-15లో మానవ వనరుల అభివృద్ధి శాఖకు మొత్తం బడ్జెట్‌లో 6 శాతం దక్కగా 2017-18లో కేవలం 3.48 శాతమే దక్కిందన్నారు.

దేశమంతా రైతు సంక్షేమ పథకాలు

పాలనలో వివిధ రాష్ట్రాలు అవలంబిస్తున్న మంచి పద్ధతులను ఇతర రాష్ట్రాలకు తెలపాల్సిన బాధ్యత పార్లమెంట్‌పై ఉందని వినోద్ అన్నారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టారని.. వాటి అమలుతో రాష్ట్రంలోని రైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపా చొరవ తీసుకొని రాష్ట్రాల్లో ఈ పథకాలు అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాకో నవోదయ విద్యాలయం ఉండాలని చట్టం చెబుతోందన్నారు. తమ రాష్ట్రంలో జిల్లాలను 10 నుంచి 31కి పెంచామని.. కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలు కేటాయించాలని కోరారు.

స్టాంప్ పత్రాల కేసులో తెల్గీ నిర్దోషి

నాసిక్: నకిలీ స్టాంప్ పత్రాల కుంభకోణంలో జైలుశిక్ష అనుభవిస్తూ మృతి చెందిన అబ్దుల్ కరీమ్ తెల్గీని మహారాష్ట్రలోని నాసిక్ సెషన్స్ కోర్టు సోమవారం నిర్దోషిగా తేల్చింది. 2004 నాటి ఈ కేసులో తగిన ఆధారాల్లేకపోవడంతో మరో ఏడుగురికి న్యాయస్థానం విముక్తి కలిగించింది. సంచలనం రేపిన స్టాంప్ పత్రాల కుంభకోణానికి సంబంధించిన అనేక కేసుల్లో తెల్గీ దోషిగా తేలడంతో గతంలో అతనికి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. శిక్ష అనుభవిస్తూనే 2017 అక్టోబరులో తెల్గీ అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో కీలక వ్యక్తిగా భావిస్తున్న తెల్గీ తదితరులపై నాసిక్ కోర్టులో సీబీఐ 2004 ఆగస్టులో అభియోగపత్రం దాఖలు చేసింది.





నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో అలరారుతున్న శ్రీవారి ఆలయం

నూతన సంవత్సర వేడుకలకు తిరుమల ముస్తాబు

- భక్తుల రద్దీ సాధారణం

తిరుమల, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలకు తిరుమల దివ్యక్షేత్రం ముస్తాబైంది. కొత్త ఏడాదిని స్వాగతిస్తూ శ్రీవారి ఆశీస్సులు అందుకోవడానికి భక్తకోటి ఎదురుచూస్తోంది. యాత్రికులకు మెరుగైన సేవలందించి.. స్వామివారి దర్శనం కనువిందుగా కల్పించడానికి తితిదే పలు చర్యలు చేపట్టింది. ఆలయ ప్రాకారం, గోపురాలు, ధ్వజస్తంభం, అంతరాలయాలను రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించింది. భక్తుల రద్దీ దృష్ట్యా.. శ్రీవారికి సోమ, మంగళవారాల్లో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసింది. సహస్రదీపాలంకరణ సేవను మాత్రం సర్కారు సేవగా నిర్వహించనుంది. సోమవారం అర్ధరాత్రి స్వామివారికి తిరుప్పావై పఠనం అనంతరం ఇతర కైంకర్యాలు పూర్తిచేసి.. మంగళవారం వేకువజామున 1.30 గంటల నుంచే వీఐపీ బ్రేక్ దర్శనాన్ని ప్రారంభించనుంది. వేకువజామున 4.30 గంటల నుంచి ధర్మదర్శనాన్ని మొదలుబెట్టి అర్ధరాత్రి వరకు సామాన్య భక్తులకు అవకాశం కల్పించనుంది. సోమవారం సాయంత్రానికి తిరుమలలో యాత్రికుల రద్దీ సాధారణంగా ఉంది. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల ఇన్‌ఛార్జి జేఈవో పోలా భాస్కర్ క్యూలైన్లను పర్యవేక్షించారు.

భారత్‌లో చొరబాటుకు బ్యాట్ దళం యత్నం

ఇద్దరు పాక్ సైనికులు హతం

శ్రీనగర్: పాకిస్థాన్ దళాలకు భారత సైన్యం మరోసారి గట్టిగా బుద్ధి చెప్పింది. మనదేశ సరిహద్దు స్థావరంపై దాడికి వారు పన్నిన కుట్రను భగ్నం చేసింది. ఇద్దరు శత్రు సైనికులను మట్టుబెట్టింది. పాక్ సరిహద్దు కార్యాచరణ బృందం(బ్యాట్) సభ్యులు ఆదివారం తెల్లవారుజామున జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖను దాటి భారత భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అత్యాధునిక ఆయుధాలు, రాకెట్ లాంచర్లతో మన సైన్యంపై దాడికి దిగడం ద్వారా బ్యాట్ సభ్యుల చొరబాటుకు పాక్ సైన్యం సహకరించే ప్రయత్నం చేసింది. అప్రమత్తమైన భారత సైన్యం దీటుగా స్పందించింది. రాత్రివరకు ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగాయి. ఎట్టకేలకు పాక్ దళాలు తోకముడిచాయి. ఘటనాస్థలంలో ఇద్దరు పాక్ సైనికుల మృతదేహాలు లభించాయి. వారి వద్ద ఐఈడీలు, అధికమొత్తంలో పేలుడు సామగ్రి దొరికాయి. సరిహద్దు స్థావరంపై భీకర దాడి చేసే లక్ష్యంతోనే వారు చొరబాటుకు ప్రయత్నించినట్లు అధికారులు అంచనా వేశారు. మృతదేహాలను తీసుకెళ్లాలని పాక్‌ను కోరనున్నట్లు సైన్యం అధికార ప్రతినిధి తెలిపారు.

విద్యుత్తు ఛార్జీల సవరణ లేనట్టే!

- ఏఆర్‌ఆర్ నివేదిక సమర్పణను వాయిదా వేసిన డిస్కంలు
- మార్చి 31 వరకూ గడువివ్వాలని వినతి

ఈనాడు, హైదరాబాద్ : విద్యుత్తు ఛార్జీల సవరణ ఇప్పట్లో లేనట్టేనని స్పష్టమైంది. రాష్ట్ర 'విద్యుత్ పంపిణీ సంస్థ'(డిస్కం)ల వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్‌ఆర్) నివేదికను మార్చి 31 నాటికి సమర్పించాలని సంస్థలు నిర్ణయించడమే దానికి కారణం. విద్యుత్ చట్టం ప్రకారం తదుపరి ఆర్థిక సంవత్సరం(2019-20)లో ఛార్జీలను సవరించాలంటే ఏఆర్‌ఆర్ నివేదికను నవంబరు నెలాఖరు నాటికి 'రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి' (ఈఆర్‌సీ)కి అందజేయాలి. శాసనసభ ఎన్నికలున్నందున డిసెంబరు 31 నాటికి సమర్పిస్తామని డిస్కంలు గతంలో మండలిని కోరాయి. మార్చి 31 వరకు గడువు కావాలని సోమవారం ఈఆర్‌సీకి విన్నవించాయి. డిస్కంల ఆర్థిక లోటును రాయితీ కింద భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఛార్జీలు పెంచే అవసరం ఉండదనేది అంచనా. రాష్ట్ర ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుంది? డిస్కంలకు బడ్జెట్‌లో నిధులు ఏ మేరకు కేటాయిస్తుందనేది మార్చి నెలలో తెలుస్తుంది. ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలున్నందున ప్రభుత్వం ఆశించిన నిధులు ఇస్తుందని, విద్యుత్తు ఛార్జీల సవరణ ఉండకపోవచ్చని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

విస్తరిస్తున్న లోటు

రాష్ట్రంలో కరెంటు రోజూవారీ వినియోగం (డిమాండు) భారీగా పెరిగినందున డిస్కంల ఆర్థిక లోటు నానాటికీ పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9,700 కోట్ల లోటు ఉంటుందని గత ఏఆర్‌ఆర్ నివేదికలో డిస్కంలు ప్రతిపాదించాయి. ఈఆర్‌సీ విచారణ జరిపి లోటు దాదాపు రూ.5,900 కోట్లు ఉండవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చివరికి రూ.4,950 కోట్లు కేటాయించింది. రూ.వెయ్యి కోట్ల లోటు అలాగే కొనసాగుతోంది. వ్యవసాయానికి నిరంతర సరఫరా చేస్తున్న కారణంగా ప్రస్తుతం డిమాండు గరిష్ఠంగా రూ.10,800 మెగావాట్లకు(గతేడుతో పోలిస్తే వెయ్యి మెగావాట్ల అదనం) చేరింది. ఆ మేరకు డిస్కంలు బహిరంగ విపణిలో కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నాయి. ఇటీవల 23 వేల కాంట్రాక్టు ఉద్యోగాలను క్రమబద్ధీకరించినందున సంస్థపై మరింత ఆర్థికభారం పడింది. శాశ్వత ఉద్యోగులకు వేతన సవరణ చేసినందున ఏటా రూ.800 కోట్ల భారం అదనంగా పడుతోంది. మొత్తంగా ప్రస్తుతం డిస్కంలకు వచ్చే ఆదాయ, వ్యయాల మధ్య లోటు రూ.10 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఆ సొమ్మును ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయిస్తే ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉండదని అధికార వర్గాలు వెల్లడించాయి. 'గత రెండేళ్లుగా డిస్కంలు తెలిపిన లోటును ఈఆర్‌సీ తగ్గించడం, ప్రభుత్వం నిధులు తక్కువగా ఇస్తుండటం ఆర్థిక లోటు పెరిగేందుకు కారణమవుతున్నాయి. సంస్థాగతంగా జీతభత్యాల వంటి అదనపు ఖర్చులు రూ.వందల కోట్లలో పెరగడం వల్ల లోటు అంతకంతకూ విస్తరిస్తోంది' అని అధికారులు వివరించారు.

'సవరణ యజ్ఞానికి' సహకరించండి

- ఓటర్లకు ఎన్నికల సంఘం లేఖలు
- నమోదులో ఇబ్బందుల్ని తెలిపేందుకు ప్రత్యుత్తర కార్డు జత
- ఈసీ వినూత్న ప్రయోగం

ఈనాడు, హైదరాబాద్: ఓటు హక్కుపై అవగాహన కల్పించే వినూత్న కార్యక్రమానికి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఓటరుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ లేఖ రాయనున్నారు. లేఖతోపాటు ప్రత్యుత్తర(రిప్లై) పోస్టు కార్డునూ జత చేస్తున్నారు. ఓటర్ల నమోదులో ఇబ్బందులను ఆ లేఖ ద్వారా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యుత్తర కార్డును ఉపయోగించవచ్చు. ఆ లేఖ సదరు ఓటరుకు అందిందా? లేదా? నిర్ధారించుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఆ లేఖలో ఓ రశీదును కూడా జత చేసింది. లేఖ అందినట్లుగా అందులో సంతకం చేయాల్సి ఉంటుంది. ఏ ధ్రువపత్రం ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి?. నియోజకవర్గం మారితే ఏ పత్రాన్ని పూర్తి చేయాలి?. తదితర వివరాలను కూడా ఆ లేఖలో పేర్కొన్నారు.

7వ తేదీ నుంచి ఇంటింటికీ లేఖలు

ఎన్నికల సంఘం సిద్ధం చేస్తున్న లేఖలను ఈ నెల 7 నుంచి పోలింగు కేంద్రం స్థాయి అధికారి(బీఎల్‌వో) అన్ని నియోజకవర్గాల్లో ఓటర్లకు స్వయంగా పంపిణీ చేస్తారు. ఆన్‌లైన్‌లో www.nvsp.in లేదా www.ceotelangana.nic.in ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. స్వయంగా దరఖాస్తును భర్తీ చేసి బీఎల్‌వో లేదా నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఆయా దరఖాస్తును అందచేసి ఓటు హక్కు పొందొచ్చు. డిసెంబరు 31తో 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కును పొందేందుకు అర్హులే.

త్వరలో రాజకీయ పార్టీలకూ లేఖలు

ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ దఫా కూడా భారీ సంఖ్యలో ఓటర్లు నమోదయ్యే అవకాశం ఉంది. జాబితా సవరణ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలతో ఈ నెల 8 నుంచి సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. వారి నుంచి సలహాలు, అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఒక్కో పార్టీతో వేర్వేరుగా సమావేశమవుతాం. అన్ని పార్టీలకు త్వరలో లేఖలు రాయనున్నాం.

-రజత్‌కుమార్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

ఇదీ లేఖ..

"ఓటు హక్కు నమోదు చేసుకోండి. ఓటు ఉందా? లేదా? అన్నది సరిచూసుకోండి. ఏడాది పొడవునా ఎప్పుడైనా ఓటు నమోదు చేసుకోవచ్చు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు ఉండాలి. ఈ హక్కును వినియోగించుకోవడంలో తొలి అడుగు ఓటరుగా నమోదు చేసుకోవడమే. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్ట్యా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ డిసెంబరు 26న ప్రారంభమైంది. జనవరి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ల జాబితా సవరణ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలి"

ఈనాడు

కరీంనగర్ 1-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 142

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 22+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



TG


पान बहार
విజేతకు తగిన గుర్తింపు
NEW PACK
PAN BAHAR
THE HERITAGE
PAN MASALA
PAN BAHAR
అతి పెద్ద
మిశ్రమ రహస్యం
52 YEARS OLD SECRET BLEND
पान मसाला चबाना स्वास्थ्य के लिए हानिकारक है
NO TOBACCO NICOTINE
TOLL FREE NO.: 1800 1032 400
www.panbahar.in



ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 1-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 142

రూ. 6-50. పేజీలు 22+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi





సరికొత్త సంతోషానికి స్వాగతం!

కొత్త సంవత్సరం కొంగొత్త సందోహం!

ప్రపంచవ్యాప్తంగా ఈ ఘడియలు మోసుకొచ్చే ఉత్సాహం.. ఉల్లాసం.. అనంతం!!

ఈ ఉత్సాహం రోజులు గడిచే కొద్దీ కరిగిపోకుండా.. ఈ సంతోషం కాలంతో పాటే జారిపోకుండా.. ఏడాదంతా ఇంతే ఆనందంగా ఉంటే ఎంత బాగుణ్ను!

ఉంటే కాదు... కచ్చితంగా ఉంచుకోవచ్చు. ఎలాగంటారా???

నేడు శాస్త్రవేత్తల నుంచి ఆధ్యాత్మిక వేత్తల వరకూ ఎవర్ని కదిపినా.. మన సంతోషం పూర్తిగా మన చేతుల్లోనే ఉందంటున్నారు. అంతేకాదు.. సంతోషమే సంపూర్ణ బలం అనీ నొక్కి చెబుతున్నారు. పైగా ప్రపంచంలో ఏ మూల గాలించి చూసినా.. సంతోషంగా ఉన్నవాళ్లే సంపూర్ణ జీవితాన్ని గడపగలుతున్నారు. మరి ఈ సంతోషాన్ని ఇలాగే పొదివి పట్టుకోవాలంటే?

మనకూ ఒక 'ఇకిగాయ్' ఉండాలంటున్నారు జపాన్ వాసులు. సంతోషానికీ శాస్త్రీయ సూత్రాలు చెబుతున్నారు పరిశోధకులు. పలకరింపు నుంచి పచ్చిక బయలు వరకూ.. ప్రతిదీ మన సంతోషానికే ఉన్నాయంటున్నారు మనస్తత్వవేత్తలు. అందుకే నూతన సంవత్సర ఆరంభ ఘడియల్లో.. మన జీవితాలను మరింత సంతోషభరితం చేసుకునేందుకు ఈ ఆనంద భాండాగారాన్ని మీ ముందు ఆవిష్కరిస్తోంది.. నేటి ఈనాడు!



8, 9, 10 పేజీల్లో

ఇదీ సంగతి!



స్వప్నం సాకారం

నేటి నుంచే తెలంగాణ హైకోర్టు

13 మంది న్యాయమూర్తులతో ప్రారంభం

తొలి సీజేగా జస్టిస్ రాధాకృష్ణన్ నేడు ప్రమాణ స్వీకారం

ఏపీ సహచరులకు భావోద్వేగాలతో వీడ్కోలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణవాసుల చిరకాల స్వప్నం సాకారమైంది. ప్రత్యేక హైకోర్టు కావాలనే వారి ఆకాంక్ష నెరవేరింది. తెలంగాణ, ఏపీల ఉమ్మడి హైకోర్టు విభజనతో.. జనవరి 1 నుంచి తెలంగాణ హైకోర్టు ఆవిర్భవించనుంది. ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ తెలంగాణ హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం గవర్నర్ నరసింహన్ జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.. తెలంగాణకు కేటాయించిన ఇతర న్యాయమూర్తులతో హైకోర్టు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తులు 24 మంది. అయితే ప్రస్తుతం 13 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరితో తెలంగాణ ప్రత్యేక హైకోర్టు మంగళవారం ప్రారంభం కానుంది. ఇందులో తెలంగాణకు కేటాయించిన 10 మంది, ప్రధాన న్యాయమూర్తి, బదిలీపై వచ్చిన ఇతర రాష్ట్రాలవారితో కలిపి.. మొత్తం 13 మంది న్యాయమూర్తులున్నారు. ఉమ్మడి హైకోర్టులో చివరి పనిరోజు కాస్త భావోద్వేగాల మధ్య గడిచింది. కోర్టు విధులు కొంతసేపు మాత్రమే కొనసాగాయి. అనంతరం న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య పరస్పర ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులు చోటు చేసుకున్నాయి. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, ఏపీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్‌లు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. హైకోర్టు ఆవరణలో న్యాయవాదులు, న్యాయమూర్తులు ఒకరికొకరు అభినందనలు, వీడ్కోలు చెప్పుకొన్నారు. పలువురు (మిగతా 2లో)



'హైకోర్టు ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ'గా పేరు మారిన హైకోర్టు



ఆహార శుద్ధి, వ్యవసాయంపై సమీక్షిస్తున్న కేసీఆర్. పక్కన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి

సాగు విధానం మారాలె

- పంటలసాగుపై క్షుణ్ణంగా అధ్యయనం
- ఆహారోత్పత్తుల ఎగుమతుల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉండాలి
- ఆహార శుద్ధి, వ్యవసాయంపై సమీక్షలో సీఎం కేసీఆర్ సూచనలు

ఈనాడు, హైదరాబాద్: రైతులందరూ ఒకే పంట వేస్తే సమస్యలు తలెత్తుతాయని, పంట మార్పిడిపై వారికి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. పంటల సాగు అలవాట్లలో మార్పు రావాలని కాంక్షించారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, ఆహార శుద్ధి పరిశ్రమలపై సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం ఉన్నతస్థాయి (మిగతా 2లో)

3న పంచాయతీ ప్రకటన!

- ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ వివరాలను అందజేసిన సర్కారు
- పోలింగ్ తేదీలపై ఇక ఎస్ఈసీదే నిర్ణయం 3లో
- ఇప్పటి వరకు రూ.87 కోట్ల నిధులు విడుదల



నేటి నుంచి పశ్చిమ బెంగాల్లో

రైతు బంధు, బీమా పథకాలు

- మమతా బెనర్జీ వెల్లడి 12లో

మే 2 నుంచి ఎంసెట్!

- గత ఏడాది జరిగిన పరీక్షల తేదీల్లోనే ఈసారీ నిర్వహణ 3లో

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా వినోద్‌కుమార్ యాదవ్ 12లో





రెండు నెలల పసికందును కాపాడిన పోలీసు దంపతులు రవీందర్, ప్రియాంకలను అభినందిస్తూ వారి చిన్నారికి సైకిల్‌ను బహూకరించిన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్

లాఠీలే కాఠిన్యం.. గుండెల్లో లాలిత్యం

- మానవతకు అర్థం చెప్పిన హైదరాబాద్ పోలీసులు
- తల్లి వదిలేసిన చిన్నారిని ఆదుకున్న పోలీసు దంపతులు
- పాలిచ్చి ప్రాణం కాపాడిన మహిళా కానిస్టేబుల్
- అభినందించిన కమిషనర్ అంజనీకుమార్

ఈనాడు - హైదరాబాద్

లాఠీలు కాఠిన్యమే కాని.. పోలీసుల హృదయాల్లో లాలిత్యం ఉంటుందని.. కానిస్టేబుల్ దంపతులు నిరూపించారు. తల్లికి దూరమైన ఓ పసికందుకు అక్కున చేర్చుకుని కాపాడారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న రెండు నెలల పాపకు మహిళా కానిస్టేబుల్ పాలిచ్చి సాకారు.. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. చిన్నారిని రక్షించిన ఆ దంపతులను పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ అభినందించారు. యాఖుత్‌పురాకు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి 9.30 గంటలకు అఫ్జల్‌గంజ్ పోలీస్ ఠాణాకు వచ్చాడు. అతడి చేతిలో రెండు నెలల పాప ఉంది. ఒక ముస్లిం మహిళ పాపను తన చేతిలో పెట్టి వెళ్లిపోయిందని.. ఆమె కోసం (మిగతా 2లో)

చలి పంజా

- రికార్డు స్థాయిలో శీతల పవనాలు
- గజగజ వణుకుతున్న రాష్ట్రం
- ఆదిలాబాద్ జిల్లాలో 2.7 డిగ్రీలు
- వందేళ్ల అత్యల్ప రికార్డు..
- విశాఖజిల్లా చింతపల్లిలో 1.5
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరిక

ఈనాడు, హైదరాబాద్, భీంపూర్, న్యూస్‌టుడే: చలి పులి రాష్ట్రాన్ని గజగజా వణికిస్తోంది. ఉత్తర, ఈశాన్య భారతం నుంచి వీస్తున్న అతి శీతలగాలులతో పలు ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతల రికార్డులన్నీ చెరిగిపోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా చలికి గడ్డకడుతోంది. భీంపూర్ మండలం అర్లీ-టి గ్రామంలో వందేళ్లలో లేనంత స్థాయిలో సోమవారం తెల్లవారుజామున 2.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది డిసెంబరు 27న 3.5 డిగ్రీలు నమోదవగా తాజాగా ఆ కనిష్ఠ రికార్డు చెరిగిపోయింది. మెదక్‌లో 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా దక్షిణాదికి ముఖద్వారంలా ఉండటంతో ఉత్తరాది నుంచి (మిగతా 2లో)

ఉక్కు మహిళకే బంగ్లా పీఠం

- ఎన్నికల్లో హసీనా భారీ విజయం
- వరసగా మూడోసారి, మొత్తంగా నాలుగోసారి ప్రధాని పదవి
- 288 స్థానాల్లో మహాకూటమి జయకేతనం
- 7 స్థానాలే గెలిచిన విపక్ష సంకీర్ణం



ఢాకా: 'ఉక్కు మహిళ'గా పేరొందిన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా(71) తాజా ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. వరసగా మూడోసారి పీఠాన్ని అధిరోహించనున్నారు. ప్రత్యర్థి ఖాలిదా జియాపై పైచేయి సాధించడం ద్వారా 'బేగంల యుద్ధం'లో గెలిచారు. హసీనా గెలుపుతో భద్రతపరంగా బంగ్లాతో సంబంధాల విషయంలో భారత్‌కిది శుభవార్తగా భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇరుదేశాల సంబంధాలను సువర్ణాధ్యాయంగా పిలుస్తున్నారు. 300 స్థానాలున్న పార్లమెంటుకు ఆదివారం జరిగిన 11వ సాధారణ ఎన్నికల్లో హసీనా పార్టీ అవామీ లీగ్ నేతృత్వంలోని మహాకూటమి 288 స్థానాలను సాధించినట్లు ఎన్నికల సంఘం కార్యదర్శి హెలాలుద్దీన్ అహ్మద్ తెలిపారు. మొత్తం పోలైన ఓట్లలో 82 శాతం మహాకూటమికి దక్కాయి. విపక్ష పార్టీలతో కూడిన జాతీయ ఐక్యతా కూటమి (ఎన్‌యూఎఫ్) 15 శాతానికిపైగా (మిగతా 2లో)



నేటి నుంచి చౌకగా సినిమా టికెట్లు

దిల్లీ: సామాన్యులకు నూతన సంవత్సర కానుక. మంగళవారం నుంచే సినిమా టికెట్లు, టీవీల ధరలు తగ్గే అవకాశాలున్నాయి. 23 రకాల వస్తువులు, సేవలపై జీఎస్టీ తగ్గిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం అధికారిక ప్రకటన వెలువరించింది. రూ. 100 పైబడి ఉన్న సినిమా టికెట్‌పై గతంలో 28% పన్ను ఉండగా 18 శాతానికి తగ్గించారు. రూ.100లోపు టికెట్‌పై పన్నుభారం 18% నుంచి 12%కి తగ్గింది. కంప్యూటర్ మానిటర్లు, 32 అంగుళాల టీవీ స్క్రీన్లపై పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుంది.

స్వప్నం సాకారం


ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ఏపీ న్యాయమూర్తులకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తులు

(మొదటి పేజీ తరువాయి)
న్యాయమూర్తులు సోమవారం కుటుంబ సమేతంగా అమరావతికి బయలుదేరారు. ఈ సందర్భంగా వీడ్కోలు చెబుతూ, ఉద్వేగాన్ని ఆపుకోలేని న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి కన్నీళ్లు పెట్టుకున్నారు.

ప్రత్యేక బస్సుల్లో కదిలిన సిబ్బంది

ఏపీలో కొత్తగా ఏర్పాటవుతున్న హైకోర్టులో పనిచేయడానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 4 ఆర్టీసీ బస్సుల్లో సిబ్బంది వెళ్లారు. ప్రస్తుతం ఏపీకి కేటాయించిన న్యాయమూర్తుల వద్ద పనిచేస్తున్న కోర్టు సిబ్బంది తాత్కాలిక ప్రాతిపదికన వెళ్లారు. ఒక వ్యాన్‌లో కేసులకు సంబంధించిన ఫైళ్లను తరలించారు.

తెలంగాణ బార్ కౌన్సిల్

తెలంగాణ బార్ కౌన్సిల్ కూడా నేటి నుంచి విడిగా కొనసాగనుంది. రెండు తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు ఇటీవల ఎన్నికలు పూర్తయి పాలక మండళ్లు ఏర్పాటైన నేపథ్యంలో ఇవి వేర్వేరుగా కొనసాగనున్నాయి.

తెలంగాణ ఉద్యోగుల నిరసన

ఏపీకి వెళుతున్న తెలంగాణ సిబ్బంది కొంత నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన న్యాయమూర్తితోపాటు న్యాయమూర్తుల కమిటీని కలిసి తమను ఏపీకి పంపడంపై నిరసన తెలిపారు. మొత్తం 1,600 మంది హైకోర్టు ఉద్యోగుల్లో 4వ తరగతి ఉద్యోగులను మినహాయిస్తే 1,100 మంది ఉంటారని, వీరిలో 20% మాత్రమే తెలంగాణకు చెందినవారున్నారని పేర్కొన్నారు. వారికి ఇక్కడే కేటాయింపులు జరపాలని అభ్యర్థించారు. వీరితో జడ్జీల కమిటీ మాట్లాడింది. సీనియారిటీ ప్రాతిపదికన కేటాయింపులుంటాయని, అన్ని అంశాలను పరిశీలిస్తామని చెప్పి పంపింది.

హైకోర్టు ప్రస్థానమిదీ..

నిజాం కాలం నాటి పురాతన 'హైదరాబాద్ హైకోర్టు' 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ హైకోర్టుగా ఆవిర్భవించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెలంగాణ, ఏపీల ఉమ్మడి హైకోర్టుగా కొనసాగింది. నేటి నుంచి తెలంగాణ హైకోర్టుగా అవతరించనుంది. ఉమ్మడి హైకోర్టులో 3.4 లక్షల వ్యాజ్యాలు విచారణలో ఉండగా, అందులో 30% కేసులు తెలంగాణవే. దిగువ కోర్టుల్లో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో ఏపీకి 539 మందిని, తెలంగాణకు 362 మందిని కేటాయించారు. ఈ మేరకు ఆదివారం హైకోర్టు న్యాయాధికారుల బదిలీ జరిగింది. ఉమ్మడి హైకోర్టులో పనిచేస్తున్న సుమారు 16 వందల మంది ఉద్యోగుల్ని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట నిబంధనల ప్రకారం ఏపీ, తెలంగాణ హైకోర్టుల మధ్య 58:42 నిష్పత్తిలో విభజించాల్సి ఉంది.

35 మంది న్యాయమూర్తులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటయ్యాక 35 మంది ప్రధాన న్యాయమూర్తులు పనిచేశారు. గుంటూరులో ఏర్పాటైన హైకోర్టులో మొదటి ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగిన జస్టిస్ కోకా సుబ్బారావు.. హైకోర్టును హైదరాబాద్‌కు తరలించాక మొదటి ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం 35వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కల్యాణ్ జ్యోతి సేన్ గుప్త ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్‌లోనే ఉమ్మడి హైకోర్టు ఏర్పాటైంది. తెలంగాణ, ఏపీ ఉమ్మడి హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కల్యాణ్ జ్యోతి సేన్ గుప్త బాధ్యతలు చేపట్టారు. తరువాత జస్టిస్ దిలీప్ బి.భోసలే, టీబీఎన్ రాధాకృష్ణన్ ప్రధాన న్యాయమూర్తులుగా ఉన్నారు.


ఏపీకి బయలుదేరిన తోటి న్యాయవాదులకు వీడ్కోలు పలుకుతున్న తెలంగాణ న్యాయవాదులు, సిబ్బంది

హైకోర్టు తరలింపు పిటిషన్‌పై రేపు విచారణ

ఈనాడు, దిల్లీ: అమరావతికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపుపై ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం, న్యాయవాదులు కె.సీతారాం, కె.జగన్మోహనరెడ్డిలు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించనుంది. అత్యవసరంగా తమ వాదన వినాలన్న వారి అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అమరావతిలో నిర్మిస్తున్న భవనాలు పూర్తయ్యే వరకు హైదరాబాద్ నుంచి హైకోర్టు తరలింపు వాయిదా వేయాలని శనివారం వారి తరఫున సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ వద్ద అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ ప్రవీణ్ చతుర్వేది పిటిషన్ దాఖలు చేశారు. దీనిని హౌస్‌మోషన్‌గా స్వీకరించాలని కోరారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఉదయం కార్యాలయంలో పిటిషన్ దాఖలు చేయాలని రిజిస్ట్రీ సూచించారు. దాంతో వెకేషన్ అధికారి కుల్వి దగ్గర పిటిషన్ దాఖలు చేశారు. దీనిని స్వీకరించి నంబరు ఇచ్చిన వెకేషన్ అధికారి... జనవరి 2న (బుధవారం) విచారణ జాబితాలో చేర్చుతున్నట్లు తెలిపారు. మరో వైపు, హైకోర్టు తరలింపునకు సంబంధించి ఎలాంటి పిటిషన్ దాఖలైనా తమకు తెలియకుండా విచారణ జరపకూడదని తెలంగాణ ప్రభుత్వం కేవియెట్ దాఖలు చేసింది.

ఇబ్బందులున్నా తప్పదు

- అందరినీ సంప్రదించాకే నోటిఫికేషన్
- హైకోర్టు విభజన ప్రకటనపై పిటిషన్ కొట్టివేసిన ఉమ్మడి హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు విభజనలో కొన్ని ఇబ్బందులున్నా.. ప్రక్రియ తప్పదని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. అందరితోనూ సంప్రదించిన తరువాతే హైకోర్టు విభజనకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ అయిందని పేర్కొంది. మంగళవారం నుంచి ఏపీ, తెలంగాణ హైకోర్టులు ఏర్పాటవుతున్న తరుణంలో రాష్ట్రపతి జారీ చేసిన నోటిఫికేషన్ అమలుపై జోక్యం చేసుకోలేమంటూ తేల్చి చెప్పింది. హైకోర్టు విభజన నోటిఫికేషన్‌పై దాఖలైన వ్యాజ్యాన్ని కొట్టివేసింది. నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ న్యాయవాది పి.వి.కృష్ణయ్య సోమవారం అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు విభజన ప్రక్రియ పునర్విభజన చట్టం ప్రకారం జరగలేదని తెలిపారు. గవర్నర్‌ను, ఏపీ ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే హడావుడిగా రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రకారం అమరావతిలో హైకోర్టును ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏపీ ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిపై కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ లక్ష్మణ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. దానికి అనుగుణంగానే సుప్రీంకోర్టు కూడా హైకోర్టు విభజన నోటిఫికేషన్‌కు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి నుంచే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో 2019 జనవరి 1న చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. సముహూర్తంలో ఏపీ హైకోర్టు ఏర్పాటవుతోంది. తొలి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఆయనతో పాటు మిగిలిన న్యాయమూర్తులతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమల్లోకి వచ్చినట్లే. మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుంచి తొలుత గుంటూరుకు.. ఆ తర్వాత హైదరాబాద్‌కు ... ఏపీ విభజన నేపథ్యంలో 62ఏళ్ల తర్వాత నేడు అమరావతికి హైకోర్టు తరలివెళ్లింది.

కుంభకోణాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ఎదురుదాడి: లక్ష్మణ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : ఐక్య ప్రగతిశీల కూటమి(యూపీయే) సర్కారు హయాంలో చేసిన కుంభకోణాలను కప్పిపుచ్చుకునేందుకే మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడి చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. అగస్టావెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడు క్రిస్టియన్ మిషెల్‌ను దుబాయ్‌లో అరెస్టు చేసి భారత్‌కు రప్పించడంతో కాంగ్రెస్ పార్టీ దిగ్గజ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి సొమ్మును రాబట్టడానికి మిషెల్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు కృషిచేసిన ప్రధాని మోదీని అభినందించకుండా రాజకీయంగా ఎదురుదాడి చేస్తున్నారన్నారు. పైగా మిషెల్‌కు న్యాయసహాయం అందించేందుకు ఏకే జోసెఫ్ అనే న్యాయవాదిని కాంగ్రెస్ ఏర్పాటు చేసిందని, ఇది ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. అగస్టా వ్యవహారంపై సీబీఐ, ఈడీ విచారణల్లో ఇటలీ మహిళ కుమారుడు, బిగ్‌మ్యాన్, ఆర్ అనే అక్షరం వంటివి మిషెల్ చెప్పారని, తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని కాంగ్రెస్ గగ్గోలు పెడుతోందన్నారు.

సాగు విధానం మారాలె

(మొదటి పేజీ తరువాయి)
సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "ముల్కనూరు గ్రామం అనుభవాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటిత పరచడం ద్వారా గొప్ప ఫలితాలు సాధించారు. పలానా విధంగా నడుచుకుంటే లాభం కలుగుతుందని వ్యవసాయాధికారులు రైతులకు నమ్మకం కలిగించగలిగితే బ్రహ్మాండమైన ఫలితాలు వస్తాయి. వ్యవసాయార్థికవేత్త అశోక్ గులాటీని దిల్లీలో కలసి నేను మాట్లాడాను. ఈ విషయాలపై సదస్సులో మాట్లాడటానికి తెలంగాణకు రావాలని ఆహ్వానించాను. త్వరలో ఆయన ఇక్కడికి వస్తారు. రాష్ట్రాన్ని పంటలకాలనీలుగా విభజించాలి. పండించే పంటకు డిమాండు ఉండాలి. మన ఆహార అవసరాలేంటో తెలుసుకోవాలి. రైతాంగం ఏ పంటలు వేయడానికి అలవాటు పడిందో అర్థం చేసుకుని ఒకేసారి వాళ్లపై మన అభిప్రాయాలను రుద్దకుండా అంచెలంచెలుగా పంటలకాలనీలపై అవగాహన కల్పించాలి.

కూరగాయల దిగుమతి దురదృష్టకరం

కూరగాయలు, కొత్తిమీర, జీలకర్రలాంటివి కూడా దిగుమతి చేసుకోవడం దురదృష్టకరం. నగరాలు, పట్టణాల దరిదాపుల్లో కూరగాయల సాగు జరగాలి. ప్రతీ గ్రామం అక్కడి ప్రజల అవసరాలు తీర్చేస్థాయిలో కూరగాయలు పండించాలి. మిగులు వాటిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేయాలి. వచ్చే వానాకాలానికల్లా కాళేశ్వరం నీరు వస్తుంది. కొత్త ఆయకట్టు వస్తుంది. రెండేళ్లలో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తయి కోటి ఎకరాలకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఏ భూమిలో ఏం పంట వేయాలో అన్నదాతలకు అవగాహన కల్పించాలి. ఎటువంటి పంటనైనా శుద్ధి చేస్తే దాని ధర పెరుగుతుంది. ఉదాహరణకు మిరపకాయల నుంచి కారంపొడి, పసుపుకొమ్ముల నుంచి పసుపు తీసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వస్తువు కొనాలన్నా కల్తీ జరుగుతోంది. ప్రభుత్వమే మార్కెట్‌లో ఒక బ్రాండ్ పేరుతో నాణ్యమైన ఉత్పత్తిని తయారుచేయాలి. దీనికోసం ఆహారశుద్ధి పరిశ్రమను స్థాపించాలి. ఏ ప్రాంతంలో ఎన్ని ఆహార శుద్ధి పరిశ్రమలు ఉండాలో నిర్ణయించాలి. మన రాష్ట్ర అవసరాలకు సరిపోగా మిగిలినవాటిని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేయాలి. ఈ యావత్ ప్రక్రియలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేయాలి. ఈ మేరకు వీరికి అవకాశాలు కల్పించడంపై అధ్యయనం చేయాలి. మొత్తం 130 కోట్ల జనాభా ఉన్న పెద్ద దేశీయ మార్కెట్ మనది. ఏ రాష్ట్రంలో ఏది పండదో దాన్ని విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడ పండించాలి. తద్వారా శుద్ధి చేసిన ఆహారోత్పత్తులు తయారుచేయాలి. దేశ, విదేశాల్లో అత్యుత్తమ శుద్ధి పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్ర వాతావరణంలో ఏర్పాటుచేసుకునేందుకు అధ్యయనం చేయాలి. రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి.

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నారో వ్యవసాయశాఖకు తెలియాలి. నాణ్యమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలి. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తదనుగుణమైన పరిశోధనలు జరగాలి. అంతర్జాతీయ స్థాయిలో మన దేశ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోలేని పరిస్థితిలో ఉండటం దురదృష్టకరం. దీన్ని అధిగమించడానికి ప్రయత్నం జరగాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉంది. గత నాలుగేళ్లలో సగటున 17.17 శాతం ఆర్థిక వృద్ధి రేటు సాధించాం. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 29.97 శాతం వృద్ధి రేటు ఉంది. జీఎస్టీలో ప్రథమ స్థానంలో ఉన్నాం. వచ్చే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నాం. అన్ని విధాలా మన పెరుగుదలకు అవకాశాలున్నాయి. అందుకే మూస పద్ధతిలో ఆలోచించకుండా నూతన ఒరవడికి సిద్ధం కావాలి. చర్చల ప్రాతిపదికగా ఎలా ముందుకుపోవాలో నిర్ణయించాలి. ఆహార శుద్ధి ఒక సామూహిక ప్రయత్నం. తొలుత ఆరేడు మండలాలను ప్రయోగాత్మకంగా తీసుకుని ప్రారంభించాలి. ఈరోజు సమీక్ష ఆధారంగా వివిధ స్థాయిల్లో అధికారులు మేధోమథనం చేయాలి. ఎంత ఖర్చుపెట్టడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉత్తమ స్థాయి శుద్ధి పరిశ్రమలు ప్రపంచంలో ఎక్కడున్నా అధ్యయనం చేసి రావాలి. ఆహార శుద్ధిపై కార్యాచరణ పథకాన్ని రూపొందించాలి. మొత్తం 4 లక్షల సంఘాల్లోని 45 లక్షల మంది మహిళలకు, రైతు సమన్వయ సమితుల సభ్యులకూ శిక్షణ ఇప్పించాలి. వరి నాటు, కలుపుతీత, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాలపై కార్యాచరణ రూపొందించాలి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉంచాలి" అని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, ఆర్థిక, వ్యవసాయశాఖల ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, పార్థసారథి, మాజీ మంత్రి చెరకు ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

ఎస్జీటీ ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ)లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) ఆంగ్ల మాధ్యమం పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. మొత్తం 909 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు తెలిపింది.

సమయమే సంపద

సమయం ఎప్పుడూ సహనం ఉన్న వారి పక్షమే వహిస్తుంది. నిజానికి సమయమే సంపద. అందుకే భగవద్గీత చెబుతుంది.. సమయం వృథా చేసే వారిని ఆ లయకారుడు అంతం చేసేస్తాడని!

– మహాత్మా గాంధీ



అండమాన్ పర్యటనకు వెళ్లే విదేశీయులకు వెసులుబాటు

దిల్లీ: అండమాన్, నికోబార్ దీవులకు ఇక విదేశీయులు నేరుగా వెళ్లవచ్చు. వారి పర్యటనకు అవసరమైన ధ్రువపత్రాలను తనిఖీ నిమిత్తం పోర్టు బ్లెయిర్ విమానాశ్రయాన్నే ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడి వ్యవహారాలను పర్యవేక్షించడానికి సీఐడీ విభాగం ఎస్పీకి పౌర అధికారికి ఉండే బాధ్యతలను అప్పజెప్పింది. సోమవారం నుంచే ఈ ఉత్తర్వులు అమల్లోకి రావడం విశేషం. విదేశీయులు ఇక్కడికి నేరుగా రావడంతో పాటు, ఇక్కడి నుంచే స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉంది. విదేశీయులు అండమాన్ పర్యటనపై ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

చలి పంజా

(మొదటి పేజీ తరువాయి)
వచ్చే శీతలగాలుల ప్రభావం అక్కడ అత్యధికంగా ఉంటోంది. ఆదిలాబాద్ మండలంలో 3.1, బేలలో 3.4, తలమడుగు, జైనథ్ మండలాల్లో 4.11 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విద్యాసంస్థల పనివేళలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్పు చేస్తూ అధికార యంత్రాంగం ఉపశమన చర్యలు తీసుకుంది. మెదక్‌లోనూ గత వందేళ్లలో లేనంత కనిష్ఠ స్థాయిలో సోమవారం తెల్లవారుజామున 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జిల్లా కేంద్రంలో 1979లో వాతావరణ నమోదు కేంద్రం పెట్టిన తరవాత 2017 డిసెంబరు 20న 6.8 డిగ్రీల 'అత్యల్ప' రికార్డు నమోదైంది. 5.8 డిగ్రీలతో సోమవారం కొత్త రికార్డునమోదైనట్లు వాతావరణశాఖ అధికారి రాజారావు తెలిపారు.

ఉత్తర తెలంగాణలో 'గడ్డ కట్టే' స్థాయిలో..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గడ్డకట్టే స్థాయి చలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కుమరం భీం జిల్లా గిన్నెధారి గ్రామంలో 3.1, సిర్పూరు(యు)లో 3.2, లింగాపూర్‌లో 4, ఆదిలాబాద్ జిల్లా బేలలో 3.4, రాంనగర్‌లో 4.1, ఆదిలాబాద్‌లో 3.7, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 3.4, సంగారెడ్డి జిల్లా అల్గోల్‌లో 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి సూచించారు.

విశాఖ మన్యంపై చలి పంజా

విశాఖ మన్యంపై చలి పంజా విసిరింది. చింతపల్లిలో సోమవారం 1.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత్త నమోదైంది. చలితో గిరిజనులు గజగజ వణుకుతున్నారు.

చలి తీవ్రతకు పసికందు మృతి



కంగ్టి, న్యూస్‌టుడే: చలి తీవ్రత తట్టుకోలేక నెల వయసున్న పసికందు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టిలో సోమవారం చోటుచేసుకుంది. కంగ్టికి చెందిన అమృత్, సావిత్రి దంపతులకు ముగ్గురు ఆడపిల్లల తరువాత నెల కిందట కుమారుడు జన్మించాడు. చలిగాలులకు శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం హైదరాబాద్‌లోని నిలోఫర్ పిల్లల ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శిశువు సోమవారం ఉదయం మృతిచెందినట్లు తల్లిదండ్రులు చెప్పారు.

రెండు రంగుల్లో బ్యాలెట్ పత్రాలు

- సర్పంచి అభ్యర్థులకు గులాబీ.. వార్డు సభ్యులకు తెలుపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. సంబంధిత సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం ఉపయోగించగా.. సర్పంచి ఎన్నికలు పాత పద్ధతి అంటే బ్యాలెట్ విధానంలో జరుగనుండటంతో పల్లెల్లో ఆసక్తి నెలకొంది. ఒక్కో పంచాయతీలో ఓటరు ఒకటి సర్పంచికి, మరొకటి వార్డు సభ్యుడికి ఇలా రెండు ఓట్లను వేయాల్సి ఉంటుంది. ఓటర్లకు అందజేసే బ్యాలెట్ పత్రాలు రెండు రంగుల్లో ఉంటాయి. సర్పంచి అభ్యర్థులవి గులాబీ, వార్డు సభ్యులవి తెలుపు రంగుల్లో ఉంటాయి. ఈ పత్రాల్లో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు కనిపిస్తాయి. పత్రం చివరిలో 'నోటా' గుర్తు ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వెలువరించింది.

■ కౌంటింగ్ కేంద్రంలో ఒక్కో వార్డు బ్యాలెట్ పెట్టెను వరుసగా తెరిచి దానిలోని వార్డు సభ్యుల ఓట్లను లెక్కించాలి. తరువాత సర్పంచి అభ్యర్థుల ఓట్లను ఒకచోటకు చేర్చి.. వాటిని పాతిక చొప్పున కట్టగా కట్టి.. వాటిని పెద్ద డ్రమ్ము లేదా పాత్రలో వేసి కలిపిన మీదటే లెక్కింపును చేపట్టాలి.

■ ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చినపుడు లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు.

వీటిని తిరస్కరిస్తారు

■ ఓటరును గుర్తుపట్టే విధంగా బ్యాలెట్ పత్రంపై ఏదైనా గుర్తు, రాత ఉన్నప్పుడు.. బ్యాలెట్ పత్రంపై ఓటు వేసినట్లు ఎలాంటి గుర్తు లేనపుడు.. అభ్యర్థి చిహ్నం గడిలో కాకుండా పత్రంలో వేరేచోట్ల, లేదా పత్రం వెనుక వైపు గుర్తు ఉన్నపుడు.. అలాంటి బ్యాలెట్ పత్రాన్ని తిరస్కరిస్తారు.

■ ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఓటు గుర్తు వేసినపుడు.. నకిలీ బ్యాలెట్ పత్రాన్ని వినియోగించటం, వాస్తవ బ్యాలెట్ పత్రం దెబ్బతిని లేదా చినిగినపుడు.. ఆ పోలింగ్ కేంద్రంలో ఉపయోగించేందుకు కేటాయించిన బ్యాలెట్ పత్రాల వరుస సంఖ్య, డిజైన్ వేరేగా ఉన్నా, పత్రం వెనుక వైపున ప్రత్యేక గుర్తు, పీవో సంతకం లేకున్నా తిరస్కరిస్తారు.

వీటిని తిరస్కరించకూడదు

■ అభ్యర్థి చిహ్నం గడిలో ఒకటి కంటే ఎక్కువ సార్లు మార్కు వేసినపుడు.. అభ్యర్థి చిహ్నం గడిలో స్పష్టమైన మార్కు ఉండి బ్యాలెట్ పత్రం వెనుక భాగంలో మార్కు ఉన్నపుడు.. చిహ్నం గడిలో పాక్షికంగా మార్కు ఉండి, మిగతా మార్కు ఖాళీ ప్రాంతం లేదా బ్యాలెట్ పేపర్ బయటి భాగంలో ఉన్నపుడు.. ఆయా పత్రాలను తిరస్కరించకూడదు.



లాఠీలే కాఠిన్యం.. గుండెల్లో లాలిత్యం

(మొదటి పేజీ తరువాయి)
ఎంతసేపు చూసినా తిరిగిరాలేదని చెప్పాడు. దీంతో మొదట పోలీసులకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఉదయం ఆరా తీద్దామనుకున్నారు. ఇంతలో మెలకువ వచ్చిన పాప ఆకలితో ఏడవడం మొదలుపెట్టింది. రాత్రి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రవీందర్ ముందు పాలు పడితే బాగుంటుందనే ఉద్దేశంతో పాలపాకెట్ తెప్పించి పట్టించడానికి ప్రయత్నించారు. పాప తాగకపోగా.. మరింతగా గుక్కపట్టి ఏడవడం మొదలుపెట్టింది. కంగారుపడిన వారు తల్లి ఆచూకీ తెలియవచ్చనే ఉద్దేశంతో కంట్రోల్ రూంకు, ఇతర ఠాణాలకు సమాచారం పంపారు. అప్పటికి రాత్రి 11.30 గంటలైంది. బయట విపరీతమైన చలి. తల్లి పొత్తిళ్లలో ఆదమరచి నిద్రపోవలసిన పసికందు ఆకలితో.. గుక్కపట్టి ఏడుస్తోంది. ఎంతకీ ఏడుపు ఆపకపోవడంతో రవీందర్‌కు ఓ ఉపాయం తోచింది. ప్రసూతి సెలవులో ఉన్న తన భార్య, కానిస్టేబుల్ ప్రియాంకకు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. పాప ఆర్తి ఆమెకు అర్థమైంది. వెంటనే అర్ధరాత్రి.. చలి అని కూడా చూడకుండా ఠాణాకు చేరుకున్నారు. వచ్చీరాగానే ఆమె చిన్నారిని హత్తుకుని పాలిచ్చింది. ఆకలి తీరడంతో ఆ చిన్నారి ఏడుపు ఆపి.. కొంత కోలుకుంది. వెంటనే పేట్లబురుజు ఆసుపత్రికి తరలించారు. పాపను పరిశీలించిన వైద్యులు పాలు పట్టి ఉండకపోతే ప్రాణాలు దక్కేవి కాదన్నారు.

ఇంతకీ ఎవరీ చిన్నారి?

సోమవారం మధ్యాహ్నం చంచల్‌గూడలో షబానా బేగం అనే మహిళ తన బిడ్డ తప్పిపోయిందంటూ రోదిస్తుండగా ఏఎస్సై తాహెరుద్దీన్ గమనించి అఫ్జల్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. వారు ఆమెను పేట్లబురుజు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. బిడ్డను గుర్తుపట్టిన ఆమె వెంటనే అక్కున చేర్చుకుంది. పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరించారు. భర్త పేరు ఫిరోజ్ ఖాన్ అని.. ఐదేళ్ల సమ్రీన్, రెండు నెలల పాప ఉన్నారని చెప్పింది. ఫిరోజ్ చిల్లర దొంగ అని పోలీసు విచారణలో తేలింది. మద్యానికి బానిసైన షబానా.. ఆదివారం రాత్రి కల్లు తాగేందుకు రెండు నెలల బిడ్డను తీసుకుని అఫ్జల్‌గంజ్‌లో కల్లు కాంపౌండ్‌కు వచ్చింది. కల్లు తాగాక దాహం వేయడంతో బిడ్డను అక్కడే ఉన్న ఇర్ఫాన్ అనే వ్యక్తి చేతిలో పెట్టి.. ఇప్పుడే మంచినీళ్లు తాగి వస్తానని చెప్పింది. బయటకు వెళ్లి నీళ్లు తాగాక పాప విషయం మర్చిపోయి ఇంటికి చేరింది. కల్లు మత్తులో అలాగే నిద్రపోయింది. సోమవారం ఉదయం బిడ్డ గుర్తుకొచ్చి ఏడుస్తుండగా ఏఎస్ఐ గమనించడంతో మళ్లీ పాప ఆమె ఒడికి చేరింది. అన్ని వివరాలు తెలుసుకున్నాకనే ఫిరోజ్ ఖాన్, షబానాకు చిన్నారిని అప్పగించామని డీసీపీ ఎం.రమేష్ తెలిపారు.

పోలీస్ కమిషనర్ అభినందనలు

కానిస్టేబుల్ దంపతులు చిన్నారిని కాపాడిన విషయం తెలియగానే పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ వారిద్దరినీ పోలీస్ కమిషనరేట్‌కు పిలిపించి అభినందించారు. అప్పటికప్పుడు ఓ ట్రాలీని తెప్పించి వారి బిడ్డకు బహుమతిగా ఇచ్చారు.

ఉక్కు మహిళకే బంగ్లా పీఠం

(మొదటి పేజీ తరువాయి)
ఓట్లతో 7 సీట్లు, ఇతరులు 3 సీట్లను గెలిచినట్లు అహ్మద్ వెల్లడించారు. ఒక స్థానంలో ఎన్నికలు వాయిదా పడగా, మరోస్థానంలో అభ్యర్థి మరణంతో ఫలితాలను ప్రకటించలేదు. ఫలితాలపై హసీనా స్పందిస్తూ ఇది దేశ ప్రజలు డిసెంబర్‌లో సాధించిన మరో విజయమని వ్యాఖ్యానించారు. 1971లో డిసెంబర్‌లోనే బంగ్లా తన స్వాతంత్ర్య పోరాటంలో పాక్‌పై గెలవడాన్ని ఆమె పరోక్షంగా ప్రస్తావించారు. బంగ్లా ప్రధాని హసీనాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫోన్‌లో అభినందనలు తెలిపారు.

గ్రహం అనుగ్రహం

1-1-2019 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; మార్గశిర మాసం; బహుళ పక్షం
ఏకాదశి: రా. 3.49 తదుపరి ద్వాదశి
స్వాతి నక్షత్రం: ఉ. 11.55 తదుపరి విశాఖ
అమృత ఘడియలు: తె.3.09 నుంచి 4.45 వరకు
వర్జ్యం: సా. 5.32 నుంచి 7.08 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.46 నుంచి 9.29 వరకు
తిరిగి రా. 10.45 నుంచి 11.37 వరకు
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5-32

3న పంచాయతీ ఎన్నికల ప్రకటన!

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల ప్రకటన జనవరి 3వ తేదీన వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) తెలియజేసింది. ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనుండటంతో ఏ విడత తేదీ ఎప్పుడనేది ఎస్ఈసీ నిర్ణయిస్తుంది. రాష్ట్రంలోని 12,751 గ్రామ పంచాయతీలకు, వాటిలోని 1.13 లక్షల వార్డులకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయి జిల్లాల వారీగా గెజిట్ ప్రకటనలు వెలువడ్డాయి. ప్రభుత్వం నిర్వర్తించాల్సిన ప్రధాన ఘట్టం ముగియడంతో దీనిపై పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్.. సోమవారం ఎస్ఈసీకి ఈ విషయాన్ని లేఖ ద్వారా తెలియజేశారు. ప్రభుత్వం నుంచి సమాచారం అందడంతో ఇక ఎన్నికలను ఏయే తేదీల్లో చేపట్టాలనేదీ ఎస్ఈసీ తేలుస్తుంది. ప్రభుత్వానికి కూడా ఆ వివరాలను పంపిన తరువాత నోటిఫికేషన్‌ను జారీ చేస్తుంది. సిబ్బంది సన్నద్ధతను ఎస్ఈసీ పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి తేదీలను తెలియజేస్తుంది. పంచాయతీరాజ్ కొత్త చట్టంలోని నిబంధనల ప్రకారం.. ప్రభుత్వం కూడా పోలీస్ సిబ్బంది లభ్యత, ప్రకృతి వైపరీత్యాలు తదితరాలను సమీక్షించుకున్న మీదటే ఆయా తేదీలకు సమ్మతి తెలుపుతుంది. ఎన్నికలను మండలాల వారీగా మూడు విడతల్లో చేపట్టనుండటం, ఒక్కో విడతకు మధ్య గతంలో మూడు రోజుల వ్యవధి ఇవ్వగా ఇప్పుడు నాలుగు రోజుల వ్యవధిని ఇవ్వాలని ఎస్ఈసీ నిర్ణయించడం తెలిసిందే.

వ్యయం రూ.150 కోట్లు

పంచాయతీ ఎన్నికలకు రూ.150 కోట్ల మేర వ్యయం కానుంది. బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది భత్యాలు తదితరాలకు ఇంతటి మొత్తం అవసరమని ఎస్ఈసీ ప్రతిపాదించడంతో ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లోనే దాన్ని పొందుపరిచింది. ఎన్నికలను 2018, జులై నెలలో నిర్వహించాలని భావించిన ప్రభుత్వం మే నెలలో రూ.37 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తంతో ఇప్పటికే బ్యాలెట్ పత్రాలను ముద్రించి, ఎన్నికల సామగ్రిని జిల్లాల్లో సిద్ధం చేశారు. ఆర్థిక శాఖ తాజాగా మరో రూ.50 కోట్లను మంజూరు చేసింది. దీంతో ఇంతవరకు విడుదల చేసిన సొమ్ము రూ.87 కోట్లకు చేరింది.



రామోజీ ఫిల్మ్‌సిటీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అన్నదాత స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు. ఆవిష్కరణలో పాల్గొన్న 'ఈనాడు' ఎండీ కిరణ్, ఫిల్మ్‌సిటీ ఎండీలు రామమోహనరావు, విజయేశ్వరి, అన్నదాత కార్యనిర్వాహక సంపాదకుడు అమిర్నేని హరికృష్ణ, ఈనాడు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్లు కె.శ్రీనివాస్, రాజేంద్రబాబు, చీఫ్ మేనేజర్ జి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సుధాకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యేశ్వరరావు, మేనేజర్ చంద్రయ్య, వైస్ ప్రెసిడెంట్ ఏవీ రావు

అన్నదాతకు స్వర్ణోత్సవం

- 50 వసంతాలు పూర్తి చేసుకున్న మాస పత్రిక
- స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరించిన ఛైర్మన్ రామోజీరావు

ఈనాడు - హైదరాబాద్

రైతుల మానస పుత్రిక, దేశంలోనే అత్యధిక సర్క్యులేషన్ కల్గిన వ్యవసాయ మాస పత్రిక 'అన్నదాత' 50 వసంతాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రూపొందించిన స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికను సోమవారం రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు ఆవిష్కరించారు. దేశంలో పేరొందిన వ్యవసాయ రంగ నిపుణులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉప కులపతులు రాసిన వ్యాసాలను ప్రత్యేక సంచికలో పొందుపరిచారు. ఇది జీవితకాలం దాచుకోదగ్గ పుస్తకంగా నిలుస్తుంది. సంప్రదాయ సేద్యం ఆధునికత వైపు అడుగులు వేస్తున్న రోజుల్లో తెలుగు రైతులకు అండగా, సేద్య సమాచార దిక్సూచిగా 1969లో అన్నదాత మాస పత్రిక ఆవిర్భవించింది. శాస్త్రీయ సాగు విజ్ఞానం ఏ మూలన ఆవిష్కృతమైనా దాన్ని రైతులకు అందించాలనే లక్ష్యం, వ్యవసాయదారులను గౌరవ స్థానానికి చేర్చాలనే ధ్యేయంతో ఆరంభమైన ఇది అనతి కాలంలోనే రైతుల ఆత్మీయ నేస్తంగా పేరుగాంచింది. సాగుదారులు, శాస్త్రవేత్తలకు మధ్య వారధిగానూ నిలిచింది. ఇందులోని వినూత్న వ్యవసాయ విధానాలను ఆచరించి, గణనీయమైన దిగుబడులు సాధించిన వారు కోకొల్లలుగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

తెలంగాణలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

కేసీఆర్ కొత్త సంవత్సర శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకుపోవాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

సీఎం కార్యాలయంలో ఉన్నతాధికారుల కొనసాగింపు

ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులను కొనసాగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ముఖ్యకార్యదర్శిగా నర్సింగ్ రావు, కార్యదర్శులుగా స్మితా సబర్వాల్, సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శిగా పి.రాజశేఖర్‌రెడ్డి కొనసాగుతారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు.

ఏపీలో ఒకే రోజు 7 నోటిఫికేషన్లు

ఈనాడు, అమరావతి: ఏపీ రాష్ట్రంలో కొలువుల భర్తీ పోటీ వేడెక్కింది. సోమవారం ఒకే రోజు 7 నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. దీంతో నవంబరు 29 నుంచి ఇప్పటిదాకా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) మొత్తం 3,255 పోస్టుల భర్తీకి 21 నోటిఫికేషన్లు జారీ చేసినట్లైంది. ఈ ఉద్యోగాల భర్తీకి రాత పరీక్షలు ఏప్రిల్ నుంచి ఆగస్టుదాకా జరగనున్నాయి. దీంతో ఉద్యోగార్థులు పోటీ పరీక్షల్లో నిమగ్నం కానున్నారు. గ్రూప్-1లో 169 పోస్టులు, గ్రూప్-2లో 446 పోస్టులు, మరికొన్ని కలిపి సోమవారం 7 ప్రకటనలు విడుదలయ్యాయి. గత భర్తీల్లో ఉద్యోగాలు పొంది చేరనివారి స్థానాలనూ ఈ కొత్త నోటిఫికేషన్లలో చేర్చారు. దీనివల్ల భర్తీ చేయాల్సిన పోస్టుల సంఖ్య పెరిగింది.

గుంటూరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు విద్యార్థుల దుర్మరణం

ఈనాడు, గుంటూరు: నూతన సంవత్సర వేడుకలను ఘనంగా చేసుకోవాలనుకున్న వారి ఉత్సాహాన్ని పాత సంవత్సరంలోనే పాతరేసింది. స్నేహమేరా జీవితం.. అంటూ సాగుతున్న వారి అనుబంధాల్ని తుంచేసింది. ఏడుగురు ప్రాణస్నేహితుల్లో నలుగురిని పొట్టనబెట్టుకుని వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. గుంటూరు నగర శివారులోని లాలుపురం వద్ద సోమవారం విజయవాడ వైపుగా అతివేగంగా దూసుకెళ్తున్న కారు.. ఐషర్ వాహనాన్ని(లారీ) వెనుక నుంచి ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు విద్యార్థులు సాదినేని ధనూష్, గుంటూరు కోటేశ్వరరావు, చిరుమామిళ్ల సాయిరాం, గఫూర్ దుర్మరణం పాలయ్యారు. 16వ నంబరు జాతీయ రహదారిపై ఉదయం 11.15 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. ముగ్గురు విద్యార్థులు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అదేకారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు విద్యార్థులు గాయాలతో బయపడ్డారు. వీరితో పాటు లారీలోని ముగ్గురు(ఓ డ్రైవరు, ఇద్దరు కార్మికులు) స్వల్పంగా గాయపడ్డారు. ఘటనాప్రదేశంలో లభించిన స్పీడో మీటర్ ఆధారంగా వీరు గంటకు 165 నుంచి 170 కిలోమీటర్లవేగంతో ప్రయాణిస్తున్నారని వెల్లడైంది.



ప్రమాదానికి గురై తుక్కుతుక్కు అయిన కారు

పార్టీ బలోపేతంపై దృష్టి

- సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిపెట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఇప్పటి వరకూ జరిగిన లోపాలను చక్కదిద్దుకొని క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని తీర్మానించింది. ఎన్నికల ఫలితాలపై విశ్లేషణలో భాగంగా మూడు రోజుల పాటు జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ, కార్యదర్శి వర్గ సమావేశాల్లో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలను పార్టీ రాష్ట్ర కమిటీ తీసుకొంది. ఈ సమావేశాల్లో తుది రోజైన సోమవారం ముఖ్య అతిథిగా పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ, తెజస పార్టీలు కలిసివచ్చేలా ప్రయత్నాలు చేయాలని, రాకపోతే ప్రస్తుతం ఉన్నట్లుగానే ఎన్నికలకు వెళ్లాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. సంప్రదాయ ఓటుబ్యాంకుకు గండి పడడం ఆందోళన కలిగించే అంశమే అయినా దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా ఎక్కడెక్కడ లోపాలున్నాయో గుర్తించి, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. బహుజన వామపక్ష కూటమి ఏర్పాటు మంచి ప్రయత్నమే అయినా ప్రజల్లోకి బీఎల్ఎఫ్ అజెండాను తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్నారు. 8,9 తేదీల్లో నిర్వహించే కార్మిక సంఘాల ఆందోళనకు సీపీఎం మద్దతిస్తుందన్నారు.

సీఎం కేసీఆర్‌తో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ భేటీ

న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, ఇతర న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారానికి ఆయనను ఆహ్వానిస్తూ పత్రికను అందజేశారు. ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం రాజ్‌భవన్‌లో ఉ.8.30కి జరుగుతుండగా దానికి సీఎం హాజరవుతారు. తర్వాత హైకోర్టులో ఇతర న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం ఉంటుంది. ఈ కార్యక్రమంలోనూ సీఎం పాల్గొంటారు.

ఏపీ సీఎం చంద్రబాబుపై న్యాయవాది ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సోమవారం ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు.. నిబంధనలకు విరుద్ధంగా ఐఎంజీ భారత్ కంపెనీకి 400 ఎకరాలు కేటాయించారని సదరు న్యాయవాది ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిసింది. దీనిపై రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చిరంజీవులను వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన విషయం నిజమేనన్నారు. తపాల్ సెక్షన్‌లో ఎవరో ఫిర్యాదు ఇచ్చి వెళ్లినట్లు తెలిసిందని, దాన్ని పరిశీలించి తదుపరి విచారణ చేపడుతామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు సుమారు 850 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా ఐఎంజీ భారత్‌కు కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

దేహదారుఢ్య పరీక్షలు మరింత ఆలస్యం

ఆందోళనలో పోలీసు ఉద్యోగార్థులు

ఈనాడు, హైదరాబాద్: పోలీసు ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు మరింత అలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. వాస్తవానికి డిసెంబరు 17నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈపరీక్షలు మొదలుకావాల్సి ఉంది. అయితే కొంత మంది అభ్యర్థులు రాత పరీక్షలో ఇచ్చిన కొన్ని ప్రశ్నలపై అభ్యంతరం లేవనెత్తుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ పరీక్షలు వాయిదా పడ్డాయి. తొందర్లోనే న్యాయస్థానం నుంచి ఆదేశాలు వస్తాయని, ఆ వెంటనే దేహదారుఢ్య పరీక్షలు మొదలుపెట్టవచ్చని రాష్ట్రస్థాయి పోలీసు నియామక మండలి అధికారులు భావించారు. కాని న్యాయస్థానం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ప్రస్తుతం యథాతథస్థితి కొనసాగుతోంది. పోలీసుశాఖలోని వివిధ విభాగాల్లో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు రాత పరీక్ష పూర్తయిన సంగతి తెలిసిందే. వీరికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. 3లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇవి మొదలైన తర్వాత పూర్తికావడానికి కనీసం 30నుంచి 40 రోజుల వ్యవధి పడుతుంది. ముందు అనుకున్నట్లు డిసెంబరు 17నుంచి మొదలై ఉంటే జనవరి చివరి నాటికి పూర్తయ్యేవి. కనీసం మార్చిలోనైనా ఫలితాలు వచ్చేవి. ఇప్పుడు ఈ పరీక్షలు వాయిదా పడటం, మళ్లీ ఎప్పుడు మొదలవుతాయో తెలియకపోవడంతో అభ్యర్థులు ఆందోళనచెందుతున్నారు.

ప్రభుత్వ శాఖల సమాచారం ఒకే చోట

- ప్రత్యేకంగా డ్యాష్ బోర్డు
- 48 శాఖల సమగ్ర వివరాలు, పురోగతి అందుబాటులోకి
- రాష్ట్ర సర్కారు కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల సమగ్ర సమాచారం అంతా ఒకే చోట అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం కొన్ని శాఖలు మాత్రమే సమాచారాన్ని ఆయా శాఖల వెబ్‌సైట్‌లలో ఉంచాయి. అత్యధిక శాఖలకు సంబంధించి ఎలాంటి వివరాలూ లభ్యంకావడంలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాలకు సంబంధించిన సమాచారం మొత్తం ఒకే డ్యాష్‌బోర్డు ద్వారా లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని 48 శాఖలకు సంబంధించి డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయనున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రాథమికంగా చర్చించారు. ప్రభుత్వ శాఖల సమాచారం వెబ్‌సైట్‌లలో ఉన్నా పూర్తిస్థాయిలో ఉండటంలేదని గుర్తించారు. చాలా శాఖలు వివరాలను ఎప్పటికప్పుడు మార్చడం లేదు. సమగ్ర సమాచారంతో పాటు శాఖల పురోగతినీ డ్యాష్‌బోర్డులో వివరిస్తారు. సమాచార హక్కుచట్టం ప్రకారం కూడా ప్రభుత్వ శాఖలన్నీ పూర్తి వివరాలను ఆయా శాఖల వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచాలి. ఈ నేపథ్యంలో శాఖల్లో జవాబుదారీతనం పెంపుతోపాటు అవి అమలు చేసే కార్యక్రమాలు, పథకాల పురోగతిని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు డ్యాష్ బోర్డులు ఉపయోగపడనున్నాయి. అంతేగాక వినియోగదారులకు అవసరమైన సమగ్ర సమాచారం సులభంగా అందుబాటులో ఉంటుంది. గ్రాఫిక్‌ల రూపంలో కూడా వివరాలు ఉండటంతో సులభంగా అవగాహన చేసుకునేందుకు దోహద పడుతుంది.

గ్రంథపాలకుల పోస్టుల ప్రాథమిక ఫలితాలు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: బీసీ, గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో గ్రంథపాలకుల (లైబ్రేరియన్) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను టీఎస్‌పీఎస్సీ సోమవారం ప్రకటించింది. గిరిజనశాఖలో వసతిగృహ సంక్షేమ అధికారి గ్రేడ్-1 పోస్టుల ఫలితాలను వెల్లడించింది. ఈ ఫలితాలు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు పేర్కొంది.

సేవా పతకాలు ప్రకటించిన ప్రభుత్వం

పోలీసు శాఖతోపాటు పలు విభాగాల్లో ప్రతిభ చూపినవారి ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: విధి నిర్వహణలో మంచి ప్రతిభ చూపిన పోలీసులతోపాటు వివిధ విభాగాల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంవత్సరం సందర్భంగా పతకాలు ప్రకటించింది. పోలీసులు, అగ్నిమాపక, జైళ్లు, ప్రత్యేక పోలీసు దళం, అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సిబ్బందిని ఈ పతకాలకు ఎంపిక చేసింది. 15 మందికి తెలంగాణ రాష్ట్ర శౌర్య పతకం, 17 మందికి మహోన్నత సేవా పతకం, 91 మందికి ఉత్తమ సేవా పతకం, 50 మందికి కఠిన సేవాపతకం, 371 మందికి సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రత్యేక భద్రతా దళానికి చెందిన సిబ్బందిలో ఒకరికి మహోన్నత సేవాపతకం, ఇద్దరికి ఉత్తమ సేవాపతకాలు, 15 మందికి సేవాపతకాలు లభించాయి. విపత్తు స్పందన అగ్నిమాపక శాఖలో ఇద్దరికి ఉత్తమ సేవా పతకాలు, 14 మందికి సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఒకరికి మహోన్నత సేవాపతకం, ముగ్గురికి ఉత్తమ సేవాపతకాలు, 9 మందికి సేవా పతకాలు దక్కాయి. అవినీతి నిరోధకశాఖలో ముగ్గురికి ఉత్తమ సేవా పతకాలు, 18 మందికి సేవా పతకాలు లభించాయి.

మే 2 నుంచి ఎంసెట్!

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ ఎంసెట్‌ను మే 2వ తేదీ నుంచి అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. గత ఏడాది ఏ తేదీల్లో జరిగాయో దాదాపు అన్ని ప్రవేశ పరీక్షలు ఈసారి అవే తేదీల్లో జరగనున్నాయి. గత ఏడాది మే 2వ తేదీ నుంచి నెలాఖరు వరకు మొత్తం ఏడు రకాల ప్రవేశ పరీక్షలను తెలంగాణలో నిర్వహించారు. ఒక్క పీఈసెట్ తప్ప మిగిలిన ఎంసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీఈసెట్, ఐసెట్‌లను ఆన్‌లైన్ విధానంలో జరిపారు. మే 2 నుంచి 7వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మే 6వ తేదీ మాత్రం నీట్ ఉండటంతో ఆ రోజు జరపలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ చివరి వారంలో మొదలయ్యాయి. రెండు రాష్ట్రాల్లో ప్రవేశ పరీక్షలు రాయాలనుకున్నా విద్యార్థులకు ఇబ్బంది లేకుండా రెండు మూడు రోజులు వ్యవధి ఉండేలా పరీక్షల తేదీలను నిర్ణయించారు. ఈసారి కూడా అదేవిధంగా జరపనున్నారు. ఈసారి మే 5న నీట్ జరగనుంది. దాంతో ఈసారి కూడా గత ఏడాది తరహాలోనే జరిపే అవకాశం ఉంది. మే 9న ఈసెట్, 20న పీఈసెట్, 23, 24న ఐసెట్, 25న లాసెట్, 31న ఎడ్‌సెట్ జరిగే అవకాశం కనిపిస్తోంది.

ఎంసెట్ కన్వీనర్ మార్పు!

పీజీఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, ఐసెట్ కన్వీనర్లలో కొందరు పదవీ విరమణ చేయటం.. మరి కొందరు త్వరలో పదవీ విరమణ చెందనుండటంతో ఆ నాలుగు పరీక్షలకు కొత్త కన్వీనర్లను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించనుంది. ఐసెట్‌ను గత ఏడాది కాకతీయ విశ్వవిద్యాలయానికి ఇవ్వగా ఈసారి ఓయూకు అప్పగించాలని భావిస్తున్నారు. మరోవైపు ఐసెట్‌ను తమకు ఇవ్వాలని మహాత్మాగాంధీ వర్సిటీ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్ ప్రతిపాదిస్తున్నా అక్కడ ఆచార్యులు లేకపోవడం ప్రతిబంధకంగా మారింది. ఇక 2016 ఎంసెట్-2 నుంచి కన్వీనర్‌గా ఉన్న ఆచార్య యాదయ్య స్థానంలో కొత్త వారిని నియమించాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నట్లు తెలిసింది. యాదయ్య రిజిస్ట్రార్‌గా ఉండటం, ఇప్పటికే మూడుసార్లు కన్వీనర్‌గా పనిచేయడంతో కొత్తవారికి ఇవ్వాలని భావిస్తున్నారు. దాంతో జేఎన్‌టీయూహెచ్‌లో అకడమిక్ విభాగం సంచాలకుడిగా ఉన్న ఆచార్య బండారి, ప్రవేశాల విభాగం సంచాలకుడు, ఎంసెట్‌కో కన్వీనర్‌గా పనిచేసిన మంజూర్ హుస్సేన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఈసెట్ కన్వీనర్‌గా ఉన్న గోవర్ధన్ ప్రస్తుతం రెక్టార్‌గా ఉండటంతో ఆయన్నూ మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాంతో బండారికి ఎంసెట్ లేదా ఈసెట్‌లో ఏదోఒకటి అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది.

పసిమొగ్గలను చిదిమేసిన ఇద్దరికి జీవిత ఖైదు

- తీర్పు వెలువరించిన సంగారెడ్డిజిల్లా న్యాయస్థానం



వడ్డెర నర్సింహులు



అజయ్ అలియాస్ రవిరాజ్ బార్

ఈనాడు, సంగారెడ్డి: పసి పాపలపై అత్యంత కిరాతకంగా అత్యాచారానికి ఒడిగట్టిన ఇద్దరికి జీవితఖైదు పడింది. సంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి సాయికల్యాణ్ చక్రవర్తి సోమవారం ఈ మేరకు తీర్పునిచ్చారు. 2012, 2017లో చోటు చేసుకున్న ఈ రెండు ఘటనలకు సంబంధించి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జొన్న శ్రీనివాసరెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. పోక్సోతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానానికి సమర్పించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మొగుడంపల్లికి చెందిన వడ్డెర నర్సింహులు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ అలియాస్ రవిరాజ్ బార్‌లకు జీవితఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోని మొగుడంపల్లి మండలం హరిచంద్‌నాయక్ తండాకు చెందిన అయిదేళ్ల చిన్నారి పాఠశాలకు వెళ్లి అక్కతో కలిసి ఇంటికి తిరిగి వస్తోంది. ఇదే సమయంలో మొగుడంపల్లికి చెందిన వడ్డెర నర్సింహులు(31) ఆ పాపను బలవంతంగా ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. డిసెంబరు 13, 2012న జరిగిన ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన అజయ్(28) మనోహరాబాద్ సమీపంలోని ఒక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. ముప్పిరెడ్డిపల్లిలో అద్దెకు ఉండేవాడు. ఇతడు నివసించే ఇంటి పక్కనే బిహార్ నుంచి ఉపాధిని వెతుక్కుంటూ వచ్చిన మరో కుటుంబం నివసించేది. ఈ క్రమంలో ఆ ఇంట్లో ఉండే ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడటంతో పాటు హత్య చేశాడు. 2017 డిసెంబరు 6న చిన్నారి చదువుతున్న పాఠశాలకు వెళ్లిన అజయ్ అక్కడే ఆడుకుంటున్న పాపకు చాక్లెట్ ఆశచూపి గ్రామ శివారులోని కల్వర్టు వద్దకు తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జరిగిన మరుసటి రోజు చిన్నారి మృతదేహం లభ్యమైంది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేశారు.

మోసం కేసులో ఏడేళ్ల జైలు

- సిటీ స్క్వేర్ మాడ్యులార్ ఇండస్ట్రీస్ ఎండీకి శిక్ష ఖరారు
- జంట నగరాల్లో 9 కేసులు



తిరువీధుల బాబూరావు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మోసం కేసులో సిటీస్క్వేర్ మాడ్యులార్ ఇండస్ట్రీస్ ఎండీ తిరువీధుల బాబూరావు(40)కు కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ఇతనిపై జంట నగరాల్లోని పోలీస్ స్టేషన్లలో 9 కేసులు నమోదై ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి కథనం ప్రకారం.. 2011లో బంజారాహిల్స్ రోడ్ నంబరు 11లో నివసించే విజయలక్ష్మి తన ఇంటిని అద్దెకు ఇస్తానంటూ ఓ దినపత్రికలో ప్రకటన ఇచ్చారు. 'శ్రీలక్ష్మి మెగా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థలో ప్రాజెక్టు డైరెక్టర్‌నంటూ బాబూరావు ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఇల్లు అద్దెకు కావాలన్నాడు. అద్దె రూ.80వేల చొప్పున 3నెలల అడ్వాన్స్ ఇవ్వాలని ఆమె కోరారు. తమ సంస్థ 7నెలల అద్దెను చెక్కురూపంలో ఇస్తుందని, అందులో 3నెలల డబ్బు మినహాయించుకొని మిగిలినది చెక్కుగా ఇవ్వాలంటూ ఆమెకు సూచించాడు. బాబూరావు చెక్కును తీసుకున్న విజయలక్ష్మి.. రూ.3.2లక్షల చెక్కును అతనికి ఇచ్చారు. ఆ చెక్కును బాబూరావు రూ.4.2లక్షలుగా ఫోర్జరీ చేసి డబ్బుడ్రాచేశాడు. తన చెక్కుకు స్టాప్ పేమెంట్ పెట్టాడు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా.. జూబ్లీహిల్స్ పోలీసులు బాబూరావును అరెస్టు చేశారు. సోమవారం నాంపల్లిలోని 17వ చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ బి.శ్రీనివాసరావు నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.15వేల అపరాధ రుసుమును విధిస్తూ తీర్పునిచ్చారు. స్వర్ణకాంతి కృష్ణ అలియాస్ గనపవరం శ్రీధర్‌రెడ్డి అలియాస్ వెంకటరెడ్డి అలియాస్ సదాశివకుమార్‌రెడ్డి పేర్లతో బాబూరావు పలు మోసాలకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని సిటీస్క్వేర్‌మాల్‌లో 'సిటీస్క్వేర్ మాడ్యులార్ ఇండస్ట్రీస్' సంస్థను ఏర్పాటు చేసి.. ఫ్రాంచైజీల పేరుతో తెలుగు రాష్ట్రాల్లో పలువురిని రూ.కోట్లలో మోసంచేసిన ఘటనల్లోనూ ఇతను నిందితుడు.

ఈనాడు

సమాచార స్వేచ్ఛ వికసించేలా...

ప్రజాస్వామ్య గణతంత్ర భారతావని ఈ ఏడాది డెబ్బయ్యో పడిలోకి అడుగిడుతోంది. 'భారత ప్రజలమైన మేము...' అంటూ రాజ్యాంగాన్ని రాసుకొని తమకు తామే సమర్పించుకొన్న పౌరులే ప్రజాస్వామ్యంలో 'సుప్రీం' అనడంలో మరో మాట లేకపోయినా, ఆ స్ఫూర్తికి ఎత్తుపీట వేసే చట్టాల సక్రమ అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబద్ధత కాకి బంగారాన్ని తలపిస్తోంది. 'పాలకులు తమ అధికారాన్ని దుర్వినియోగం చెయ్యకుండా నిలువరించగలిగే సామర్థ్యం ప్రజలందరికీ ఒనగూడినప్పుడే స్వరాజ్యం వచ్చినట్లు' అని తీర్మానించారు మహాత్మా గాంధీ. ఆ సామర్థ్యాన్ని ప్రజలకు దఖలుపడేలా చేసిన సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి పదమూడేళ్లు అయింది. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో సమాచార కమిషన్లు సక్రమంగా కొలువు తీరకపోవడంపై సర్వోన్నత న్యాయపాలిక కన్నెర్ర చేసిన నేపథ్యంలో- కొత్త సంవత్సర కానుకా అన్నట్లు కేంద్ర సమాచార కమిషనుకు కొత్త సారథిని, మరో నలుగురు సమాచార కమిషనర్లను మోదీ ప్రభుత్వం నియమించింది. ఇంత క్రితం దాకా ప్రధాన కమిషనర్‌తోపాటు ఏకాయెకి ఎనిమిది ఖాళీలతో ఉండి లేనట్లున్న సమాచార సంఘానికి కొత్తగా కొంత సత్తువ చేకూరినట్లే. తాజాగా నియమితులైనవారిలో కేంద్ర న్యాయశాఖ మాజీ కార్యదర్శి సహా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ అధికారులుండగా ఈ ఏడాది పదవీ విరమణ చేసినవారే! సమాచార కమిషనర్ల నియామక ప్రక్రియలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శకత పాటించాలంటూ- సెర్చ్ కమిటీలతో పాటు దరఖాస్తుదారుల వివరాల్ని వెబ్‌సైట్లో పొందుపరచాలని డిసెంబరు 13న సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. ప్రధాన కమిషనర్ పదవికి 65, కమిషనర్ల పదవులకు 280 దరఖాస్తులు వచ్చాయన్న కేంద్రం- సెర్చ్ కమిటీ వడపోత పూర్తి అయిందని, తుది నిర్ణయమే తరువాయి అని ప్రకటించి, తాజా నియామకాలతో ఎంపిక క్రతువును ముగించేసింది. మంచి చెయ్యడమే కాదు, మంచిగానూ చెయ్యాలన్న మహితోక్తిని పాలక శ్రేణులు పెడచెవిన పెడితే- జన శ్రేయస్సాధక వ్యవస్థలు ఎలా జేగీయమానం అవుతాయి?

'బ్యూరోక్రసీ తాళానికి ప్రజలు చిందులు వేయాల్సివచ్చినా, ఇంతకూ అది ఏ రాగమో తానమో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది'- లోగడ ఒక ఆస్ట్రేలియన్ న్యాయమూర్తి పలికిన సమాచార స్వేచ్ఛాగీతిక అది. అవినీతికి అడ్డుకట్ట పడాలన్నా, ప్రభుత్వ విభాగాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నా పారదర్శకత ముఖ్యమని సమాచార హక్కు చట్టం పీఠికే నిర్దేశించింది. దురదృష్టమేమిటంటే, చిత్తశుద్ధిలేని శివపూజలా చట్టం అమలుకు సంకల్పించిన నేతాగణాలు- ఆది నుంచీ సమాచార కమిషనర్ల కుర్చీలలోనే రాజకీయ కుహకాలు వెలగబెట్టాయి. నియామక ప్రక్రియలో అత్యంత కీలకమైన పారదర్శకతకు ఏడు నిలువుల లోతు పాతరేశాయి. ఆర్టీఐ చట్టంలోని 12 (5) విభాగం- న్యాయం, శాస్త్ర సాంకేతికం, సామాజిక సేవ, పాత్రికేయం, నిర్వహణ, పాలన వంటి రంగాల్లో విశేషానుభవం గల విశిష్ట వ్యక్తుల్ని సమాచార కమిషనర్ల పదవులకు ఎంపిక చేయాలని లక్ష్మణ రేఖలు గీసింది. దేశవ్యాప్తంగా పలు సమాచార కమిషన్లు- పాలకపార్టీ పెద్దల రాజకీయ అంతేవాసుల పునరావాస కేంద్రాలుగా, తమ అడుగులకు మడుగులొత్తిన మాజీ బ్యూరోక్రాట్ల పునర్నియామక శిబిరాలుగా భ్రష్టుపట్టి పోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు రాజకీయ కమిషనర్ల నియామకాన్ని 2013 సెప్టెంబరులో సుప్రీంకోర్టు అడ్డంగా కొట్టేసింది. అధికారంలో ఉన్నంతకాలం సమాచారాన్ని ప్రజల కంట పడకుండా కాచుకోవడమే విధ్యుక్తధర్మంగా పనిచేసిన మాజీ బ్యూరోక్రాట్లను ఏరికోరి సమాచార కమిషనర్లుగా ఎంపిక చేస్తుండటం- చట్టం స్ఫూర్తిని అపహసిస్తున్న తీవ్ర నేరం. ప్రజాహితంతో నేరుగా ముడివడిన సమాచార యంత్రాంగంలో మౌలిక సదుపాయాల్ని బిగబట్టి, కమిషనర్ల ఖాళీల్ని పేరబెట్టి, రెక్కలు తెగిన జటాయువులా వాటిని ప్రభావ శూన్యం చెయ్యడం- అంతకంటే ఘోరం!

పౌరులకు గల తెలుసుకొనే హక్కు తిరుగులేనిదని సుప్రీంకోర్టు పలు చరిత్రాత్మక తీర్పుల్లో స్పష్టీకరిస్తున్నా- దొడ్డిదారుల్లో ఆ హక్కును తొక్కిపట్టే దురన్యాయమే ఎక్కడికక్కడ దౌర్జన్యాంగా చలామణీ అవుతోంది. దేశీయంగా 303 మంది సమాచార కమిషనర్ల అర్హతల్ని ఆరాతీస్తే 59 శాతం పూర్వ ఉద్యోగులని, 14 శాతం చట్టం న్యాయపాలన విభాగాలవారని, పాత్రికేయం నుంచి ఎనిమిది శాతం, సామాజిక సేవా కార్యకర్తలు మూడు శాతమేనని అధ్యయనాలు చాటుతున్నాయి. సమాచార వితరణకు మాజీ ప్రభుత్వోద్యోగులు అడ్డుగోడగా నిలుస్తున్నారని జనం మొత్తుకొంటుంటే, కమిషనర్లే లేక ఎనిమిది రాష్ట్రాల్లో సమాచార సంఘాలే చచ్చుపడటం మరో వైపరీత్యం. ఈ నెల మూడోవారంలోగా పూర్తిస్థాయి నియామకాలు సాగించాలన్న న్యాయపాలిక విస్పష్ట ఆదేశాలే, సరికొత్త ఆశాదీపం! 2016-17లో తొమ్మిది లక్షలకు పైబడిన ఆర్టీఐ అర్జీలు, పౌరుల్లో సమాచార స్పృహను కళ్లకు కడుతున్నా, అర్జీల పరిష్కారానికి కేరళలో ఆరేళ్లు, ఒడిశాలో అయిదేళ్లు పడుతుండటం అధ్యయనాలు నిర్ధారణ కలిగిస్తున్నాయి. పులి మీద పుట్రలా- సమాచార కమిషనర్ల జీతనాతాలు సర్వీసు కాల నిబంధనలను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తం, సమాచార హక్కును విదిమేసే దుస్తంత్రం తీవ్ర విమర్శలపాలైంది. విపక్షాల ఎదురుదాడితో కేంద్రం వెనక్కుతగ్గినా, దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లకు సరికొత్త జవసత్వాలు కల్పించి తగు మౌలిక సదుపాయాలతో పరిపుష్టీకరించి- స్వేచ్ఛగా సమాచార ప్రసరణానికి ప్రభుత్వాలన్నీ కూడిరానిదే, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాలు ఎలా పాదుకొంటాయి? సమాచార స్వేచ్ఛా గళాలకు శృంఖలాలు బిగిస్తే అవినీతి అరాచకాలే రాజ్యమేలుతాయన్న స్పృహ పాలకుల్లో పాదుకొంటే- దేశవ్యాప్తంగా సుపరిపాలనకు మేలుబాటలు పరచుకొంటాయి!

సిసలైన సమాఖ్యకు సమయమిదే!

ఎన్నికల ఏడాది - ఆశల పునాది



డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్

దేశంలో లోక్‌సభకు, ఎనిమిది రాష్ట్రాల శాసనసభలకు ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. మే-జూన్ మాసాల్లోగా లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జమ్మూకశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాలి. ఆ తరవాత అక్టోబరు మాసంలోగా మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల ఎన్నికలు పూర్తవుతాయి. ఝార్ఖండ్‌లో డిసెంబరు మాసాంతానికి ఎన్నికల ప్రక్రియ ముగియాలి. ఎలెక్షన్లలో ఓట్ల కొనుగోలు పెరిగిపోయింది. తాత్కాలిక తాయిలాల ఆశచూపడం మునుపెన్నడూ లేని స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఏమాత్రం తేడా లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ఎవరు గెలిచినా జరగబోయేది ఒకటే అనే నిర్వేదం ఆవహిస్తోంది! అధికారం చేజిక్కించుకునేందుకు పెట్టుబడిగా ఓట్ల కొనుగోలు కోసం పోటాపోటీగా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దాంతో ఎన్నికలయ్యాక ఏదో ఒక రూపంలో అక్రమార్జన చేయడం ఆనవాయితీగా మారింది. ఎన్నికలవల్ల పదవుల్లో ఎవరిని కూర్చోబెట్టాలన్న నిర్ణయమే జరుగుతోంది. ఎవరు నెగ్గినా నిజంగా సామాన్యుల బతుకులు బాగుపడతాయని కాని, ప్రజల పన్నుల డబ్బుతో వారికి కావలసిన ఉమ్మడి సేవలు, మౌలిక సదుపాయాలు సమర్థంగా, నిజాయతీగా అందుతాయనికాని నమ్మకం కుదరని పరిస్థితి దాపురించింది.

వనరుల దుర్వినియోగం

ప్రభుత్వ సేవల్లో, కాంట్రాక్టుల నిర్వహణలో, నేర పరిశోధనలో, సహజ వనరుల కేటాయింపుల్లో, బదిలీల్లో అవినీతి పెట్రేగుతోంది. జనం చెల్లించిన పన్నుల డబ్బంతా ఉద్యోగుల జీతభత్యాలకు, ఉచితాల హామీలకే సరిపోవడం లేదు. దాంతో పిల్లల భవిష్యత్తును కాపాడుకునేందుకు, పేదరిక నిర్మూలనకు, బడుగుల బిడ్డలకు ఎదిగే అవకాశాలు సృష్టించేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు; గ్రామీణ వ్యవసాయ రంగాలను సంక్షోభం నుంచి బయటపడేసి ఆదాయాలు పెంచేందుకు వనరులు చాలని పరిస్థితి వచ్చింది. పీవీ నరసింహారావు ప్రభుత్వం 1991లో ఆర్థిక సంస్కరణలు చేపట్టడంవల్ల ఆ మేరకైనా భారత్ నిలదొక్కుకొంది. దానివల్ల ఆదాయాలు, ఆర్థిక ప్రగతి కొంతమేర పెరిగి జాతికి ఆత్మవిశ్వాసం కలిగింది. సంపద, ఉత్పాదకత పెరగాలంటే ప్రభుత్వ సేవలు సకాలంలో, లంచాల బెడద లేకుండా సమర్థంగా ప్రజలకు చేరాలి. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు మౌలిక సదుపాయాలు మెరుగుపడాలి. మంచి ప్రమాణాలతో కూడిన విద్య, ఆరోగ్యం సామాన్యులకు ఆర్థిక భారం లేకుండా అందాలి. చట్టం అందరినీ సమానంగా చూస్తూ, సామాన్యుల హక్కులను సమర్థంగా కాపాడాలి. సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగానికి విముక్తి కలిగించి, రైతుల ఆదాయాలు పెరిగే విధానాలు, పద్ధతులు అనుసరించాలి. కాని ఈ రంగాల్లో గడచిన పాతికేళ్లుగా మన ప్రభుత్వాలు చాలావరకు విఫలమయ్యాయి. అనూహ్యమైన, మౌలికమైన మార్పులు వస్తాయన్న విశ్వాసంతో, ఆశతో 2014లో దేశ ప్రజలు నరేంద్ర మోదీకి పట్టం కట్టారు. అరకొర విధానాలు, వాగాడంబరం తప్ప పైన వివరించిన ఏ రంగాల్లోనూ గణనీయమైన మార్పులు రాలేదు.

దేశ ప్రజల్లో భవిష్యత్తు బాగుపడాలనే తపన ఉంది. భారతీయ కుటుంబాలు చాలా బలమైనవి. ప్రభుత్వం మంచి చేస్తుందన్న విశ్వాసం ఉంటే కష్టకాలంలోనూ మద్దతిచ్చే పౌరులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. దేశం ఆర్థికంగా, సామాజికంగా పురోగమించేందుకు అవసరమైన లక్షణాలన్నీ మనకున్నాయి. లేనిదల్లా మన భవిష్యత్తును పదిలపరచే రాజకీయ, పాలన వ్యవస్థలే! ప్రజలు వేసే ఓటుకు, వారి జీవితాలకు మధ్య సంబంధం తెగిపోయింది. కేంద్రీకృత పాలనలో ఎవరు నెగ్గినా తేడా లేకుండా పోయింది. తమ దీర్ఘకాలిక భవిష్యత్తుకు ప్రభుత్వాల నుంచి తగిన భరోసా లేనప్పుడు, రెక్కాడితేగాని డొక్కాడని సామాన్యులు, బతుకుపోరాటంలో అలసిపోతున్నవారు తాత్కాలిక ఆకర్షణలకు లోబడటం ఆశ్చర్యం కాదు. దేశ నాయకత్వం స్వాతంత్ర్యానంతరం విలువైన ఏడు దశాబ్దాలను, ఆర్థిక సరళీకరణల అనంతరం పాతికేళ్లను వృథా చేయడంవల్ల సంక్షోభం ముదిరింది. ఈ పరిస్థితికి పార్టీలను తిట్టిపోయడం వ్యర్థం. అవన్నీ ఊబిలో కూరుకుపోయాయి. నీతివాక్యాలతోనో, కొందరి త్యాగాలతోనో, దైవకృపతోనో పరిష్కారమయ్యే సంక్షోభం కాదిది. ఇప్పటికైనా మేలుకుని మన బిడ్డల భవిష్యత్తును కాపాడుకోవాలంటే చేపట్టవలసిన ఆచరణసాధ్యమైన చర్యలేమిటి? ఈ ఏడాది మనందరి దృష్టి దీని మీదే ఉండాలి. ఎవరు నెగ్గుతారన్న ఉత్కంఠకు బదులు, ఏం చేస్తే ఈ చిక్కుముడులు విప్పగలమనే ఆలోచనే చర్చలో కీలకమైన అంశం కావాలి. అయిదో దశకం మొదలు ఎనిమిదో దశకం దాకా సుమారు నలభయ్యేళ్లకాలం భారత్‌లో పేరుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నప్పటికీ- పెత్తనమంతా కేంద్రానిదే! ఆ తరువాత ఎన్‌టీఆర్, హెగ్డే, జ్యోతిబసు, బిజూపట్నాయక్, కరుణానిధి వంటి నాయకులు దీర్ఘకాల పోరాటం చేసి రాష్ట్రాలకు కొంతమేరకు స్వయంపాలనను, అధికారాలను సాధించారు. బొమ్మై కేసులో న్యాయస్థానం తీర్పుతో 356వ అధికరణ దుర్వినియోగం తగ్గింది. ప్రజల మద్దతు, సభలో మెజారిటీ ఉన్నప్పటికీ తమ ప్రభుత్వాన్ని ఏ క్షణంలో తొలగిస్తారో అన్న భయం చాలావరకు రాష్ట్రాల్లో తగ్గింది. ఆర్థిక సంఘాలు పక్షపాతాలకు అతీతంగా, నిబంధనల మేరకు రాష్ట్రాలకు వనరుల పంపిణీకి ఏర్పాట్లు చేయడంతో కేంద్ర విచక్షణాధికారం తగ్గింది. ప్రాంతీయ పార్టీలు బలపడ్డాయి. రాజకీయంగా పోటీ పెరిగింది. కేంద్రంలో సంకీర్ణాలు అనివార్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాల అభిప్రాయాలను, అవసరాలను పట్టించుకోవడం తప్పనిసరిగా మారింది. 1991లో మొదలైన ఆర్థిక సరళీకరణతో లైసెన్సు రాజ్యం చాలావరకు అంతమై ఆర్థిక వికేంద్రీకరణ సాధ్యపడింది. పెట్టుబడుల కోసం, పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్రాలు సొంతంగా చొరవ తీసుకోవడం మొదలు పెట్టాయి. గడచిన రెండు మూడు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాల్లో ఆర్థిక ప్రగతి రేటు పెరిగింది.



ఇప్పటికీ ప్రజలిచ్చిన తీర్పునకు అనుగుణంగా పనిచేసి పూర్తి ఫలితాలను అందించే స్వేచ్ఛ, స్వయంపాలన రాష్ట్రాలకు లేవు. మరే సమాఖ్య దేశంలోను లేని రీతిన భారత్‌లో రాష్ట్రాలన్నింటికీ మూసపోసినట్లుగా ఒకే రకమైన ఎన్నికల వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా ఉన్నాయి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సంస్కరణలకు సమకట్టే అవకాశాలు లేవు. మరే దేశంలోనూ లేనట్లుగా- స్థానిక ప్రభుత్వాల ఎన్నికల పద్ధతిని సైతం సవివరంగా రాజ్యాంగంలోనే పెట్టి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్మాణం చేసుకునే అవకాశం లేకుండా గిరి గీశారు. అఖిల భారత సర్వీసులు అన్న పేరుతో రాష్ట్రాల్లో పనిచేసే అధికారుల పగ్గాలన్నీ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో పెట్టారు. సమర్థులు తమ రాష్ట్రాల్లో ఉన్నా, వారిని కొంత కాలంపాటు ప్రభుత్వంలోకి తీసుకుని మార్పులను సాధించి మంచిపాలనను అందించే అధికారం రాష్ట్రాలకు లేదు. అడవులు, విద్య, భూసేకరణ వంటి రాష్ట్రాల అంశాలను వివిధ కారణాలు చూపెట్టి ఉమ్మడి జాబితాలో చేర్చి- ఏ చిన్న పని కావాలన్నా కేంద్రం నుంచి అనుమతి అవసరమయ్యే పరిస్థితి తెచ్చారు. ఉదాహరణకు విద్యాహక్కు చట్టం వల్ల విద్యాప్రమాణాలు బాగుపడకపోగా గడచిన దశాబ్దంలో అవి బాగా దిగజారాయి. అయినా కేంద్ర చట్టమే రాష్ట్రాలకు శిరోధార్యం! అలాగే భూమి రికార్డులు, నియంత్రణ రాష్ట్రాలకు చెందిన అంశమైనా- పునరావాసం కేంద్రం పరిధిలోనిదన్న వంకతో నిజమైన ప్రజాప్రయోజనాలకు భూసేకరణ దాదాపు అసాధ్యమయ్యే పరిస్థితి కల్పించారు. పశువుల పెంపకం రాష్ట్రాలకు చెందిన అంశమైనా- జంతుహింస నివారణ కేంద్రానికి చెందిన అంశం అన్న వంకతో కొంతకాలం క్రితం పశువుల వాణిజ్యం అంతటిని చాలా కఠినంగా, రైతులను దెబ్బతీసేలా నియంత్రిస్తూ నిబంధనలు జారీ చేశారు. కోర్టుల జోక్యంతో వాటిని నిలుపు చేశారు! అలాగే కేంద్ర ప్రతిపాదిత పథకాలు అన్న పేరుతో దేశమంతా ఒకే మూసలో పిడుక్కీ బియ్యానికి ఒకే మంత్రంలాగా రాష్ట్రాల మీద అసంబద్ధ విధానాలు రుద్దుతున్నారు. ఇలా ఎక్కడ చూసినా పెత్తనం, జోక్యం కేంద్రానిది. ప్రజా తీర్పు, బాధ్యతలు, బరువులు రాష్ట్రాలివి!

దేశంలో పెద్ద రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోమ్‌లలో మాత్రమే ప్రత్యక్షంగా భాజపా-కాంగ్రెస్ పోటీపడుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్‌లలో రెండు జాతీయ పార్టీలకు కీలకపాత్ర ఉన్నా- శివసేన, ఎన్‌సీపీ, జనతాదళ్ (ఎస్), అకాలీదళ్ లాంటి ప్రాంతీయ పార్టీల పాత్ర గణనీయమైనది. ఝార్ఖండ్‌లో భాజపా బలంగా ఉన్నా, మిగతావన్నీ ప్రాంతీయ పార్టీలే. అన్ని ఇతర రాష్ట్రాల్లోను ప్రాంతీయ పార్టీల పాత్ర కీలకమైనది. ఈ ప్రాంతీయ రాజకీయ పక్షాలన్నింటికీ తాము ఆశించిన మేరకు ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని, కేంద్ర అనవసర పెత్తనం లేదా దేశమంతా ఒకే మూస పోసిన పద్ధతులవల్ల ఫలితాలు రావడం లేదని, ఆ నిందను తాము మోస్తున్నామని, ప్రజల వ్యతిరేకతను మూటకట్టుకుంటున్నామని తెలుసు! మరోవంక జాతీయపార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు బయటకు చెప్పుకోవడం కుదరకపోయినా- తమ రాష్ట్రాల్లో ప్రజల ఆశలు నెరవేర్చి మంచిపాలన ఇచ్చేందుకు కేంద్రం నుంచి లేదా రాజ్యాంగ పరంగా అవరోధాలున్నాయని వాపోతున్నారు. 2019 ఎన్నికల్లో ఏ సంకీర్ణం కేంద్రంలో అధికారంలోకి వచ్చినా, ప్రాంతీయపార్టీలు పార్లమెంటులో కీలకపాత్ర పోషించటం ఖాయం. కాబట్టి సమాఖ్య వ్యవస్థను బలపరచడానికి, ఒకే మూసలోని ఏకరూప వ్యవస్థ స్థానంలో స్థానిక అవసరాలను బట్టి పాలనను రూపొందించేందుకు, జాతి ఐక్యతను కాపాడుతూనే రాష్ట్రాలకు పాలనపరంగా వెసులుబాటు ఇవ్వడానికి రాబోయే ఎన్నికలు ఒక చరిత్రాత్మక అవకాశం ఇస్తున్నాయి.

అధికార వికేంద్రీకరణే ఆలంబన

మన దేశంలో 2019లో నిజమైన సమాఖ్య వ్యవస్థకు అంకురారోపణ జరిగితే, అప్పుడు రాష్ట్రాలు నచ్చిన రీతిన ఎన్నికల వ్యవస్థను, ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయించుకుంటాయి. కొన్ని రాష్ట్రాలు దామాషా పద్ధతిని ఆశ్రయించవచ్చు. మరికొన్ని ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రభుత్వాధినేతను ఎన్నుకోవచ్చు. ఇంకొన్ని అధికారాన్ని మరింత వికేంద్రీకరించవచ్చు. స్థానిక ప్రభుత్వాలను తమ స్థానిక పరిస్థితుల మేరకు ఏర్పాటు చేసుకోవచ్చు. వేయి ఆలోచనలు వికసిస్తే ఏ పద్ధతులు మంచి ఫలితాలనిస్తాయో, ఆ పద్ధతులను రాష్ట్రాలు స్వీకరిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలు తమ అవసరార్థం- ప్రజల మెప్పును పొందడానికి, తమ మనుగడకు ఉత్తమ ఫలితాలనిచ్చే పాలనను, విధానాలను చేపడతాయి. రాష్ట్రాల భవిష్యత్తు ఆ రాష్ట్ర ప్రజల మీద, అక్కడి నాయకత్వం మీద మాత్రమే ఆధారపడుతుంది. అంతేగానీ కేంద్రం పెత్తనంవల్ల అనుకున్నది చేయలేకపోతున్నామన్న క్లేశం ఉండదు. రాష్ట్రాలు ప్రజాస్వామ్యాన్ని, ప్రాథమిక హక్కుల్ని, జవాబుదారీతనాన్ని ఉల్లంఘిస్తే నిరోధించేందుకు రాజ్యాంగ వ్యవస్థల్ని బలోపేతం చేసుకోవచ్చు. వివిధ రాష్ట్రాలు ప్రపంచంలోని అనేక దేశాలకన్నా విస్తీర్ణంలో పెద్దవి. జాతి ఉమ్మడి ప్రయోజనాల కోసం ఐక్యత అవసరం. ఐక్యత అంటే దేశమంతా ఒకే మూసలో ఉండటం కాదు. ఇప్పటికే మనకున్న అవకాశాలతో, మన ప్రజల అవసరాలతో, ఇతర దేశాలతో పోలిస్తే భారత్ సాధించిన ఫలితాలు చాలా తక్కువ. సమయం మించిపోకుండా- రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు గట్టి చొరవ తీసుకోవాలి. స్వామికార్యాన్ని, స్వకార్యాన్ని సంధానిస్తే తప్పక దేశం గతిని మార్చగలం. బీదరికాన్ని తొలగించి ప్రతి బిడ్డకు ఎదిగే అవకాశాలను అందించగలం. ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే ఒక తరం తీవ్రంగా నష్టపోతుంది!

(రచయిత- ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), 'లోక్‌సత్తా' వ్యవస్థాపకులు)

వివిధ దేశాల్లో వైవిధ్య వ్యవస్థలు

ఏ సమాఖ్య దేశంలోనూ కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, అమెరికా వంటి ఏ దేశంలోనూ మూసపోసిన ఏకరూప రాజకీయ వ్యవస్థగాని, ఒకేరకమైన పాలన పద్ధతులు, పథకాలుగాని అమలులో లేవు. బ్రిటన్ చాలా చిన్న దేశమైనా, ఒకే భాష ఉన్నా, అత్యధికులు ఒకే జాతి, మతానికి చెందినవారైనా ఆ దేశంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో ఎన్నికల వ్యవస్థ, ఒక్కో రీతిన ప్రభుత్వ నిర్వహణ ఉన్నాయి. బ్రిటన్‌లో పార్లమెంటు ఎన్నికలు భారత్ తరహాలోనే ఉంటాయి. నిజానికి మనం బ్రిటన్‌ని అనుకరించాం. కానీ- అక్కడి వేర్వేరు ప్రాంతాలైన స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండుల్లో స్థానిక శాసనసభ ఎన్నికలు ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రతినిధుల నిర్ణయం మేరకు ఒక్కో తీరున ఉంటాయి. బ్రిటన్‌లో ఐరోపాలో పార్లమెంటు ఎన్నికలు దామాషా పద్ధతిన జరుగుతాయి. స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఇతర రూపాల్లో ఉంటాయి. లండన్ నగర మేయర్‌ను ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. దేశమంతా ఎన్నికలు, ప్రభుత్వ వ్యవస్థ వేర్వేరు పద్ధతుల్లో ఉన్నా, దేశ ఐక్యతకు ఎలాంటి భంగం కలగలేదు. చివరికి నియంతృత్వ దేశమైన చైనాలోనూ స్థానిక ప్రభుత్వాలకు, రాష్ట్రాలకు భారత్‌కంటే ఎక్కువ స్వేచ్ఛ, వెసులుబాటు ఉన్నాయి. ఆ దేశంలో స్పష్టమైన అధికార వికేంద్రీకరణ ఉంది.

సృజనాత్మకంగా పాఠ్య ప్రణాళిక

పటిష్ఠ వారధిగా ఇంటర్ విద్య

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమైనది. పాఠశాల విద్యలోని ఉమ్మడి పాఠ్యాంశాలకు స్వస్తి పలికి వృత్తిపరమైన కోర్సులకు పునాది పడేది ఇక్కడే. పాఠశాల విద్య పూర్తిచేసిన విద్యార్థి తన అభిరుచి, ఆసక్తి, సామర్థ్యం ప్రాతిపదికన ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపులో చేరాలన్నది నిర్ణయించుకుంటాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1968 అక్టోబరు 25న ఇంటర్మీడియట్ విద్యను ప్రారంభిస్తూ ప్రభుత్వం జీఓ జారీచేసింది. ఆ తరవాత 1971లో ఇంటర్మీడియట్ బోర్డు ప్రారంభమైంది. ఈ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో సుమారు కోటిమందికి పైగా విద్యార్థులకు విద్యను అందించింది. దీనికి ముందు రెండేళ్ల పీయూసీ కోర్సు పరీక్షలు ఒకేసారి జరిగేవి. కాలానుగుణంగా అనేక మార్పులు చేసుకుంటూ ఇంటర్ బోర్డు నేడు సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌కు సరితూగే పాఠ్య ప్రణాళికను రూపొందించుకుని విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే విధంగా గ్రేడులు ఇస్తోంది. విభిన్న భాషలను రెండో ఐచ్ఛిక భాషగా విద్యార్థులు ఎంచుకునే సదుపాయం కల్పించింది. ఈ భాషల్లో తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, ఫ్రెంచ్, తమిళం, కన్నడం, ఒరియా, మరాఠీ ఉన్నాయి. సీబీఎస్‌ఈ పాఠ్యాంశాలను గమనిస్తూ, స్థానికత నుంచి అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే విధంగా సిలబస్‌ను తయారుచేసి ఇంటర్ బోర్డు తన ప్రత్యేకతను చాటుకుంది. పర్యావరణ విద్యను ఒక పాఠ్యాంశంగా అమలు చేయమని 2004లో సుప్రీంకోర్టు ఆదేశించడంతో దాన్ని ఒక పేపరుగా చేర్చింది.

సర్వం చదువులమయం

ఇంటర్మీడియట్ బోర్డు నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. విద్యార్థులను ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడంలో వైఫల్యం కనిపిస్తోంది. ప్రస్తుతం క్రీడా మైదానాలు లేని కళాశాలల సంఖ్యే ఎక్కువగా ఉన్నాయనడం అతిశయోక్తి కాదు. ఆరుబయట నైపుణ్యాలకు పాతరేసి విద్యార్థిని తరగతి గదికి పరిమితం చేయడం, ఆచరణాత్మక విద్య లోపించడం, సృజనాత్మకత కోల్పోవడం ఆందోళన కలిగించే అంశాలు. రెండు దశాబ్దాల క్రితం కళాశాలల్లో చురుగ్గా పనిచేసిన జాతీయ శిక్షణ దళం (ఎన్‌సీసీ), జాతీయ సామాజిక సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఛాయలు నేటి కార్పొరేట్ కళాశాలల్లో కనపడకపోవడం గమనార్హం. ఆటలు, యోగా లాంటి ప్రక్రియలు తప్పనిసరి చేసి గంటల తరబడి బట్టీ పట్టే నేటి విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది.



ప్రభుత్వ కళాశాలల్లో ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పాఠ్య పుస్తకాలు సకాలంలో, సక్రమంగా అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి విద్యా సంవత్సరం మధ్యకాలంలో పుస్తకాలు అందజేస్తున్నారు. కొన్నేళ్లుగా పాఠశాల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఈ విషయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల పెంపుదలకు చర్యలు చేపట్టాలి. పర్యావరణ విద్యకు సంబంధించి ఆయా కళాశాలలే ప్రశ్నపత్రం తయారుచేసి మూల్యాంకనం చేయడం వల్ల సరైన ఫలితాలు రావడంలేదు. చాలా కళాశాలలు ముఖ్యంగా కార్పొరేట్ కళాశాలల్లో పర్యావరణ విద్యపై నిర్లక్ష్యం కనిపిస్తుంది. పర్యావరణంతోపాటు మానవీయ విలువలకు సంబంధించిన పరీక్ష ప్రశ్నపత్రాలు ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ బోర్డే తయారుచేసి అన్ని కళాశాలలకు పంపనుండటం సానుకూల పరిణామం.

అన్ని కోర్సులకు ప్రాధాన్యం

ఏటా లక్షల మందికి విద్యాబుద్ధులు నేర్పే ఇంటర్మీడియట్ బోర్డు రెండు దశాబ్దాలుగా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు ఇంజినీరింగ్, మెడిసిన్‌లలో ఇంటర్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు లభించేవి. ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సుల్లో ప్రయోగ పరీక్షల (ప్రాక్టికల్స్)కు బోర్డు పరీక్షలతో నిమిత్తం లేకుండా కళాశాల స్థాయిలోనే మార్కులు ఇచ్చే పద్ధతిపై అనుమానాలు రేకెత్తాయి. ఇంటర్మీడియట్ విద్యలో ప్రైవేట్ కళాశాలల సంఖ్య పెరగడంతో ఈ ఆరోపణలు తారస్థాయికి చేరాయి. ప్రైవేట్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణపై అనుమానాలు పెరగడంతో వైద్య, ఇంజినీరింగ్ కోర్సులకు ప్రత్యేక ప్రవేశ పరీక్ష ఎమ్‌సెట్ ప్రారంభమైంది. వైద్య, ఇంజినీరింగ్ కోర్సులపై మక్కువ పెంచుకున్న తల్లితండ్రులు ఆస్తులు అమ్మి, అప్పులు చేసి తమ పిల్లలను చదివిస్తున్నారు. ఆయా కోర్సులపై పిల్లలకు ఆసక్తి ఉందా అన్న విషయాన్ని కొంతమంది తల్లిదండ్రులు ఆలోచించడం లేదు. దీంతో ఒక్కోసారి దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తమ పిల్లలను ఉన్నత స్థానాల్లో చూడాలన్న ఉద్దేశంతో వారు వాస్తవాలను గ్రహించలేకపోతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. క్షేత్రస్థాయి పరిస్థితులపై లోతైన అధ్యయనం చేయాలి. ఇంటర్ బోర్డు ద్వారా విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడినవారు బోర్డు ప్రగతికి పాటుపడాలి. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతుగా ఆర్థికంగా సహకరించాల్సిన అవసరం ఉంది!

– డాక్టర్ గుజ్జు చెన్నారెడ్డి

(రచయిత- అసోసియేట్ ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

అందరి మేలే శుభాకాంక్ష

సమాజాన్ని ధార్మికంగా, ఆధ్యాత్మికంగా తన రచనలతో ప్రభావితం చేసిన గొప్ప శివజ్ఞాన కవి, తమిళ భక్తజ్ఞాని శ్రీ జ్ఞానసంబంధుడు. ఒకసారి ఒక మహాకార్యం సాధించడానికై బయలుదేరుతుండగా కొందరు 'మంచి ముహూర్తం చూసుకొని బయలుదేరారా?' అని అడిగారు.

అప్పుడా కవి 'కాలమంతా మంచిదే- హృదయంలో భగవంతుని మరువనివారికి' అని సమాధానమిచ్చాడు. ఈ భావాన్ని స్పష్టపరుస్తూ ఒక గీతాన్ని రచించాడు. అతడు రచించిన గీతిప్రక్రియ (పదిగం)లలో ఇదో ప్రత్యేక రచన. కొన్ని దశాబ్దాల క్రితం అష్టగ్రహ కూటమి ఏర్పడినప్పుడు, ఏదో విపత్తు జరుగుతుందేమోనని కొందరు భయపడితే- కంచి మహాస్వామి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు ఈ పదిగాన్ని అందరూ పారాయణం చేయాలని ఆదేశించారు.

'ఇవాళ అష్టమి, రేపు నవమి, ఇది మంచిది, ఇది కాదు అనే వాక్యాలను నమ్మే ప్రజలు- నీలోనే పరమాత్మ ఉన్నాడు... బాగా విచారిస్తే నీ అసలు స్వరూపం ఆ పరమాత్మే అనే శాస్త్ర వాక్యాన్ని ఎందుకు విశ్వసించరు?' అని ఆదిశంకరులు ప్రశ్నించారు. కాలంలో ప్రతి అంశమూ మంచిదే. మనలో సత్సంకల్పం, సదాలోచన, భగవంతుడిపై ప్రేమ, సర్వజన హితాన్ని ఆకాంక్షించే సహృదయం- ఉంటే ప్రతికాలమూ అనుకూలమే.

'ఒక వర్గానికి మేలు చేస్తాను' అనే నాయకుల భావం సంకుచితమే. స్వార్థ ప్రయోజనాలకోసం, అలా వర్గాలవారీగా విభజిస్తూ, వారి వల్ల లబ్ధి పొందాలనే 'రాజకీయం' ఏ విధంగానూ ప్రజాసేవ అనిపించుకోదు. సర్వజనహితంలో తమ హితమూ ఉంటుంది. కానీ కేవలం తమ హితంలో- సర్వులహితం ఉండదు. అందుకే విశాలమైన భావం అటు నాయకులకు, ఇటు అనుచరులకు, ప్రజలకూ అవసరం.

నిర్మల హృదయంతో, ధర్మనిష్ఠతో సర్వశక్తిమంతుడైన భగవంతుడిపై భారం ఉంచి కృషిచేసేవారు దుర్విధినీ జయించగలరని పురాణ వాఙ్మయం అనేక వృత్తాంతాలతో బోధించింది. తన భర్త అల్పాయుష్కుడని జ్యోతిష శాస్త్రజ్ఞులు విధిని తెలియజేస్తే, పట్టుదలతో కాలరూపుడైన యముని ధర్మనిష్ఠతో ప్రసన్నం చేసుకొని, పతిని ఆయుష్మంతుడిగా మార్చుకుని 'సావిత్రి కథ' గొప్ప తార్కాణం. తాను అల్పాయుష్కుడని తెలిసిన మార్కండేయుడూ అలాంటి పట్టుదలతోనే కల్పాంత చిరంజీవి అయ్యాడు.



అంతర్యామి

అందరికీ భద్రత కలిగిన జీవితం, ఎవరి మానాన వారినే బతకనిచ్చే శాంతి, ఒకరివల్ల ఒకరికి చేటులేని రక్షణ, సమాజంలోని అన్ని వర్గాలవారికీ స్వస్థత, స్వచ్ఛత, జలవనరులు, ఆహారపుష్టి సక్రమంగా నడిచే ప్రభుత్వ వ్యవస్థలు, అసహాయులకూ, పేదలకూ అండదండలు, ఇబ్బందిలేని మార్గాలు... ఇవన్నీ సమకూర్చగలిగిన నాయకత్వాన్ని అర్థం చేసుకొనే ప్రజలు ఉన్న దేశానికి తప్పకుండా సుపరిపాలన ప్రాప్తిస్తుంది. అలాంటి పాలన ద్వారా సర్వమానవాళికీ మేలు కలగాలనే శుభాకాంక్ష నేతలకు, అలాంటి నేతలే మనకు కావాలనే శుభకామన ప్రజలకు ఉండాలి.

ఎవరు అందరి క్షేమాన్ని కోరుకుంటారో వారి క్షేమమే ఈశ్వరుడు నెరవేర్చుతాడు. ఎందుకంటే ఇతడు బాగుంటే అందరూ బాగుంటారు కనుక, ఇతడి బాగునే ముందు అందిస్తాడు. తన స్వార్థమే కోరుకొనేవాడి ప్రార్థన, ఆకాంక్ష త్వరగా నెరవేరవు.

కాలం మలుపు తిరిగే వేళ- నూతన సంవత్సరం స్వాగతిస్తున్నప్పుడు గతంలోని తీపి చేదు సంఘటనలు జ్ఞాపకాలుగా మదిపొరల్లో సర్దుకుంటూ, కొత్త ఆశలతో కొత్త ఏడాది వైపు దృష్టిని సారిస్తాం.

మధుర జ్ఞాపకాలు మరింత ఉత్సాహాన్నిస్తే చేదు గురుతులు జాగ్రత్తపడే పాఠాలవుతాయి. మంచిరోజులు తనకు, తనవారికే కాక- అందరికీ రావాలనే శుభాకాంక్షలను సర్వేశ్వరుడు సఫలం చేయాలని ప్రార్థిద్దాం!

– సామవేదం షణ్ముఖశర్మ

బాబుకు ఏపీ ప్రజలే బుద్ధి చెప్తారు

- ఆయన్ను ఓడించడానికి మోదీలు అవసరం లేదు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి


తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న తెరాస ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, బాల్కసుమన్

ఈనాడు, హైదరాబాద్: తనను ఓడించడానికి ముగ్గురు మోదీలు వస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఆయనకు బుద్ధి చెప్పడానికి మోదీలు అవసరం లేదని, ఆంధ్రా ప్రజలు చాలన్నారు. చంద్రబాబు మాటలు చూస్తుంటే అక్కడ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో? ఆయన భవిష్యత్తు ఏంటో ముందే తెలిసిపోయిందన్నారు. ఓటమి భయంతో అబద్ధాలు చెబుతూ ఆంధ్రా ప్రజలను వంచించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌తో ఏ విషయంలోనూ పోటీపడే దమ్ము బాబుకు లేదని, అందుకే గోబెల్స్ ప్రచారానికి పూనుకున్నారని చెప్పారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మాట్లాడారు. "ఎన్టీఆర్‌ను దించేందుకు కేసీఆరే సూత్రధారి అని బాబు చెబుతున్నారు. అలాంటప్పుడు ఆయనే సీఎం అయ్యేవారు కదా? తెలంగాణ కోసం అన్ని పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్‌దే. 2004లో కాంగ్రెస్‌తో, 2009లో తెదేపాతో పొత్తు పెట్టుకున్నది ప్రత్యేక రాష్ట్రం కోసమే. చివరకు చంద్రబాబును తెలంగాణ కోసం ఒప్పించే పొత్తు పెట్టుకున్నారు. మోదీతో మాకు ఎప్పుడూ రాజకీయ సంబంధాల్లేవు. రాజ్యాంగబద్ధమైన సంబంధమే కేంద్రంతో ఉంది. మొన్నటి ఎన్నికల్లో మోదీ-కేసీఆర్ దోస్తీ అంటూ బాబు ఎంతచెప్పినా ప్రజలు తెరాసను ఆదరించారు. రేపు ఏపీలో బాబు చెప్పిందానికి వ్యతిరేకంగానే జరుగుతుంది. నాలుగున్నరేళ్లలో హైకోర్టు భవనాన్నీ బాబు నిర్మించలేకపోయారు. కేసీఆర్‌తో అభివృద్ధిలో చంద్రబాబు పోటీ పడలేరు. కేసీఆర్‌ను బూచిగా చూపించి ఏపీలో గెలవాలనుకుంటే అది బాబు తెలివి తక్కువతనమే అవుతుంది" అని జగదీశ్‌రెడ్డి, బాల్కసుమన్‌లు అన్నారు.

చంద్రబాబు వచ్చాకే అవినీతి: లక్ష్మారెడ్డి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: తెదేపా అధినేత చంద్రబాబు ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రి అయ్యాకే తెలంగాణలో అవినీతి పెరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన షాద్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి మాట్లాడుతూ..ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలను మభ్యపెట్టేందుకు పెద్దఎత్తున డబ్బులు పంపించారని అన్నారు. తెరాస సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందిన ఇక్కడి ప్రజలు కేసీఆర్ వెన్నంటే ఉన్నారని చెప్పారు. రానున్న పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ ప్రజలు తెరాసకే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెరా నమోదుకు మరో అవకాశం

- రూ.2 లక్షల జరిమానాతో 15 వరకు గడువు

ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి నియంత్రణ అథారిటీ(రెరా) వద్ద నమోదుకు మరో అవకాశం ఇస్తున్నట్లు స్థిరాస్తి నియంత్రణ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు నమోదు చేసుకోని స్థిరాస్తి ప్రాజెక్టులను జనవరి 15లోపు నమోదు చేసుకోవాలని అథారిటీ ఛైర్మన్ రాజేశ్వర్ తివారీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి ఒకటో తేదీ నుంచి నమోదు చేసుకునే ప్రాజెక్టులకు రూ.2 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటివరకు రెరా వద్ద స్థిరాస్తి ప్రాజెక్టులను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రెండుసార్లు గడువు పొడిగించినట్లు వివరించారు. డిసెంబరు 31 వరకు రూ.లక్ష జరిమానాతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. దీన్ని వినియోగించుకోని వారికి జనవరి 15వరకు మరో అవకాశమిస్తున్నట్లు చెప్పారు. రెరావద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర ఉద్యోగులకు పాత పింఛను ప్రతిపాదన లేదు

దిల్లీ: పింఛన్ల భారం పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్) స్థానంలో పాత పింఛను పథకాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా లోక్‌సభ సభ్యులకు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు పింఛను పథకాన్ని నిలిపివేయాలనే ప్రతిపాదన కూడా లేదన్నారు.

ఈక్విటీల్లో పెట్టుబడిపై చందాదారులే నిర్ణయించుకోవచ్చు!

దిల్లీ: తమ మొత్తాల నుంచి ఎంత శాతాన్ని ఈక్విటీల్లో పెట్టుబడిగా పెట్టాలో నిర్ణయించుకునే అవకాశం 'ఉద్యోగ భవిష్య నిధి సంస్థ' (ఈపీఎఫ్‌వో) చందాదారులకు కొత్త సంవత్సరంలో అందుబాటులోకి రానుంది. ఈపీఎఫ్‌వో తమ వద్ద ఉన్న నిల్వల్లో 15% వరకు 'ఎక్స్ఛేంజి ట్రేడెడ్ ఫండ్'లలో పెట్టుబడిగా పెడుతోంది. అయితే అదేదీ ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో కనిపించదు. తమ చందాలో ఎంత శాతాన్ని స్టాక్‌మార్కెట్లో పెట్టుబడి పెట్టవచ్చో తెలిపే అవకాశం ఉద్యోగులకు విడిగా లేదు. ఖాతాల్లో నగదు రూపంలో ఎంత ఉంది? ఈటీఎఫ్‌లో ఎంత ఉంది? అనేది విడివిడిగా తెలిపేలా సాఫ్ట్‌వేర్‌ను ఈపీఎఫ్‌వో రూపొందిస్తోంది.

బీసీ రిజర్వేషన్లు అరశాతం తగ్గించినా సహించేది లేదు

జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అరశాతం తగ్గించినా సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ జనగణన జరిగాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా వర్సిటీలో బీసీ విద్యార్థి సంఘాల సమావేశం సోమవారం నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం ఓయూ అధ్యక్షుడు స్వామిగౌడ్, నిరుద్యోగ ఫ్రంట్ ఛైర్మన్ దయాకర్, జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల సాధనకు త్వరలో ఇందిరాపార్కు వద్ద 48గంటల దీక్షలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రబంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

ఆర్.కృష్ణయ్య

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పంచాయతీఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ అంశంపై సోమవారం పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేశ్ తదితరుల బృందం సమావేశమై చర్చించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు కేసీఆర్ అధ్యక్షతన అఖిలపక్ష బృందాన్ని దిల్లీకి తీసుకెళ్లి ప్రధానితో చర్చించాలని కోరినట్లు తెలిపారు.

బీసీలను దగా చేసిందే కాంగ్రెస్

- ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య




ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెజస అధ్యక్షుడు కోదండరాంలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని తెరాస ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ధ్వజమెత్తారు. బీసీల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఎవరేం చేశారో తేల్చుకునేందుకు తనతో బహిరంగ చర్చకు ఉత్తమ్ రావాలని సవాలు చేశారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మాట్లాడుతూ.."పంచాయతీల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించగా కాంగ్రెస్ సర్పంచులు హైకోర్టుకు వెళ్లి దానిని అడ్డుకున్నారు. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా 24శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్పు వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదు. స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. దానిని కొట్టివేయడంతో ప్రభుత్వం ఆ తీర్పును అంగీకరించాల్సి వచ్చింది. ప్రజలందరికీ వాస్తవం తెలిసినా కాంగ్రెస్, భాజపాలు రాజకీయం చేస్తున్నాయి. ఆర్.కృష్ణయ్య వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి. కాంగ్రెస్ నేతలకు చేతనైతే చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్ల కోసం అన్నిరాష్ట్రాల్లో తీర్మానాలు చేయించాలి. తమిళనాడు తరహాలో తెలంగాణలో రిజర్వేషన్లు సాధించేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. దీనికి పార్టీలన్నీ సహకరించాలి. ఏపీలో కేసీఆర్‌కు వ్యక్తమైన ఆదరణను చూసి చంద్రబాబు ఓర్చుకోలేకపోతున్నారు. కేసీఆర్ పాలనను చూసి విజయవాడలో ఆయన విగ్రహం పెట్టాలనుకుంటున్నారు. ఆయన ధాటికి మహామహులే మట్టి కరిచారు. చంద్రబాబు తన పద్ధతిని మార్చుకోకపోతే అదే గతి పడుతుంది" అని నోముల అన్నారు.

సైబరాబాద్ పేరిట బాబు కుట్ర: ఎమ్మెల్సీ భానుప్రసాద్

ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ.. చంద్రబాబు సైబరాబాద్ అభివృద్ధి పేరిట కుట్రకు పూనుకున్నారని, సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి తన బంధుగణం, భజన బృందంతో భూములు కొనిపించారని విమర్శించారు. చంద్రబాబు అబద్ధాలు మాని హుందాగా వ్యవహరిస్తే మంచిదని, బాబు, ఆయన మంత్రులు ఏపీలో పాలనపై దృష్టి పెట్టాలని భానుప్రసాద్ అన్నారు.

చర్చకు సిద్ధమా?: ఎంపీ బడుగుల

ఈనాడు, దిల్లీ: బీసీల సంక్షేమానికి కాంగ్రెస్, తెరాస ప్రభుత్వాలు చేసిన కార్యక్రమాలపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ నేతలు చర్చకు రావాలని తెరాస రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ సవాల్ విసిరారు. దిల్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ బీసీలకు ఏం చేసిందో చెప్పాలని, నాలుగేళ్లలో మేమేం చేశామో చెప్తామన్నారు. తెరాస ప్రభుత్వం పంచాయతీల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించిందని, సీఎం కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారంటూ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు మాట్లాడడం సరికాదన్నారు. బీసీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెరాస ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి పంపిన విషయం కాంగ్రెస్ నేతలకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. కోర్టు తీర్పుకు లోబడి రిజర్వేషన్లు ప్రకటించాల్సి వచ్చిందన్నారు. తెరాసలో ఆరుగురు రాజ్యసభ సభ్యులుంటే నలుగురు బీసీలేనని, శాసనసభ ఎన్నికల్లోనూ బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ తెరాసనేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ సీఎం కేసీఆర్‌కు ప్రజలు ఘనస్వాగతం పలకడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.




యాదాద్రి పునర్ నిర్మాణ పనుల పురోగతిని గవర్నర్ నరసింహన్‌కు వివరిస్తున్న ఆలయ ఈవో గీత. పక్కన యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ తదితరులు

యాదాద్రి పనులు అత్యద్భుతం

- గవర్నర్ నరసింహన్ కితాబు

ఈనాడు, నల్గొండ: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణ పనులు అత్యద్భుతమని గవర్నర్ నరసింహన్ కొనియాడారు. శిల్పకళా నైపుణ్యం అబ్బురపరిచేలా ఉందన్నారు. పునర్‌నిర్మాణ పనులు పూర్తయితే ఈ ఆలయం దేశంలోనే గొప్ప కట్టడంగా నిలిచిపోతుందని చెప్పారు. పంచనారసింహ క్షేత్రాన్ని తెలంగాణ ఇలవేల్పుగా అభివర్ణించారు. సతీమణి విమలా నరసింహన్‌తో కలిసి ఆయన సోమవారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ పునర్‌నిర్మాణ పనులను పరిశీలించి అధికారులు, యాదాద్రి అభివృద్ధి ప్రాధికారసంస్థ (యాడా) స్థపతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అధికారులపై ఆగ్రహం

బాలాలయ మహామండపంలో గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనాలు అందజేసే క్రతువు జరిగింది. ఈ ప్రక్రియలో పండితులు వేదాలను వల్లిస్తుండగా మధ్యలో పూజారులు వేరే మంత్రాలు చదవడంతో గవర్నర్ అసహనానికిలోనై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'వీరిక మారరా..' అంటూ ఆలయ అధికారులవైపు చూస్తూ మందలించారు. త్వరలో రాజ్‌భవన్‌కు రావాలని ఈవో గీతారెడ్డి, యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావులను ఆదేశించారు.

తెరాసలోకి కాంగ్రెస్ కీలక నేత!

హైదరాబాద్, ఈనాడు: కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న ఓ మాజీ క్రీడాకారుడు తెరాసలో చేరనున్నట్లు తెలిసింది. ఇటీవలే తెరాసలో చేరిన ఆయన సన్నిహితుల ద్వారా ఈ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. సదరు నేత చేరడం వల్ల లాభనష్టాల గురించి తెరాసలో మథనం జరుగుతోంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే వీలుంది.


అప్పుడు అన్యాయం చేసి ఇప్పుడు మొసలి కన్నీరా?

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీసీలను అణచివేయడంతోపాటు తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు నష్టం జరుగుతోందని మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటని తెలంగాణ బీసీ జనసభ, దక్షిణ భారత జేఏసీలు దుయ్యబట్టాయి. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాంయాదవ్ మాట్లాడుతూ..గత ఎన్నికల్లో బీసీలకు సీట్లు రాకుండా చేసిన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీకే అరుణ ఎన్నికలు ముగియగానే బీసీలకు తామే న్యాయం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. జులైలో పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయగా కాంగ్రెస్ నేతలు స్వప్నారెడ్డి, గోపాల్‌రెడ్డిలతో న్యాయస్థానంలో పిటిషన్ వేయించి ఎన్నికలు నిలిపేసేందుకు కారణమయ్యారని ఆరోపించారు. దక్షిణ భారత జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, భాజపా నేతలకు ధైర్యముంటే పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.


హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ దంపతులు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులను కలిశారు. ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

మొండి బ్యాక్టీరియాకు ఐర్లాండ్ మట్టిలో విరుగుడు మంత్రం!

లండన్: యాంటీ బయోటిక్ ఔషధాలకు లొంగని మొండి బ్యాక్టీరియా భరతం పట్టే సరికొత్త బ్యాక్టీరియా రకాన్ని ఐర్లాండ్ నేలల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆరోగ్యరంగానికి అత్యంత ప్రమాదకరమైనవిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) భావిస్తున్న ఆరు మొండి బ్యాక్టీరియాల్లో నాలుగింటిని అది ప్రభావవంతంగా నిరోధించగలదని వెల్లడించారు. ఉత్తర ఐర్లాండ్‌లోని బోహో హైల్యాండ్స్ ప్రాంత మట్టిలో పలు ఔషధ గుణాలున్నాయని అనాదిగా ప్రజలు భావిస్తున్నారు. పంటి నొప్పి, మెడ-గొంతులో ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు తలెత్తినప్పుడు ఇక్కడి మట్టిని వస్త్రంలో కట్టి చికిత్సకు ఉపయోగించుకునేవారు. తాజాగా బ్రిటన్‌లోని స్వాన్‌సీ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇక్కడి నేలల్లో 'స్ట్రెప్టోమైసిస్ ఎస్‌పీ మైరోఫోరియా' అనే బ్యాక్టీరియాను కనుగొన్నారు. వాంకోమైసిన్ నిరోధక ఎంటరోకోకస్ ఫేసియం(వీఆర్‌ఈ), మెథిసిలిన్ నిరోధక స్టెఫైలోకోకస్ ఆరియస్(ఎంఆర్‌ఎస్‌ఏ), క్లెబసీలా న్యుమోనియా, కార్బెనెపీనమ్ నిరోధక అసినెటోబ్యాక్టర్ బౌమనై అనే మొండి బ్యాక్టీరియా వృద్ధిని కొత్తగా గుర్తించిన బ్యాక్టీరియా నిరోధిస్తున్నట్లు వారు గుర్తించారు. గ్రామ్ పాజిటివ్ బ్యాక్టీరియాతోపాటు గ్రామ్ నెగిటివ్ బ్యాక్టీరియా పెరుగుదలనూ అడ్డుకోగలుగుతున్నట్లు తేల్చారు. 'స్ట్రెప్టోమైసిస్ ఎస్‌పీ మైరోఫోరియా'లోని ఏ కారకం మొండి బ్యాక్టీరియాకు విరుగుడుగా పనిచేస్తోందో స్పష్టంగా గుర్తించేందుకుగాను శాస్త్రవేత్తలు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.



తగ్గిన వంట గ్యాస్ ధర

దిల్లీ: రాయితీపై సరఫరా చేసే వంట గ్యాస్ ధర తగ్గింది. సిలిండర్‌పై రూ.5.91 తగ్గించినట్లు సోమవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటించింది. 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధర దిల్లీలో రూ.500.90 నుంచి రూ.494.99కి తగ్గింది. జీఎస్టీ, ఇతర పన్నుల కారణంగా వినియోగదారులకు రూ.689కు సరఫరా చేస్తారు. అందులో రాయితీ కింద తిరిగి రూ.194.01 వారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతుంది. రాయితీలేని వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా రూ.120.50 మేర తగ్గింది.



ముఖాలకు, చేతులకు జాతీయ జెండా రంగులు వేసుకొని కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్న అమృత్‌సర్ యువతులు



ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్ వంతెనపై వెలుగుల హరివిల్లు

కొత్త సంవత్సర వేళ.. ఆనంద హేల

సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందే

- తలాక్ బిల్లుపై రాజ్యసభలో విపక్షాల పట్టు

దిల్లీ: ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పి విడాకులివ్వడాన్ని నేరంగా పరిగణించే బిల్లుపై సోమవారం రాజ్యసభలో చర్చ జరగలేదు. నిశితంగా పరిశీలించేందుకు వీలుగా దీనిని సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్షాలు మూకుమ్మడిగా పట్టుబట్టాయి. 'ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2018'ని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం సభలో ప్రవేశపెట్టారు. చర్చ జరగాలని అధికార పక్షం, సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షం గట్టిగా తమ వాదనలు వినిపించాయి. అత్యంత కీలకమైన బిల్లుపై సమగ్ర పరిశీలన అవసరమని రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్ చెప్పారు. అందుకే సభలో సగం మందికి పైగా సభ్యులు దీనిని సెలెక్ట్ కమిటీకి పంపాలంటున్నారని వివరించారు. బిల్లులు చట్టాలుగా మారేందుకు ముందు సెలెక్ట్ కమిటీలకు పంపే సంప్రదాయాన్ని ప్రభుత్వం పక్కనపెడుతోందని విమర్శించారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, విపక్షాలే ఉద్దేశపూర్వకంగానే అనవసర అడ్డంకులు కలిగిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్‌గోయల్ చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఇప్పటికే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనేత ఆనంద్‌శర్మ ఈ విమర్శల్ని తోసిపుచ్చారు. బిల్లును ఎవరూ వ్యతిరేకించడం లేదని, ప్రభుత్వమే రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. పరిశీలన లేకుండా ఆమోదించాలని తెలపడానికి రాజ్యసభ రబ్బరు స్టాంపేమీ కాదన్నారు. కావేరి జలాల విషయమై అన్నాడీఎంకే సభ్యుల నిరసనలతో ఒకసారి, తలాక్ బిల్లుపై రెండుసార్లు సభ వాయిదా పడింది. ఆ తర్వాత బుధవారానికి సభను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ప్రకటించారు.



రాజ్యసభలో సోమవారం నిరసన చేపడుతున్న విపక్ష ఎంపీలు



★ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు సోమవారం వస్తున్న బాక్సర్ మేరీ కామ్

లోక్‌సభలో అధికార-విపక్షాలు ఢీ అంటే ఢీ

రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై చర్చించడానికి లోక్‌సభలో అధికార-విపక్షాలు ఢీ అంటే ఢీ అన్నాయి. బుధవారం దీనిపై చర్చించడానికి తాము సిద్ధమని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. ఆ మేరకు సమయాన్ని నిర్ణయించాలని కోరారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ దీనిపై స్పందిస్తూ సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని చెప్పారు. రఫేల్ ఒప్పందంపై పరిశీలనకు సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని నియమించాలని పదేపదే డిమాండ్ చేశారు. ఈ దశలో జైట్లీ జోక్యం చేసుకుంటూ ఖర్గే తక్షణం ఈ అంశంపై చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చర్చ నుంచి తప్పించుకోవాలని ఖర్గే చూస్తున్నారని ఆరోపించారు. చర్చకు సమయాన్ని నిర్ణయించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను ఖర్గే కోరారు. చర్చకు సమయంపై తాను నిర్ణయం తీసుకుంటానని, తక్షణం దీనిని ఖరారు చేయాలని పట్టుపట్టడం తగదని స్పీకర్ అన్నారు. సవాళ్లను అధికార, విపక్షాలు తమకే పరిమితం చేసుకోవాలని తనను సవాల్ చేయవద్దని అన్నారు.

వైద్య మండలి బిల్లుకు ఆమోదం

'భారతీయ వైద్య మండలి (సవరణ) బిల్లు'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. భారతీయ వైద్య మండలిని నియంత్రించడానికి జారీ చేసిన ఆర్డినెన్సు స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంసీఐ పాలకమండలిని ఎన్నుకోవాల్సి ఉన్నందున ఎంసీఐ స్థానంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఇకపై 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్'కు అధికారాలు దఖలు పడతాయని ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా చెప్పారు.

జేపీసీలో వీగిన విపక్షాల వాదనలు

సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)లో పౌరసత్వ సవరణ ముసాయిదా బిల్లుపై ప్రభుత్వం తన వాదనలను నెగ్గించుకొంది. ఈ బిల్లులో పలు మార్పులు చేయాలని ప్రతిపక్షాలు ప్రతిపాదించగా, వాటిని అధికార పక్ష సభ్యులు తిరస్కరించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లలో మైనార్టీలైన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు భారతదేశ పౌరసత్వం ఇచ్చే విషయమై ఈ బిల్లును ప్రభుత్వం రూపొందించింది. ఇంతవరకు భారత్‌లో 12 ఏళ్ల నివాసం ఉన్నవారికి పౌరసత్వం లభిస్తోంది. దీన్ని ఆరేళ్లకు తగ్గించడంతో పాటు, ఎలాంటి ధ్రువపత్రాలు లేకున్నా పౌరసత్వం ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు తెలిపాయి. లౌకిక దేశంలో మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడం తగదని వాదించాయి. బిల్లులోని ప్రతి అంశంపైనా చర్చతో పాటు ఓటింగ్ కూడా జరిగింది. మొత్తం 30 మంది సభ్యులు ఉన్న జేపీసీలో 14 మంది భాజపా ఎంపీలు ఉండటంతో అన్ని అంశాల్లోనూ ప్రభుత్వ వాదనే నెగ్గింది. జనవరి మూడో తేదీన జరిగే జేపీసీ సమావేశంలో ముసాయిదా బిల్లును ఖరారు చేసి వచ్చే వారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

కాంగ్రెస్‌కు 'అగస్టా' ముడుపులు: యోగి



లఖ్‌నవూ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోళ్ల వ్యవహారంలో కాంగ్రెస్‌కు రూ.150 కోట్ల ముడుపులు అందాయని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్‌పై ఆయన పలు ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంలో మొత్తం రూ.360 కోట్లు చేతులు మారగా, అందులో రూ.150 కోట్లు కాంగ్రెస్ నేతలకు అందాయన్నారు. హెలికాప్టర్ కుంభకోణంలో దళారీగా వ్యవహరించిన క్రిస్టియన్ మిషెల్... దర్యాప్తులో భాగంగా 'శ్రీమతి గాంధీ'పేరు ప్రస్తావించారని, జరిగిన అవినీతికి ఇదే నిదర్శనమని అన్నారు.

నిజాలు వెలుగులోకి వచ్చాయి: అమిత్ షా

క్రిస్టియన్ మిషెల్ ఇచ్చిన సమాచారంతో నిజాలు వెలుగులోకి వచ్చాయని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం, గాంధీ కుటుంబానికి సంబంధించిన వాస్తవాలు తెలిశాయన్నారు.

ఆర్‌బీఐ మిగులు నిధులు మాకు అక్కర్లేదు

- ఆర్థిక మంత్రి జైట్లీ స్పష్టీకరణ

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ మిగులు నిల్వలు కేంద్ర సర్కారుకు అవసరం లేదని, ద్రవ్యలోటును ఎదుర్కోవడంలో మునుపటి ప్రభుత్వాలన్నింటికంటే నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేకు మంచి రికార్డు ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.85,948 కోట్ల అదనపు స్థూల వ్యయానికి ఉద్దేశించిన రెండో విడత అనుబంధ గ్రాంట్ల బిల్లును లోక్‌సభ సోమవారం ఆమోదించింది. దీనిపై చర్చకు జైట్లీ సమాధానమిచ్చారు. ఆర్‌బీఐ వద్దనున్న మిగులు నిల్వల్ని పేదరిక నిర్మూలనకు, ప్రభుత్వరంగ బ్యాంకుల అదనపు పెట్టుబడి అవసరాలకు ఉపయోగించుకోవచ్చని చెప్పారు.

బ్యాంకుల డబ్బు దోచింది కాంగ్రెస్సే

2015 నాటికి రూ.2.5 లక్షల కోట్ల మొండి బకాయిలు ఉన్నట్లు కాంగ్రెస్ చెప్పినా నిజానికి అది రూ.8.5 లక్షల కోట్లు అని జైట్లీ స్పష్టం చేశారు. 15 మంది బడా వ్యాపారవేత్తల బకాయిల్ని ఎన్డీయే మాఫీ చేసిందన్న ఆరోపణల్ని ఖండించారు. బ్యాంకుల్ని దోచుకున్నది కాంగ్రెస్సేనని, మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక రూ.3 లక్షల కోట్ల డబ్బును వెనక్కి తీసుకువచ్చిందని చెప్పారు. రఫేల్‌పై కాంగ్రెస్, కావేరి జలాలపై అన్నాడీఎంకే సభ్యులు వినిపించిన నిరసనల నడుమ అనుబంధ గ్రాంట్ల బిల్లు ఆమోదం పొందింది.



లోక్‌సభలో మాట్లాడుతున్న అరుణ్ జైట్లీ

సొహ్రాబుద్దీన్ కేసును రాజకీయం చేసిందెవరు?

సొహ్రాబుద్దీన్ హత్య కేసు దర్యాప్తును రాజకీయమయం చేసిందెవరో చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ డిమాండు చేశారు. గుజరాత్‌కు చెందిన సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో నిందితులందరూ నిర్దోషులేనంటూ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చిన విషయం విదితమే. దీనిపై ఇటీవల రాహుల్ స్పందిస్తూ అలాంటప్పుడు సొహ్రాబుద్దీన్‌ను ఎవరూ చంపలేదా అన్న అర్థం వచ్చే రీతిలో ట్వీట్ చేశారు. దీనిపై సోమవారం జైట్లీ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యలు చేస్తూ అసలు సొహ్రాబుద్దీన్ కేసు దర్యాప్తే హత్యకు గురయిందని, ఇందుకు బాధ్యులెవరో తొలుత వెల్లడించాలని డిమాండు చేశారు. "దర్యాప్తు సంస్థ మొదటి నుంచీ సక్రమంగా విచారణ జరపలేదు. వాస్తవాలను వెలుగులోకి తేవడం కన్నా కొందరు రాజకీయ నాయకులను ఇరికించడానికే ప్రయత్నించింది" అంటూ ప్రత్యేక జడ్జి వ్యాఖ్యలు చేశారని, దీనికి సమాధానం ఏమిటని ప్రశ్నించారు. దీనికంతటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. దర్యాప్తులో రాజకీయ జోక్యం పెరిగిందంటూ తాను 2013 సెప్టెంబరు 27న రాజ్యసభ ప్రతిపక్ష నేత హోదాలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశానని గుర్తుచేశారు. అప్పట్లో తాను వెలిబుచ్చిన అనుమానాలన్నీ నిజమయ్యాయని చెప్పారు.

రక్షణ వ్యవహారాల్లో సోనియా జోక్యం లేదు

- ఎ.కె.ఆంటోనీ స్పష్టీకరణ



దిల్లీ: రక్షణ కొనుగోళ్ల వ్యవహారాల్లో సోనియా, రాహుల్ గాంధీలు ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, రక్షణ శాఖ మాజీ మంత్రి ఎ.కె. ఆంటోనీ స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను పదవిలో ఉన్నంత కాలం అగస్టా వెస్ట్‌ల్యాండ్ సహా ఏ వ్యవహారంలోనూ వారు కల్పించుకోలేదని తెలిపారు. ఏమీ జరగనప్పటికీ, భాజపా-ప్రభుత్వం కలిసి అబద్ధాలను తయారు చేస్తున్నాయని విమర్శించారు. అగస్టావెస్ట్‌ల్యాండ్ కంపెనీ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో యూపీఏ హయాంలోనే వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోళ్ల కాంట్రాక్టును రద్దు చేశామని ఆంటోనీ చెప్పారు. ఆ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు, సీబీఐ విచారణనూ ఆదేశించామని గుర్తుచేశారు.

బ్యాంకులకు నష్టాలపై రాహుల్ విమర్శల దాడి

గత ఏడాది బ్యాంకులకు రూ.41,167 కోట్ల నష్టాలు వాటిల్లడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ప్రభుత్వం తమ స్నేహితులకు ఇచ్చిన డబ్బులతో ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకాన్ని ఏడాదిపాటు నడపవచ్చని, మూడు రాష్ట్రాల్లో రైతు రుణాల్ని మాఫీ చేయొచ్చని, దేశంలో 40 కొత్త ఎయిమ్స్ కేంద్రాల్ని ఏర్పాటు చేయొచ్చన్నారు. కాపలాదారు ముసుగులో దొంగల కోసమే పని చేశారని, స్నేహితుల పేరిట రూ.41,167 కోట్లు ఇచ్చారని ప్రధాని మోదీని ఉద్దేశించి ఒక ట్వీట్‌లో ఆరోపించారు.

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా సుధీర్ భార్గవ

- నేడు ప్రమాణస్వీకారం



దిల్లీ: కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా సుధీర్ భార్గవను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. నాలుగేళ్లపాటు సుధీర్ సీఐసీగా కొనసాగుతారు. ఆయన 1979 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. సామాజిక న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. 2015 జూన్ నుంచి కేంద్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సమాచార కమిషనర్లుగా నలుగురు మాజీ ఉన్నతాధికారుల నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే. సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో కలిపి మొత్తం 11 మంది సమాచార కమిషనర్లు ఉండొచ్చు. తాజా నియామకాలతో వారి సంఖ్య ఏడుకు చేరుకుంది.

అంతా అధికారుల నుంచే ఎందుకు?

ఈనాడు, దిల్లీ: కేంద్ర సమాచార కమిషన్‌లో తాజాగా మాజీ ఉన్నతాధికారులకే చోటుకల్పించడంపై మాజీ సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమాచార కమిషన్‌లో ఖాళీలు భర్తీ చేయడం అభినందనీయమని, అయితే అందర్నీ అధికారుల వర్గం నుంచే ఎంపిక చేయడం ఎందుకని సెర్చ్ కమిటీని ప్రశ్నించారు. కమిటీలో సభ్యులుగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలకు ఈ-మెయిల్ ద్వారా ఈ మేరకు తన అభ్యంతరం తెలిపారు.

భారీ భవనంలో గ్యాస్ విస్ఫోటం

- రష్యాలో నలుగురి మృతి
- జాడ తెలియని 70 మంది

మాస్కో: నూతన సంవత్సర సంబరాల వేళ రష్యాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. దేశంలో పారిశ్రామిక నగరంగా పేరొందిన మాగ్నిటోగోర్స్క్‌లోని ఓ అతిపెద్ద భవనంలో గ్యాస్ పేలుడు సంభవించడంతో సోమవారం నలుగురు మృతి చెందారు. ఇద్దరు పిల్లలు సహా మరో నలుగురు గాయపడ్డారు. దాదాపు 70 మంది జాడ తెలియరాలేదు. గడ్డ కట్టించే చలిలో వందలాది మంది నిరాశ్రయులయ్యారు. మాస్కోకు 1700 కి.మీ.ల దూరంలోని మాగ్నిటోగోర్స్క్‌లో ఉదయం 6 గంటల (స్థానిక కాలమానం) ప్రాంతంలో పేలుడు సంభవించగా భవనంలోని చాలాభాగం కుప్పకూలింది. సహాయక చర్యల్లో భాగంగా 16 మందిని కాపాడగా శిథిలాల కింద 50 మంది వరకు చిక్కుకున్నట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది. ఈ ఘటన పట్ల రష్యా అధ్యక్షుడు పుతిన్ విచారం వ్యక్తం చేశారు.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా శ్రవణ్

- కొత్తగా మరో 9 మంది నియామకం



దిల్లీ/ ఈనాడు, హైదరాబాద్: ఏఐసీసీ కొత్త జాతీయ అధికార ప్రతినిధిగా తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు, పీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ నియమితులయ్యారు. ఆయనతో సహా 10 మంది నియామకానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆమోదముద్ర వేశారు. పలువురిని మీడియా ప్రతినిధులుగా కూడా నియమించినట్లు ఏఐసీసీ మీడియా విభాగం ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా సోమవారం వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే 9 మంది అగ్ర నేతలు సీనియర్ అధికార ప్రతినిధులుగాను, మరో 26 మంది అధికార ప్రతినిధులుగాను ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి కేంద్ర మాజీ మంత్రులు ఎస్.జైపాల్‌రెడ్డి, రేణుకా చౌదరి అధికార ప్రతినిధులుగా ఉండగా శ్రవణ్ తాజాగా నియమితులయ్యారు.

ఏఐసీసీలో తాజా నియామకాలు

అధికార ప్రతినిధులు: దాసోజు శ్రవణ్, సయ్యద్ నసీర్ హుస్సేన్, పవన్ ఖేరా, జైవీర్ షెర్గిల్, రాగిణి నాయక్, గౌరవ్ వల్లభ్, రాజీవ్ త్యాగి, అఖిలేశ్ ప్రతాప్ సింగ్, సునీల్ ఆహిరే, హీనా కవారే.
మీడియా ప్రతినిధులు: షామా మహమ్మద్, ఐశ్వర్య మహాదేవ్, అదిల్ బోపరాయ్, అమన్ పవార్, సంజయ్ ఛోకర్, అనిల్ ధంతోరీ, జరితా లైత్ఫలాంగ్.
జాతీయ ప్రధాన సమన్వయకర్త: సంజీవ్ సింగ్.
జాతీయ మీడియా సమన్వయకర్తలు: మనోజ్ త్యాగి, మహ్మద్ ఖాన్.

సిక్కు అల్లర్ల కేసులో లొంగిపోయిన సజ్జన్‌కుమార్

తూర్పు దిల్లీలోని మండోలి జైలుకు తరలింపు

దిల్లీ: 1984నాటి సిక్కు అల్లర్ల కేసులో జీవితఖైదు పడిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సజ్జన్‌కుమార్(73) సోమవారం దిల్లీ న్యాయస్థానంలో లొంగిపోయారు. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అదితిగార్గ్ ముందు లొంగిపోయిన ఆయన్ను పోలీసులు తూర్పుదిల్లీలోని మండోలి జైలుకు తరలించారు. నవంబరు 1, 1984న రాజ్‌నగర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగుర్ని హత్య చేసి, పక్కనే ఉన్న గురుద్వారకు నిప్పు పెట్టారన్న అభియోగాలు రుజువు కావడంతో సజ్జన్‌కుమార్‌కు యావజ్జీవ ఖైదు, మహేందర్‌యాదవ్, కిషన్‌ఖోఖర్ అనే మరో ఇద్దరికి పదేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ కోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. డిసెంబరు 31లోపు లొంగిపోవాలని గడువు విధించింది. ముగ్గురూ సోమవారం లొంగిపోయారు.

గుట్ట తవ్వకాల్లో బయటపడ్డ విష్ణుమూర్తి విగ్రహం



నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు గ్రామంలో ఓ గుట్టను తవ్వుతుండగా విష్ణుమూర్తి పురాతన విగ్రహం బయటపడింది. శ్రీమాన్ కెమికల్ సంస్థకు చెందిన భూమిని ఇటీవల హైదరాబాద్‌కు చెందిన కొందరు కొనుగోలు చేశారు. గత కొద్ది రోజులుగా ఆ భూమిని చదును చేస్తున్నారు. మూడు రోజుల క్రితం అందులోని ఓ గుట్టను తవ్వగా.. తొలుత రెండు నాగుపాములు వచ్చాయని స్థానికులు తెలిపారు. తరువాత విష్ణుమూర్తి విగ్రహం బయట పడిందన్నారు. ఈ విషయాన్ని సోమవారం మిర్యాలగూడ తహసీల్దార్ జె.కార్తీక్‌కు తెలియజేయగా.. విగ్రహాన్ని సమీపంలోని దేవాలయానికి తరలించారు.

– న్యూస్‌టుడే, తుంగపాడు(మిర్యాలగూడ గ్రామీణం)



సభలో మాట్లాడుతున్న ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భార్తి

ఫిబ్రవరి 19న ఛలో దిల్లీ

- ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భార్తి
- విద్యారంగ సమస్యలపై పోరాటానికేనని వెల్లడి

ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 19న 'ఛలో దిల్లీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాతీయ పాఠశాలల ఉపాధ్యాయ సమాఖ్య(ఎస్‌టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భార్తి తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహా సభల్లో భాగంగా రెండో రోజు సోమవారం ఖమ్మంలో జరిగిన ప్రతినిధుల సభలో ఆయన ప్రసంగించారు. విద్యారంగంపై వివిధ కమిషన్లు చేసిన ప్రతిపాదనలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీపీలో కనీసం 6 శాతం విద్యా రంగానికి కేటాయించాలన్న ప్రతిపాదన అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు విద్యకు పెద్దపీట వేస్తున్నాయని ఆరోపించారు. ఉచిత విద్యా హక్కు చట్టాన్ని కేజీ నుంచి పీజీ వరకు అమలు చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, జీడీపీలో విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధన కోసం దేశ వ్యాప్తంగా విద్యా రంగంలోని అన్ని స్థాయిల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ-అధ్యాపక-విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న దిల్లీలో జరిగే 'ఛలో పార్లమెంటు మహా ప్రదర్శన'లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీనికోసం జనవరిలో అన్ని రాష్ట్రాల్లో సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

జూన్ నుంచి గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు

కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి సుబ్రహ్మణ్యం

ములుగు రూరల్, న్యూస్‌టుడే: రాబోయే విద్యాసంవత్సరం నుంచే గిరిజన విశ్వవిద్యాలయంలో తరగతులను ప్రారంభించనున్నట్లు కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జాకారం గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టమ్మ సమీపంలో విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూములను ఆయన సోమవారం సందర్శించారు. జాకారంలోని యువజన శిక్షణ కేంద్రం సముదాయంలో తరగతుల నిర్వహణకు సంబంధించి వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ, యూనివర్సిటీ ఏర్పాటుకు ఇక్కడ అన్నీ అనుకూలంగానే ఉన్నాయన్నారు. భూసేకరణ అనంతరం పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. జాకారంలోని యువజన శిక్షణ కేంద్రంలో జూన్ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా, కేంద్ర పీడబ్ల్యూడీ సీఈ సాంబశివరావు, సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అప్పారావు, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

620 కిమీ వనితా మతిల్



- నేడు కేరళ తీరం వెంబడి మహిళల మానవహారం
- 40 లక్షల మంది పాల్గొంటారని అంచనా
- 'శబరిమల'పై పినరయి విజయన్ వ్యూహాత్మక ఎత్తుగడ



కొత్త సంవత్సరం.. తొలిరోజున కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తలపెట్టిన 'వనితా మతిల్'(మహిళల మానవహారం).. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అటు భాజపా, ఇటు కాంగ్రెస్‌లో కాక పుట్టిస్తోంది. 'శబరిమల'పై ప్రతిపక్షాల కంటే రాజకీయంగా ముందుండాలని విజయన్ వేసిన 'వ్యూహాత్మక' ఎత్తుపై విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాన్ని ప్రభుత్వవ్యయంతో చేపట్టడం అన్యాయమని వాదిస్తున్నాయి. రాష్ట్రప్రజల్ని మతప్రాతిపదికన నిట్టనిలువునా చీలుస్తున్నారని ఆరోపిస్తున్నాయి. విజయన్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏమిటీ 'వనితా మతిల్'?

కేరళ సముద్రతీరం వెంబడి ఉన్న రహదారులపై 620 కిమీ పొడవునా లక్షలమంది మహిళలతో మానవహారం(విమెన్ వాల్) నిర్మించాలని విజయన్ తలపెట్టారు. ఈ మహిళా కుడ్యాన్ని స్త్రీ-పురుష సమానత్వం, సామాజిక మేల్కొలుపు కోసం చేస్తున్న ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. కేరళలో ఉత్తరాన కాసర్‌గాడ్ నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకు నిర్వహించే మహిళల మానవహారంలో బాలికలు కూడా భాగమే. వీరికి సమాంతరంగా అక్కడక్కడా పురుషులూ మానవహారాల్లో భాగస్వాములవుతారు.

విజయన్ వ్యూహాత్మక ఎత్తుగడ

అన్ని వయస్సుల మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించొచ్చని సుప్రీంకోర్టు ఈ ఏడాది అక్టోబరు 28లో తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. తీర్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నాయర్ సేవా సంఘం, పందళం రాజవంశంతో పాటు అయ్యప్ప ఆలయం ప్రధాన పూజారి తీర్పును సమర్థించలేదు. 'సంఘ్' అనుబంధ సంస్థ అయిన శబరిమల కర్మసమితి తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నడిపిస్తోంది. కేరళలో 14.46శాతం ఓటు బ్యాంకు ఉన్న నాయర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. మొదట్లో ఆచితూచి వ్యవహరించిన కాంగ్రెస్, కాలక్రమంలో నాయర్లకు దూరం కావడం ఇష్టంలేక ప్రజల విశ్వాసాలకే ప్రాధాన్యం ఇస్తామని చెప్పింది.

ఫలించిన 'హిందూ' సమావేశం


అనాదిగా నాయర్లతో ఓ వర్గం సీపీఎంకు మద్దతుగా నిలుస్తోంది. భాజపా వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుండడంతో తమ ఓటుబ్యాంకు దెబ్బ తింటే భవిష్యత్తు ఎన్నికల్లో గెలవడం కష్టమని విజయన్ భావించారు. మొదటి నుంచి సుప్రీంకోర్టు తీర్పును సమర్థిస్తున్న ఆయన, వయస్సుతో సంబంధం లేకుండా మహిళలందరికీ ఆలయ ప్రవేశం కల్పించాలని కోరుతున్నారు. ఇదే ఉద్దేశంతో డిసెంబరులో 174 'హిందూ' సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఇందులో 'కేపీఎంఎస్' ప్రధాన కార్యదర్శి పున్నాల శ్రీకుమార్ కూడా పాల్గొన్నారు. ఈయనే మహిళల మానవహారం ప్రతిపాదన చేశారు. ఈ సమావేశంతో రాష్ట్రంలో కులసమీకరణాలు మారిపోతాయని అంచనా వేసిన భారత్ ధర్మ జనసేన(బీజేడీఎస్) ముందుజాగ్రత్త పడింది. విజయన్ ఆలోచనకు సై అంది. ఇది కేరళలో ఎన్డీయే ప్రధాన మిత్రపక్షం. కేరళ జనాభాలో 22.6శాతం ఉన్న 'ఈళవ జాతి'కి ప్రధాన సంస్థ. 'కేపీఎంఎస్'తో కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు, 'బీజేడీఎస్'తో భాజపా ఓటుబ్యాంకు చిల్లు పడినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఓటుబ్యాంకు రాజకీయం

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం సుపరిపాలన ఒక్కటే 'ఎల్‌డీఎఫ్'కు సీట్లు కట్టబెట్టలేదని విజయన్ భావిస్తున్నారు. 20 లోక్‌సభ స్థానాలున్న కేరళలో 2014లో ఎల్‌డీఎఫ్‌కు 40.12శాతం ఓట్లు పోలయ్యాయి. ఎనిమిది సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'యూడీఎఫ్'కు 40.27 శాతం ఓట్లు పోలైనా, 12 సీట్లు కైవసం చేసుకుంది. ఎన్డీయేకు 10.33శాతం ఓట్లు పోలైనా ఖాతా తెరవలేకపోయింది.

శబరిమల విషయంలో నాయర్లు తమ పార్టీకి దూరమయ్యారని విజయన్ భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసుకోవాలన్నా, లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవాలన్నా హిందూ ఓటు బ్యాంకులో కొత్తవర్గానికి చేరువ కావాలని ఆయన విశ్వసిస్తున్నారు. ఆ దిశగా భాజపా, కాంగ్రెస్‌పై ఇప్పటికే వ్యూహాత్మక విజయం సాధించినట్లే కనిపిస్తోంది. మహిళల మానవహారం కార్యక్రమంలో ఎన్డీయే మిత్రపక్షమైన జానాధిపత్య రాష్ట్రీయ సభతో పాటు ఎస్ఎన్‌డీపీ, కేరళ పులయ మహాసభ పాల్గొంటున్నాయి.

–ఈనాడు ప్రత్యేక విభాగం



ఎవరికి లెక్కలు వారివి!

సుమారు 40లక్షల మంది మహిళలు పాల్గొనబోతున్నారని ప్రభుత్వవర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రతిపక్షాలు మాత్రం పది లక్షలకు మించరంటున్నారు. వాస్తవానికి సీపీఎం చోటామోటా నాయకులకు.. పార్టీ అధినాయకత్వం నుంచి అందిన సలహా ప్రకారం.. మీటరుకు ముగ్గురు మహిళలను నిల్చోబెట్టాలి. అంటే కిలోమీటరుకు మూడు వేలమంది పడతారు. కేరళలో సముద్రతీరం వెంబడి రోడ్ల పొడవు 490 కిమీ. అంటే 14లక్షల 70వేలమంది అవసరమవుతారు. ఎర్నాకుళంలాంటి జిల్లాల్లో కొండలు ఎక్కువ కాబట్టి, మహిళల్ని రోడ్లపైకి తరలించడం కష్టం. ఇలాంటిచోట్ల సమీప జిల్లా అయిన ఇడుక్కి నుంచి వందల బస్సుల్లో మహిళల్ని తరలించే ఏర్పాట్లు చేశారు.

5 కిమీ... ప్రతి ఐదు కిమీలకు ఒక అంబులెన్స్ ఏర్పాటు. ఎవరైనా అస్వస్థతకు గురైతే స్థానిక ఆసుపత్రికి చేరుస్తారు.

176 సీపీఎం ఆధ్వర్యంలో 176 సామాజిక సంస్థలు, రాజకీయపార్టీలు పాల్గొంటున్నాయి. సీపీఐ, శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం(ఎస్ఎన్‌డీపీ), కేరళ పులయార్ మహాసభ(కేపీఎంఎస్) కూడా ముఖ్యభూమిక పోషిస్తున్నాయి.

200 పాల్గొంటున్న ప్రముఖుల సంఖ్య. తిరువనంతపురంలో ముఖ్యమంత్రి విజయన్ పాల్గొంటారు.

అప్పటిదాకా ఆటలాడి.. అంతలోనే ఆయువు తీరి

- పొదల్లో తొమ్మిదేళ్ల బాలుడి మృతదేహం
- మర్మాంగాలపై బలమైన గాయాలు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: అప్పటివరకు చలాకీగా తోటి పిల్లలతో ఆడుకున్న బాలుడు.. అంతలోనే అదృశ్యమయ్యాడు. చెట్ల పొదల్లో విగతజీవిగా కనిపించాడు. ఆదివారం రాత్రి శంషాబాద్ పరిధి పాలమాకులలో తొమ్మిదేళ్ల బాలుడి అనుమానాస్పద మృతి స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్థులు, శంషాబాద్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పాలమాకులకు చెందిన మద్దూరి చినరాజు, నిర్మల దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నవాడైన దినేష్(9) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం దినేష్ తోటి పిల్లలతో కలిసి సైకిల్‌పై ఆడుకుంటున్నాడు. కొద్దిసేపటి తర్వాత కనిపించలేదు. రాత్రి వరకు దినేష్ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు గ్రామ పరిసరాల్లో వెతికారు. రాత్రి 12 గంటల సమయంలో తమ ఇంటికి కొద్దిదూరంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోని పొదల్లో దినేష్ శవంగా కనిపించాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఘటనాస్థలంలో ఆధారాలను సేకరించారు. దినేష్‌తో ఆడుకున్న మరో బాలుడిపై అనుమానంతో విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. దినేష్ ధరించిన ప్యాంటు మోకాలి వరకు తొలగించి ఉండటం, మర్మాంగాలపై బలమైన గాయాలు కనిపించడంతో ఇది ముమ్మాటికి హత్యేనని గ్రామస్థులు, బాలుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శవపరీక్ష నివేదిక వస్తేనే మృతికి గల కారణాలపై స్పష్టత వస్తుందని శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తెలిపారు.

అమ్మ కడుపు అలసిపోయింది!

- మగబిడ్డ కోసం కుటుంబం ఒత్తిడి
- పదో కాన్పులో ప్రాణాలు విడిచిన మహిళ

ముంబయి: కాలమెంత మారుతున్నా కొందరు మనుషుల్లో మూర్ఖత్వం మాత్రం మారడం లేదు. ఆడపిల్లలు ఆణిముత్యాల్లా ఎదుగుతూ కన్నవారికి పేరుప్రఖ్యాతులు తెచ్చిపెడుతున్నా మగబిడ్డ కావాలన్న వివక్ష ధోరణి కొన్ని కుటుంబాల్లో పోవడం లేదు. ఇలాంటి ఓ కుటుంబ వైఖరి మహారాష్ట్రలో ఓ మాతృమూర్తి నిండు ప్రాణాలు బలిగొంది. ప్రమాదకరమని తెలిసినా మగబిడ్డ కావాలన్న ఆ కుటుంబ ఒత్తిడి తట్టుకోలేక ఆ తల్లి పదోసారి గర్భం దాల్చాల్సి వచ్చింది. ఇప్పటికే ఏడుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చి, రెండుసార్లు గర్భవిచ్ఛిత్తి కూడా జరిగిన ఆమెకు మరోసారి కాన్పు సమయంలో అధిక రక్తస్రావం అయింది. ఆ కుటుంబం కోరుకున్నట్లు మగబిడ్డ పుట్టినప్పటికీ దారుణం జరిగిపోయింది. ఈమేరకు బీడ్ జిల్లా మాజల్‌గాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మీరా ఎఖాండే (38) అనే మహిళ శనివారం మృతశిశువుకు జన్మనిచ్చి ప్రాణాలు విడిచింది. మాజల్‌గాన్‌లో పాన్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న మీరా ఇప్పటికే 9 సార్లు గర్భం దాల్చింది. ఏడుగురు ఆడపిల్లలు పుట్టగా తర్వాత వారిలో ఓ కుమార్తె కూడా చనిపోయింది. అయితే ఆ కుటుంబం మగ బిడ్డ కావాలని పట్టుబట్టినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

సైనిక్ స్కూల్ ఇదిగో.. అదిగో..

- కేంద్రం మంజూరు చేసి రెండేళ్లైనా పట్టాలెక్కని పాఠశాల
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాక జాప్యం
- రాబోయే ఏడాదీ తరగతుల ప్రారంభం లేనట్లే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు వ్యవహారం ముందుకు కదలడం లేదు. కేంద్ర ప్రభుత్వం పాఠశాలను మంజూరు చేసి రెండేళ్లు దాటినా ఇప్పటివరకు భవనం పనులే మొదలుకాలేదు. స్థలం సిద్ధంగా ఉన్నా.. దాదాపు రూ.100 కోట్ల నిధుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం సందిగ్ధంలో ఉండటంతో రాబోయే విద్యాసంవత్సరం కూడా తరగతులు ప్రారంభం కాకపోవచ్చని తెలుస్తోంది. విజయనగరం, చిత్తూరు జిల్లా కలికిరిలో ఉన్న రెండు సైనిక్ స్కూళ్లు. రాష్ట్ర విభజనతో ఏపీ పరిధిలోకి వెళ్లాయి. రెండేళ్ల కిందట అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వరంగల్ జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటును ప్రతిపాదించారు. కేంద్ర రక్షణ శాఖ 2016 నవంబరులోనే సూత్రప్రాయంగా అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాల స్థలంతోపాటు మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.100 కోట్లు, వేతనాలు, ఇతర నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని సైనిక్ స్కూల్ సొసైటీకి హామీపత్రం సమర్పించింది. దాంతో కేంద్రం పాఠశాలకు పచ్చజెండా ఊపింది. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామ పరిధిలో 50 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకువచ్చింది. భూసేకరణ కోసం ఆరు నెలల క్రితమే రూ.4.63 కోట్లు విడుదల చేసింది. మౌలిక వసతుల కల్పనకు విద్యాశాఖ రూ.95 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆర్థికశాఖకు జూన్‌లో దస్త్రాన్ని పంపింది. ఈ దస్త్రానికి మోక్షం లభించలేదు. ఇప్పుడు నిధులు విడుదల చేసినా జూన్ నాటికి భవనాల నిర్మాణం పూర్తి కావడం కష్టమే.



సైనిక్ స్కూల్ కోసం ఎంపిక చేసిన స్థలం

సైనిక్ పాఠశాల ప్రత్యేకతలివీ...

- ★ సైనిక్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికతో విద్యనందిస్తారు.
- ★ రెసిడెన్షియల్ విధానంలో మొత్తం 600 మందికి నాణ్యమైన విద్య లభిస్తుంది.
- ★ వివిధ రకాల క్రీడల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తారు.
- ★ విద్యాభ్యాసం పూర్తి చేశాక రక్షణ, నావికా రంగంలో ఉన్నతోద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

ఏడాదంతా వైద్య పరీక్షలే!

- ఫిబ్రవరి నుంచి చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు
- సంవత్సరం పాటు నిరాంటకంగా శిబిరాలు
- దంత సమస్యల్లో కొన్నింటికి అక్కడికక్కడే చికిత్స
- చెవి, ముక్కు, గొంతు సమస్యలపై ప్రాథమిక అంచనా
- చికిత్స అవసరమైన వారికి ఉన్నతాసుపత్రుల్లో వైద్యం
- శిబిరాల్లోనే అవయవ లోపాల ధ్రువపత్రాల జారీ
- నిర్ధారణ పరీక్షల నిర్వహణపై వైద్యఆరోగ్యశాఖ కసరత్తు

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా ఫిబ్రవరి నుంచి చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి నుంచి వైద్య శిబిరాలు ప్రారంభిస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో నిర్ధారణ పరీక్షల నిర్వహణపై వైద్యారోగ్యశాఖ కసరత్తు ఆరంభించింది. ఇదే విషయంపై చర్చించడానికి వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి సోమవారం ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.



నిపుణులను సమకూర్చుకోవడం సవాలే

'రాష్ట్రంలో దంత వైద్యులు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉంటారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు తక్కువగా ఉంటారు. వీళ్లను శిబిరాలకు తీసుకురావడం సాధ్యమా?' అనే అంశం ముఖ్యకార్యదర్శి వద్ద భేటీలో చర్చకు వచ్చినట్లు సమాచారం. శిబిరంలో కనీసం ఇద్దరు దంత వైద్యులుంటే రోజులో గరిష్ఠంగా 200 మందిని పరీక్షించగలరని, ఒక వైద్యుడు రోజుకు గరిష్ఠంగా 20 మందికి చికిత్స అందించగలడని అంచనా. దీని ఆధారంగా ఒక గ్రామంలో ఎన్నిరోజులు వైద్య శిబిరం నిర్వహించాల్సి ఉంటుందనే దానిపైనా సమావేశంలో చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సి వస్తుందని, కనీసం ఏడాది పాటు శిబిరాలను కొనసాగించాల్సిన అవసరం ఉంటుందన్న అభిప్రాయానికి వచ్చారు. ఒక్కో దంత వైద్య శిబిరంలో పరికరాలు, ఔషధాలను సమకూర్చడానికి కనీసం రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. చెవి, ముక్కు, గొంతు పరీక్షలు చేసే విధానాన్ని తాను స్వయంగా పరిశీలిస్తానని, అందుకోసం కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రికి వస్తానని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో పేర్కొన్నారు. 3న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వద్ద జరిగే సమీక్షలో వైద్య పరీక్షలకు సంబంధించిన ప్రణాళిక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని వైద్యవర్గాలు తెలిపాయి. అనంతరం ముఖ్యమంత్రితో భేటీ ఉంటుందనీ, అక్కడే కార్యక్రమానికి తుది రూపునిస్తారని పేర్కొన్నాయి.

ఈఎన్‌టీ శిబిరాలు ఇలా

- ★ గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో చెవి, ముక్కు, గొంతు సమస్యలకు ఒకటి, దంత సమస్యలకు మరొకటి చొప్పున వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.
- ★ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల కొరత దృష్ట్యా ఎంబీబీఎస్ వైద్యులే సమస్యలను ప్రాథమికంగా అంచనా వేస్తారు.
- ★ చికిత్స అవసరమైన వారిని నిర్దేశించిన తేదీల్లో సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు తరలిస్తారు.
- ★ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఆడియోమెట్రిషియన్, ఆడియాలజిస్టులను అందుబాటులో ఉంచుతారు.
- ★ అవసరమైన వినికిడి యంత్రాలనూ సమకూరుస్తారు.
- ★ వినికిడి లోపాలున్న వారికి గ్రామ స్థాయి శిబిరాల్లోనే 'అవయవ లోప ధ్రువీకరణ పత్రాన్ని' అందజేయాలనే ఆలోచనలో అధికారులున్నారు.

దంత పరీక్షలు ఇలా

- ★ దంత పరీక్షల్లో భాగంగా చిగుళ్లలో వాపు, చిగుళ్ల నుంచి రక్తం కారడం, పిప్పిపంటి బాధితులకు 'ఫిల్లింగ్' వంటి చికిత్సలను అక్కడికక్కడే అందిస్తారు.
- ★ పళ్లు విరిగిపోవడం, దంతాల వంకర, ఎగుడుదిగుడుగా ఉండడం, దంతాల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలున్న వారిని సమీపంలోని పెద్దాసుపత్రికి తీసుకెళ్తారు.
- ★ ఇన్‌ఫెక్షన్లను తగ్గించే ఔషధాలను కూడా అందజేస్తారు.

నెల వ్యవధిలో సాధ్యమేనా?

చెవి, ముక్కు, గొంతు, దంత వైద్య శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించడంపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 30 రోజుల వ్యవధిలో రెండు భిన్న రకాల వైద్య పరీక్షలకు సన్నద్ధమవడం సాధ్యమేనా? అనే సందేహాలను కొందరు వ్యక్తపరుస్తున్నారు. 'కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఆ శిబిరాల్లో పాల్గొంటున్న వైద్యాధికారులు చెవి, ముక్కు, గొంతు, దంత వైద్య శిబిరాల్లో పాల్గొనడానికి అవకాశాలు ఉండవు. ఇది కూడా అవరోధమవుతుంది. ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లనే కంటి వెలుగు కార్యక్రమం విజయవంతమైంది. ప్రణాళిక లేకుండా హడావుడిగా కొత్త శిబిరాలు ప్రారంభిస్తే అనర్థాలు ఎదురయ్యే అవకాశాలూ లేకపోలేదు' అనే వాదనను అధికారులు ముఖ్యకార్యదర్శి శాంతికుమారి వద్ద వినిపించినట్లు సమాచారం.

ఒళ్లంత.. పులకింత

.. ఎంతెంత?

మనకు అనుకూలంగా ఒక పని జరిగితే... సంతోషం! ఒకవేళ అది మనకు వ్యతిరేకమైనదైతే... దుఃఖం!! ఇలా రోజూ ఎన్నో పనులు, సంఘటనలు మనకు రకరకాల భావోద్వేగాలను మిగులుస్తుంటాయి. వీటిలో కొన్ని సానుకూలంగా, మరికొన్ని ప్రతికూలంగా ఉండటం అత్యంత సహజం. ఒకప్పుడు కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి తదితర ప్రతికూలాంశాల గురించే ఎక్కువగా పరిశోధించిన మనస్తత్వ శాస్త్రవేత్తలంతా ఇప్పుడు సంతోషం, సంతృప్తి వంటి సానుకూల స్పందనలపై దృష్టి సారిస్తున్నారు. మరి ఎలాంటి అంశాలు మనకు సంతోషం కలిగిస్తాయో, వాటి గురించి పరిశోధకులు ఏం చెబుతున్నారో ఓ సారి చూద్దామా...

"సంతోషంగా ఉంటే మనం నవ్వం. నవ్వితేనే మనకు సంతోషం కలుగుతుంది."
- విలియం జేమ్స్



"కొత్త సంవత్సరం సంతోషంగా గడుస్తుందన్న భావనే ఆశలను చిగురింపజేస్తుంది"
- ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్

సంతోషమనేది ఒక అనిర్వచనీయ భావన. బ్రహ్మపదార్థం లాంటిది. సంతోషమంటే ఇదీ.. ఇలా ఉంటుంది.. ఫలానా పని చేస్తే అందరికీ కచ్చితంగా లభిస్తుంది అని చెప్పలేం. అలాగని ఇది లేకుండా మనిషి ఎంతో కాలం మనుగడ సాగించలేడు. సాగించినా దానికి అసలు అర్థమే ఉండదు. అంత ముఖ్యమైనది కాబట్టే... 'జీవితం సంతోషంగా గడిచిపోతే చాలు' అని అంటుంటారు కుబేరులు కూడా! పాజిటివ్ సైకాలజీ రంగం ఇప్పుడు సంతోషం చుట్టూ తిరుగుతూ, దానికి దారులను వెతికే పనిలో పడింది.

కొలబద్ధలు మారుతున్నాయి...

చాలామంది సంతోషాన్ని డబ్బుతో కొలిచే ప్రయత్నం చేస్తుంటారు. కానీ, నిజంగా డబ్బు వల్ల మనిషికి ఆనందం కలుగుతుందా? ఎంత ఎక్కువగా సంపాదిస్తే మనిషి జీవితం కూడా అంత అధికంగా సంతోషభరితం అవుతుందా? కానే కాదంటున్నాయి తాజా పరిశోధనలు. పేదరికం, అవినీతి, హింస వేధిస్తున్నా కొన్నేళ్ల క్రితం ప్రపంచంలోనే ఎక్కువమంది సంతోషంగా ఉన్న దేశంగా నైజీరియా నిలిచింది! ఇప్పటికీ ఆనందపు స్థాయిలో భారత్ 133 స్థానానికే పరిమితం కాగా, నైజీరియా 91వ స్థానంలో ఉండటం గమనార్హం. ఆఫ్రికా దేశాల వారు చాలా ఆనందంగా జీవనం సాగిస్తుండటానికి కారణం: ఒకటి-సంగీతం. రెండోది- దైవం. రెండూ మనసును ఆహ్లాదపరిచేవే. బాహ్య పరిస్థితులేవీ వారిని ఇసుమంత కూడా ప్రభావితం చేయలేకపోతుండటం పరిశోధకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. అందుకే... ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేయడానికి ఆర్థిక పరిస్థితులతో పాటు వారి సుఖ జీవన పరిస్థితులనూ లెక్కగట్టాలని ప్రముఖ మనస్తత్వ పరిశోధకుడు, నోబెల్ పురస్కార గ్రహీత డేనియెల్ కహ్నెమాన్ సూచించారు.



'సంతోషం' కలుగుతుందిలా...

మెదడులోని ఆనందమయ కేంద్రాలు ఉత్తేజితమైనప్పుడు కలిగే సానుకూల భావనే... సంతోషం! నుదుటి వెనుక భాగాన కార్టెక్స్ ఉంటుంది. మనకు ఆనందం కలగాలంటే, ఇందులోని ఎడమవైపు భాగం ఉత్తేజితమవ్వాలి. ఇందులోని కొన్ని హార్మోన్లు కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఒడుదొడుకుల్లేకుండా, ఉల్లాసంగా ఉత్సాహంగా జీవితం గడిపేసేవారిలో ఈ మెదడు భాగం చాలా చైతన్యంగా ఉంటుందని ఇప్పటికే చాలా పరిశోధనల్లో రూఢి అయింది. చిత్రకారులు, సంగీత విద్వాంసులు, గాయకులు తదితర కళాకారులు, క్రీడాకారుల్లో తరచూ ఈ భాగం చాలా ఉత్తేజంగా ఉంటుందని తేలింది కూడా.

మద్యం సేవించడం, మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కృత్రిమంగా కొంతసేపు కార్టెక్స్ ఉత్తేజితమై, తాత్కాలికంగా ఆనందం అనిపించినా... ఆ ప్రభావం తగ్గిపోగానే మళ్లీ ప్రతికూల భావనలు ముసురుకుంటున్నట్లు పరిశోధకులు స్పష్టంగా గుర్తించారు.

పనిలో... ప్రేమలో...

సంతోషంగా ఎప్పుడుంటామన్న ప్రశ్నకు- మనస్తత్వశాస్త్ర పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్ మంచి సమాధానమిచ్చి వెళ్లారీ ప్రపంచానికి. ఒకటి- పని. రెండు- ప్రేమ. ఈ రెండూ దండిగా ఉన్నవాళ్లు సంతోషంగా జీవించగలరని చెప్పారాయన. ఆ ప్రేమంతా పనిపైనే ఉంటే ఇంకెంత ఆనందంగా ఉండొచ్చో తెలియదుగానీ... 'భవిష్యత్తుపై ఆశ' కూడా తోడైతే జీవితం పండగేనంటున్నారు మరికొందరు శాస్త్రవేత్తలు. జీవనశైలిని మార్చుకోవడం ద్వారా సంతోష స్థాయుల్ని పెంచుకోవచ్చని కొందరు పరిశోధకులు అంటుంటే... అబ్బబ్బే, అది పూర్తిగా జన్యుసంబంధ విషయం, దాన్ని పెద్దగా మార్చేదేమీ ఉండదన్నది మరికొందరి వాదన. అయితే, ఆమోదయోగ్య సిద్ధాంతం మాత్రం ఒకటుంది. దాని ప్రకారం- ప్రతి వ్యక్తికి ప్రత్యేకంగా ఒక 'సంతోష స్థాయి' అనేది ఉంటుంది. ఏదైనా సాధించినప్పుడు, లాటరీ వంటిది తగిలినప్పుడు ఆ స్థాయి అమాంతం పెరిగిపోతుంది. అదే అనూహ్యంగా, అనుకున్నదానికి విరుద్ధంగా పరీక్షల్లో ఫెయిలవ్వడం వంటివి సంభవిస్తే... సంతోష స్థాయి అమాంతం పడిపోయి, విషాదం చుట్టుముడుతుంది. ఇలాంటి అధిక సంతోషమైనా, బాధయినా... 6-10 నెలలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ సంతోష స్థాయి పూర్వ స్థితికి చేరుతుంది. అందుకే... జీతం పెరగడం, పదోన్నతి, పెళ్లి వంటి ఘట్టాలు ఎంతోకాలం ఆనందాన్ని ఇవ్వలేవట. విడాకులు, ఉద్యోగం పోవడం, సన్నిహితుల మరణం వంటివి కూడా ఎంతోకాలం కుంగిపోయేలా చేయలేవట. వీటికి జనం త్వరగానే అలవాటు పడతారట.

సంతోషం ఎలా సాధ్యం?

షికాగో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు దీనిపై చక్కటి పరిశోధనలు సాగించారు. కుటుంబ సభ్యులు కాకుండా, కనీసం ఐదుగురు వ్యక్తులతో అత్యంత ఆత్మీయ సంబంధాలు ఉండేవారు మిగతా వారికంటే 50% ఎక్కువ ఆనందంగా ఉంటారని తేల్చారు! జీవితం పూర్తిగా తమ కోసమేనని అనుకోకుండా, ఎంతోకొంత సామాజిక సేవ చేయడం ద్వారా ఆనందాన్ని ఆస్వాదించవచ్చని రూఢిపరిచారు. అయితే... ఇతరులతో పోల్చుకోవడం వల్ల ఆనందం తగ్గిపోయే ముప్పుందని స్వీడన్ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. సంతోషం పొందే విషయమై ప్రపంచ వ్యాప్తంగా పలువురు మానసిక-ఆర్థిక శాస్త్రవేత్తలు కలిసి చేసిన పరిశోధనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఒక్కటే చెబుతున్నాయంటున్నారు సింగపూర్‌కు చెందిన పరిశోధకుడు మాల్కం చోలింగ్.

"కొద్దిమంది ఆత్మీయులు ఉండటం + సంపాదన కోసం విపరీతమైన తాపత్రయం లేకపోవడం + ఇతరుల పట్ల దయతో మెలగడం + జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని చేరేందుకు ప్రయత్నించడం = సంతోషం" అని దీన్ని సూత్రీకరించారాయన!

సాధన సంతోషం

మనం ఒక లక్ష్యాన్ని పెట్టుకుంటాం. దాన్ని చేరుకోవడానికి తపిస్తాం. చివరకు సాధిస్తాం. దీంతో అద్వితీయమైన అనుభూతి మన సొంతమవుతుంది. కానీ, ఆ విజయోత్సాహం కొన్నాళ్లే ఉంటుంది. మళ్లీ బోర్ కొట్టిందంటే, దానర్థం- మళ్లీ మనకో విజయం కావాలన్న మాట! ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా ఏదో కటి సాధిస్తూ ఉంటే జీవితం పండగలా ఉంటుందంటున్నారు పరిశోధకుడు డెస్మండ్ మోరిస్.

సమర సంతోషం

ప్రత్యర్థులను ఓడించి సంపాదించిన సంతోషం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఏదైనా క్రీడా పోటీలో తలపడి విజయం సాధించిన విజేతల మొహాల్లో ఇది అత్యంత స్పష్టంగా కనిపిస్తుంటుంది. అది అక్కడితే ఆగిపోదు. అభిమానుల్లోకి కూడా ఆ సంతోషం ప్రకంపనలు సృష్టిస్తుంది. కేరింతలు కొట్టిస్తుంది. మరెందరికో స్ఫూర్తిని రగిలిస్తుంది.

శృంగార సంతోషం

శృంగారంలో లభించే భావప్రాప్తి.. మనిషి అనుభవించే అత్యంత సున్నితమైన సంతోషానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. పునరుత్పత్తి ప్రక్రియలో ఇంతటి ఉక్కిరిబిక్కిరి చేసే అనూహ్య ఆనందమే లేకపోతే- అసలు జీవజాతులు ఇంతగా వర్ధిల్లేవా అని విశ్లేషకులు చెబుతుంటారు. కేవలం అండాలు విడుదలయ్యే సమయంలోనే కాకుండా, మిగతా సమయాల్లో కూడా స్త్రీలు అంతే సౌందర్యంతో, సుకుమారంతో ఉండటమనేది స్త్రీ-పురుష బంధం విడువకుండా నిలబడేందుకు ఉపకరిస్తుందట. అందుకే మనుషులకు శృంగారపరమైన సంతోషం పొందమన్నది శారీరకంగా కూడా ఎంతో పరిణతి చెందిందని వ్యాఖ్యానిస్తున్నారు.


వాత్సల్య సంతోషం

శృంగారంలో పొందిన అత్యున్నత ఆనందానికి కొనసాగింపుగా... బిడ్డలపై తల్లిదండ్రులకు అత్యంత సహజంగా పొంగుకొచ్చేదే వాత్సల్యం. దాని ద్వారా లభించే సంతోషం అద్వితీయమైనది. పండంటి బిడ్డను ఈ లోకంలోకి ఆహ్వానించి, పెంచి పోషించి, రక్షించడం వంటి స్పందనలన్నీ తల్లిదండ్రులకు జన్యుపరంగానే సంక్రమిస్తాయనీ, వాత్సల్యపూరిత సంతోషానికి ఇదే మూలమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆధ్యాత్మిక సంతోషం

మనస్ఫూర్తిగా, సంపూర్ణంగా దైవాన్ని విశ్వసించడం, ఈ దైహిక-ప్రాపంచిక భారాన్నంతా దేవుడి మీదే ఉంచడం వల్ల... మనిషికి చాలా భారం తగ్గిపోతుంది. ఇలాంటి ఆధ్యాత్మిక భావన మనిషికి ఎంతో సంతోషం కలిగిస్తుందంటున్నారు డెస్మంట్ మోరిస్. పసిబిడ్డ- తన దృష్టిలో అత్యంత ప్రేమాస్పదమైన తన తల్లిదండ్రుల కౌగిట ఎంత నిశ్చింతగా విశ్రాంతి పొందుతాడో... భక్తుడు కూడా దైవ సన్నిధిలో అంతటి ప్రశాంతతను పొందుతాడు.

'లయా'త్మక సంతోషం



మన దినచర్యలో ఎక్కడ 'లయ' తారసిల్లినా మనం అనిర్వచనీయ తన్మయ లోకానికి వెళ్లిపోతుంటాం. సంగీతం, నృత్యం, గానం, ఏరోబిక్స్, జిమ్నాస్టిక్స్, సైనిక కవాతు... ఇలా వీటన్నింటిలోనూ లయ ఉంటుంది. ఆ ధ్వనుల్లో, కదలికల్లో, ఎక్కడ లయ ఉన్నా- ప్రధానంగా మన మెదడులోని 'హయ్యర్ సెంటర్స్' క్రమేపీ నిద్రావస్థలోకి వెళ్లి, కండరాలన్నీ విశ్రాంతి దశలోకి వస్తాయి. ఈ దశలో మనకు ఏ బాధా తెలియకుండాచేసే సహజమైన బాధానివారిణులైన ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. అందుకే... లయ వెంట అంతటి సంతోష భావన!

హాస్య సంతోషం



హాస్యంలో ఒక రకమైన సురక్షిత భావన ఉంటుంది. ఎవరైనా జోక్స్ వేసినా, హాస్య ప్రదర్శనల్లోనూ వారు చేసే వ్యాఖ్యలను మనం అంతగా పట్టించుకోకపోవడానికి కారణమదే. కేవలం వాటిని మనం హాస్యంగానే చూస్తాం. అందుకే నవ్వులో మనకు అంతటి నిశ్చింత, సంతోషం ఉంటాయంటున్నారు పరిశోధకుడు మోరిస్.



ఆనందాలే... పూసిన పొదరిల్లు

ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ 'పోటీ' సంస్కృతి విస్తరిస్తున్న మాట వాస్తవం. సమాజంలో మనం వెనకబడిపోకుండా ఉండాలంటే... అందరితోపాటే మనమూ పరుగు తీయాలి. అలాగని మనకు స్ఫూర్తి కేంద్రమైన కుటుంబాన్నీ, మనకు నిజమైన ప్రేమ, ఆప్యాయతలను పంచే తల్లిదండ్రులను, తోబుట్టువులను విస్మరించకూడదు కూడా. చదువు, ఉద్యోగం, వ్యాపారం... ఇలా మనం ఏ పని తలపెట్టినా అందులో రాణించాలంటే కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎంతో కీలకం. ప్రముఖ వృత్తి నిపుణుల సామాజిక వేదిక 'లింకిడిన్' 2015లో ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో- 72% మంది భారతీయులు తాము సంతోషంగా ఉండటం వల్లే విజయాలు సాధించగలిగామని, కుటుంబ సభ్యుల మధ్య బలమైన వ్యక్తిగత సంబంధాలు ఉండటమే తమ ఆనందానికి ప్రధాన కారణమని చెప్పడం విశేషం! మరి.. కుటుంబంలో మరింత సంతోషం నింపడానికీ, కుటుంబ సభ్యులతో మరింత అన్యోన్యంగా కలిసి జీవించడానికి మానస్తత్వ నిపుణులు చెబుతున్న 'కుటుంబ సంతోష మార్గదర్శకాలు' ఏమిటో ఓసారి చూద్దామా...

నిందలు వద్దు

'నేనెప్పుడూ తప్పు చేయను. ఎవరైనా తప్పు చేస్తే ఊరుకోను' అనే తత్వం అన్నివేళలా పనికిరాదు. మనిషి తప్పులు చేయడం సహజమని గుర్తించండి. అయితే, వాటిని పెద్దగా చర్చించి, అస్తమానూ నిందించడం తగదు. ఆ తప్పును సరిదిద్దుకునేలా మిగతా కుటుంబ సభ్యులంతా వారికి ప్రోత్సహించాలి. తద్వారా తోవతప్పిన తమ సొంత వ్యక్తిని రక్షించుకోగలిగామన్న సంతృప్తి, ఆనందం కుటుంబంలో నెలకొంటుంది.

ఎవరు చెప్పినా వినాలి

చిన్న పిల్లలే కదాని పెద్దవాళ్లు తీసిపాడేయడానికి లేదు. వారు చెప్పింది కూడా వినాలి. పిల్లలు కూడా పెద్దవాళ్ల మాటకు గౌరవం ఇవ్వాలి. ఏ విషయంలోనైనా అందరూ సొంతంగా చర్చించుకుని, ఉత్తమ నిర్ణయం తీసుకోవడం కుటుంబానికి క్షేమం. సంతోషం.

వాళ్లకీ చెప్పాలి 'థాంక్యూ'

బయటివారు ఏ చిన్న సాయం చేసినా 'థాంక్యూ వెరీ మచ్' అని చెబుతుంటాం. మరి ఇంట్లో వారి విషయంలో ఎందుకు చెప్పకూడదు? కృతజ్ఞత అనేది కృత్రిమ భావనగా కాకుండా, హృదయపూర్వకంగా ఉన్నప్పుడే మనసుకు ఆనందం కలుగుతుంది. ఇంట్లోవాళ్లు ఎవరు ఎవరి నుంచి సాయం పొందినా మనస్ఫూర్తిగా 'థాంక్యూ' చెప్పండి.



కలిసి తింటే కలదు సుఖం

కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడమనే సంప్రదాయం ఇంట్లో ఉంటే... ఇష్టమైన వాటిని వండుకోవడం, కొసరి కొసరి వడ్డించుకోవడం అనేది జరుగుతుంది. తద్వారా మెదడులో సంతృప్తి, ఆనందం కలిగించే హార్మోన్లు ఉత్తేజితమవుతాయి. కుటుంబ సభ్యుల మధ్య బంధం బలపడటానికి ఇదొక బలమైన కారణమవుతుంది.

అబద్ధం నిషిద్ధం

కుటుంబ సభ్యులతో ఎప్పుడూ అబద్ధం ఆడకండి. దీనివల్ల సొంత మనుషుల దగ్గర పరపతి, నమ్మకం కోల్పోతారు. ఒక్కోసారి మీరు నిజం చెప్పినా వారు పట్టించుకోకపోవడం వల్ల మొత్తం కుటుంబానికే నష్టం జరగవచ్చు కూడా! ఒకవేళ మీరు తప్పు చేసినాసరే, నిజం చెప్పేశారనుకోండి... మీ మీద వారికి అపారమైన నమ్మకం కలుగుతుంది.

ఇంటింటి సంతోషం ఈ గవాక్షం

ఆటలతో హాయ్ హాయ్

పిల్లలు-తల్లిదండ్రులు కలిసి ఆడుకోవడం వారి మధ్య బాంధవ్యాన్ని మరింత దృఢపరుస్తుందట. వీలైతే అమ్మ గ్రూపు, నాన్న గ్రూపుగా పిల్లలు ఆటల్లోకి దిగితే అదొక మంచి జ్ఞాపకంగా మారుతుందట.

విహారానందం

పిల్లాపాపలతో కలిసి ఏడాదికి కనీసం ఒకట్రెండు సార్లయినా విహార యాత్రలు చేయడం మధురానుభూతులను మిగుల్చుతుందట.

ఆర్థిక ప్రణాళిక

కుటుంబం ఆనందంగా ఉండాలంటే... ఆర్థిక ప్రణాళిక కూడా చాలా కీలకం. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం, వాహనాల కొనుగోలు, వైద్య ఖర్చులు వంటి వాటికి కొంత మొత్తాలను పొదుపుచేస్తూ ఉండాలి. తద్వారా... ఆయా సమయాల్లో ఖర్చుల కోసం వెతకాల్సిన పని ఉండదు. అప్పులపాలయ్యే బాధలు కూడా తప్పుతాయి!



ఇవేమీ ఎరుగరు ఈ బిడ్డలు



ఈ ఏడాది పుట్టిన పిల్లలు పెరిగి పెద్దయ్యాక ఎలాంటి అనుభవాలను ఎదుర్కోబోతున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోవచ్చుకానీ నేడు మనం చూస్తున్న చాలా సర్వసాధారణ అంశాలు వాళ్లకు పాత కాలపు వింతలు, విడ్డూరాలే కానున్నాయి!

ఒకప్పుడు మొబైల్ ఫోన్ వాడకం అత్యంత విలాసవంతమైన వ్యవహారం! నేడు.. అతి సామాన్య విషయం. అప్పట్లో ఇంట్లో సినిమా చూడాలంటే.. కలర్ టీవీ, వీసీఆర్ వంటివి అద్దెకు తెచ్చుకోవాలి. సమయం మించిపోకుండా కంగారుగా సినిమా చూసేసి అప్పగించాలి! నేడు కేవలం మొబైల్ ఫోన్‌లోని యూట్యూబ్‌లో మనకు నచ్చిన సినిమా చూసి ఆనందించగలుగుతున్నాం.

ఈ మార్పు అంతా సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమే. ఇదే పరిజ్ఞానం.. భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు చేయనుంది. ఎంతలా అంటే.. 2019లో జన్మించిన పిల్లల్లో చాలా మంది పెద్దయ్యాక (25, 30 ఏళ్లు వచ్చే సరికి) మనకి ఇప్పుడు అనుభవంలోఉన్న పలు అంశాలను గత చరిత్రగా భావించేంతలా..

సుదీర్ఘ ప్రయాణాలు మాయం

విమానాల్లో సుదీర్ఘ ప్రయాణాల సమయంలో మనల్ని.. మొబైల్ పరికరాలు, విమానంలోని వినోద వ్యవస్థలు కొంతమేర ఓలలాడిస్తున్నాయి. కారణం ఏదైనా కావొచ్చు, 2003లో సేవల నుంచి ఉపసంహరించిన కాంకర్డ్ విమానం మినహా.. అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సౌకర్యార్థం వాయు రవాణా వేగం పెంచడానికి మనం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అక్కడక్కడా బుల్లెట్ రైళ్లు తప్ప.. మన ఉపరితల రవాణా వేగం కూడా అంతంత మాత్రమే. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న వివిధ పరిణామాల కారణంగా.. భవిష్యత్తులో రవాణా ప్రక్రియలో వేగం పెరిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా ఇప్పటి పిల్లలకు భవిష్యత్తులో వెన్ను నొప్పిపెట్టేంతలా ఉండే సుదీర్ఘ రోడ్డు, విమాన ప్రయాణాల ఇబ్బందుల నుంచి విముక్తి లభించొచ్చు. ఈ క్రమంలో సూపర్‌సోనిక్ విమానాలు అందుబాటులోకి వచ్చి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నాయి. ఫలితంగా బ్రిటన్ నుంచి కెనడా లేదా అమెరికాకు కేవలం 3.5 గంటల సమయంలో చేరుకోవచ్చు. వీటి తయారీకి విపరీతంగా ఖర్చు అవుతుండడం వల్ల ప్రధానస్రవంతి ప్రయాణికులు ఖర్చు భరించే పరిస్థితి ఉండకపోవచ్చు. అందువల్ల తొలుత అత్యంత సంపన్నవర్గం వారే ఈ విమాన ప్రయాణాన్ని ఆస్వాదిస్తారు.

హైపర్‌లూప్ వంటివి అందుబాటులోకి వస్తుండటంతో ముున్ముందు ప్రయాణం మీద సమయం వృథా అన్నదే తెలియకుండా పోతుంది.



- హైపర్‌లూప్ సాంకేతిక పరిజ్ఞానం.. ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించే విషయంలో అనుసరణీయ మార్గాన్ని చూపనుంది. ఇప్పటికే ఈ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గంటకు 387 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వీలున్నట్లు వెల్లడైంది.

కరెన్సీ నోటుకు కాలం చెల్లు



డెబిట్, క్రెడిట్ కార్డుల ఆగమనంతో నగదు నోట్ల (పేపర్ కరెన్సీ) వినియోగానికి సంబంధించి తొలి దెబ్బ పడింది. ప్రస్తుతం పేపర్ కరెన్సీ.. పేపాల్, వెన్మో, యాపిల్ పే, ఇతర చెల్లింపు ఐచ్ఛికాలతో పోరాడుతోంది. ప్రస్తుతం పుట్టే పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యేసరికి ఈ రంగంలో సమూల మార్పులు చోటుచేసుకుని.. నగదు పూర్తిగా కనుమరుగైపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. నగదును తొలగించడంలో క్రిప్టో కరెన్సీలు ముందు వరుసలో ఉండనున్నాయి. బ్లాక్‌చెయిన్ సాంకేతిక పరిజ్ఞానం ఆర్థిక వ్యవహారాలకు అవసరమైన భద్రతను అదనంగా చేకూర్చుతోంది.

మరో గ్రహం దిశగా అడుగులు!

మనిషి భావవ్యక్తీకరణను మెరుగుపరుస్తున్న సాంకేతిక పరిజ్ఞానం మన ప్రపంచంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. అదే సమయంలో మనం ఇతర గ్రహాల జీవులతో సంభాషించడానికి ఓ మార్గాన్ని గుర్తించాల్సిన అవసరం నెలకొంది. ఇటువంటి భవిష్యత్తుకు అవసరమైన మార్గానికి సంబంధించిన తొలి మైలురాయి రానున్న కొన్ని దశాబ్దాల్లోనే పడొచ్చు. మరోవైపు, మానవులను అంగారకుడిపై చేర్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా ఎలాన్ మస్క్ తన అంతరిక్ష అన్వేషణ కంపెనీ స్పేస్ ఎక్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. 2024కల్లా అరుణ గ్రహంపైకి తన సిబ్బందిని చేర్చగలనని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2019లో జన్మించిన పిల్లలు పెద్దయ్యేసరికి మానవుడి ఆవాసాలు భూగ్రహంతోపాటు అంగారకుడిపైనా కనిపించినా ఆశ్చర్య పోనవసరం లేదు.



డ్రైవింగ్ లైసెన్స్.. కనబడితే ఒట్టు

పెద్దవాళ్లం అవుతున్న క్రమంలో వాహనాలు నడిపేందుకు లైసెన్స్‌లు తీసుకోవడం అనేది ప్రస్తుతం ప్రతి ఒక్కరికి తప్పనిసరి వ్యవహారం అయిపోయింది. అయితే 2019లో పుట్టినవారికి 16, 17 ఏళ్లు వచ్చేసరికి పూర్తిస్థాయిలో డ్రైవర్ రహిత వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల వాహనాలను నడపడంలో మానవ ప్రమేయం ఉండదు.

సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) వెలువరించిన గణాంకాల ప్రకారం.. ఒక్క 2015లోనే వాహనాలు ఢీకొనడం వల్ల 16 ఏళ్ల నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సుగల వారు రోజుకు ఆరుగురు చొప్పున మరణించారు. చాలా ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం అవుతున్నాయి. వాహనాలను నడిపే ప్రక్రియలో మానవ ప్రమేయం లేకుండా చేస్తే.. చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చు. కాబట్టి స్వయంప్రతిపత్తి గల వాహనాల తయారీ చాలా మందికి అత్యంత ప్రాధాన్య అంశంగా మారింది. తమ ఎలక్ట్రిక్, పాక్షిక స్వయంప్రతిపత్తి (ప్రస్తుతం) గల కార్ల తయారీ కంపెనీ రెండు మూడేళ్లలో పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తిగల కార్లను తయారుచేస్తుందని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చెబుతున్నారు.

ఏఐదే హుషారు


హ్యూమనాయిడ్ రోబో సోఫియా

కృత్రిమ మేధ(ఏఐ) అభివృద్ధికి సంబంధించి స్వయం చోదక వాహనాలు ఒక ఉదాహరణ మాత్రమే. చదరంగం ఆడడం, పునర్వినియోగ వస్తువులను వర్గీకరించడం వంటి కొన్ని నిర్దుష్ట విధుల్లో మానవులకు ప్రత్యర్థులుగా నిలవగలిగే లేదా మానవులను వెనక్కినెట్టే సామర్థ్యంగల ఏఐ వ్యవస్థలు నేడు మనకు అందుబాటులో ఉన్నాయి. మానవ మేధకు పూర్తిస్థాయి ప్రత్యర్థిగా నిలిచే జ్ఞానం గల ఏఐ వ్యవస్థలు కేవలం దశాబ్దాల వ్యవధిలోనే అందుబాటులోకి వస్తాయని నిపుణులు అంచనావేస్తున్నారు. ఇప్పటికే హాన్సన్ రోబోటిక్స్‌కు చెందిన సోఫియా మనుషులకు, యంత్రాలకు మధ్య గీతను కనీకనిపించనట్లుగా మార్చేసింది. రానున్న రోజుల్లో ఈ గీత పూర్తిగా చెరిగిపోవడం తథ్యం. ఈ క్రమంలో 2019లో జన్మించిన శిశువులకు పెద్దయ్యాక ఇప్పట్లోలా శ్రామికశక్తిలో చేరడం, కళాశాలకు వెళ్లడం వంటివి తెలియకపోవచ్చు.


డిజిటల్ ప్రపంచం మరింత భద్రం



ప్రస్తుతం డిజిటల్ భద్రత అనేది ఆందోళనకు సంబంధించిన ప్రధాన అంశంగా మారింది. హ్యాకింగ్ అంతర్జాతీయస్థాయిలో చోటుచేసుకుంటోంది. సున్నితమైన వ్యక్తిగత సమాచారానికి భద్రత కల్పించడంలో గృహోపకరణాల్లో అనేక బలహీనతలు ఉంటున్నాయి. మరోవైపు, డిజిటలైజేషన్‌ని విస్తరించడంతోపాటు, బయోమెట్రిక్స్, ఆర్ఎఫ్ఐడీ వంటివాటితో భద్రతను పెంచడానికి నిపుణులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ఈ భద్రత ఇప్పటికీ కీలకమైన ఎన్‌క్రిప్షన్ సాఫ్ట్‌వేర్‌పై ఆధారపడుతోంది. దీనిని సులువుగా విచ్ఛిన్నం చేయగలుగుతుండడం ఆందోళనకర అంశం. క్వాంటమ్ కంప్యూటర్ల ఆగమనంతో.. మెరుగైన భద్రతా వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటింగ్ శక్తి గణనీయంగా పెరిగింది. 2019లో పుట్టే పిల్లలు పెద్దవారు అయ్యేసరికి అత్యంత వేగంతో కూడిన క్వాంటమ్ ఎన్‌క్రిప్షన్.. డిజిటల్ ప్రపంచం గమనాన్ని హ్యాకింగ్ రహితం చేయనుంది.

అదిగదిగో ఆకలి లేని ప్రపంచం

పట్టణీకరణ.. సంప్రదాయక వ్యవసాయానికి స్థలం లభ్యతను తగ్గించవచ్చు. అదే సమయంలో వ్యవసాయంలో చోటుచేసుకుంటున్న నవకల్పనల కారణంగా.. ఆహారం కొరత అనేది గతానికి సంబంధించిన అవశేషంగా మిగలనుంది. పట్టణ వ్యవసాయం ప్రధాన పరిశ్రమగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో తాజా, శుద్ధిచేయని (ప్రోసెస్ చేయని) ఆహారం ఊసే లేని నగరాలు, పట్టణాల్లో తాజా ఆహారం, చేపలు పుష్కలంగా దొరకనున్నాయి. అంతస్తుల్లో చేసే వ్యవసాయం (వర్టికల్ ఫార్మింగ్) వల్ల పట్టణాల్లో గతంలో ఊహకే అందని ప్రాంతాలు వ్యవసాయ క్షేత్రాలుగా మారతాయి. నగరాల్లోని ఆకలికి చరమగీతం పాడే అవకాశాలు విస్తరిస్తాయి. మరోవైపు, కంపెనీలు ఆహార వృథాను తగ్గించేందుకు నవకల్పన విధానాలు అభివృద్ధిచేస్తున్నాయి. ఇదే దోరణి కొనసాగితే, 2019లో జన్మించే పిల్లలు.. భూమ్మీద ప్రతిఒక్కరు ఆరోగ్యకరంగా, సంతోషంగా జీవించేందుకు అవసరమైన ఆహారం పొందే వీలున్న అద్భుత ప్రపంచాన్ని కనులారా చూడగలరు.



- ఈనాడు ప్రత్యేక విభాగం

కంప్యూటింగ్ సరికొత్తగా..


ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న చాలా డిజిటల్ పరికరాలు సమాంతర తెర (ఫ్లాట్ స్క్రీన్)తో ఉన్నవి. భవిష్యత్తులో యూజర్ ఇంటర్‌ఫేస్‌లు.. మరింత క్రియాశీలంగా మారనున్నాయి. ఈ ఏడాది జన్మించే శిశువులు పెద్దయ్యాక గతంలో ఒకే తెర, కీబోర్డ్‌తో కంప్యూటర్లు ఉన్నట్లు గుర్తే ఉండకపోవచ్చు. వర్చువల్ రియాలిటీ (వీఆర్), అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) అభివృద్ధి రూపావళినే మార్చనున్నాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానాల్లో నవకల్పనలు.. మన కంప్యూటింగ్ అనుభూతిలో కొత్త సామర్థ్యాలను చేర్చనున్నాయి. సంజ్ఞల గుర్తింపు, లాంగ్వేజ్ ప్రోసెసింగ్, ఇతర సాంకేతిక పరిజ్ఞానాలు.. మనం మన పరికరాలతో మరింతగా అనుసంధానం అయ్యే అవకాశాన్ని కల్పిస్తాయి. హాలీవుడ్ చిత్రం మైనారిటీ రిపోర్ట్ తరహాలో అన్నమాట.

భాష తెలియదుకానీ.. సంభాషిస్తారు

కృత్రిమ మేధ వల్ల ఒనగూరే మరో ఉపయోగం సమాచార మార్పిడి. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల భవిష్యత్తులో భూమిపై భాషా పరమైన అడ్డంకులు కనుమరుగవనున్నాయి. సమాచార ప్రసార సాధనాలైన స్కైప్ వంటివి ఇప్పటికే.. తక్షణం అనువదించగలిగే సామర్థ్యాలను ఏర్పాటుచేశాయి. దీనివల్ల వినియోగదార్లు వాస్తవ పరిస్థితుల్లోలాగానే కొన్ని భాషలకు సంబంధించి సంభాషణలు నెరపవచ్చు. టెక్ దిగ్గజం గూగుల్ తన హెడ్‌ఫోన్లలో అనువాద సామర్థ్య సాధనాలను ఇప్పటికే చేర్చింది. ఈ నేపథ్యంలో 2019లో భూమ్మీదకు వచ్చే శిశువులకు 20, 25ఏళ్లు వచ్చేసరికి భాష రానప్పటికీ.. ఏ దేశస్థులతోనైనా చక్కగా సంభాషించగలరు. ఫలితంగా విదేశీ భాష నేర్చుకోవడం అనే ఉపాయం.. పూర్తిగా విదేశీ ఉపాయంగానే మిగిలిపోనుంది.

ఉన్నది తొమ్మిదేళ్లే..!

మనిషి తన జీవితకాలంలో ఎక్కువ సమయాన్ని నిద్రకే కేటాయిస్తున్నాడంటే నమ్మకం కలగడం లేదా? కానీ ఇది నిజం. జీవితంలో మూడోవంతు సమయం నిద్రకే ఖర్చయిపోతోంది. ప్రపంచబ్యాంకు, అమెరికా బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. ఉదాహరణకు ఒక మనిషి 78 ఏళ్లు బతుకుతాడని అనుకుంటే.. అందులో వివిధ రకాల పనులకు కేటాయించే సమయంపోగా.. ఇక మిగిలేది తొమ్మిదేళ్లు. ఆ తొమ్మిదేళ్లను ఎలా సద్వినియోగం చేసుకుంటాడనేది మనిషి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఏ పనికి ఎన్నేళ్లు వెచ్చిస్తున్నాడంటే...



మన సంతోషం మన చేతుల్లోనే..

సంతోషం అనేది ఎక్కడి నుంచో రాదు. మన రోజువారీ అలవాట్లు, దైనందిన కార్యకలాపాలను సరిగా నిర్వర్తించుకోవడం సంతోషానికి తొలి మెట్టు. మనం అలవర్చుకున్న అలవాట్లే మన మానసిక స్థితిని గణనీయంగా ప్రభావితం చేస్తాయి. ఉదయపు సమయంలో మన మెదడు 'ఆల్ఫా' స్థితిలో ఉంటుంది. ఆ విలువైన సమయాన్ని గొప్ప వ్యక్తిత్వ నిర్మాణ కార్యకలాపాలకు వినియోగించడం వల్ల.. లక్ష్యంపై దృష్టిని కేంద్రీకరించే శక్తి పెరుగుతుంది. పనితీరు మెరుగుపడుతుంది. దీనివల్ల పనులు సమయానికి పూర్తయిపోతూ సంతోషం కలుగుతుంది. ఈ కింది కొన్ని చిట్కాలు మీ రోజువారి దినచర్యను ప్రారంభించే ప్రక్రియకు అదనపు విలువను జోడించి ఆనందాన్ని అందిస్తాయంటున్నారు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గోల్ ఓరియెంటెడ్ ట్రైనింగ్ వ్యవస్థాపకుడు కె.మోహన్‌రావు. వాటిలో మీకు సరిపోయే వాటిని గమనించి అలవాట్లను మార్చుకుని జీవితాన్ని సంతోషమయం చేసుకోవాలని సూచిస్తున్నారాయన. ఆ వివరాలు..


కె.మోహన్‌రావు

- రోజూ 3 సానుకూల అంశాలను గుర్తించడానికి ప్రయత్నించండి. కొంత సమయం కేటాయించి వాటిని పేపర్‌పై రాసుకోండి. వాటి గురించి కొద్ది నిమిషాలపాటు లోతుగా ఆలోచించండి.
- రోజూ ధ్యానం చేయండి. దానివల్ల మీలోని ఒత్తిడి మటుమాయం అవడంతోపాటు.. సంతోషకర హార్మోన్లు పెరుగుతాయి. మానసికంగా స్పష్టత కూడా లభిస్తుంది. భావోద్వేగ ప్రజ్ఞ(ఈక్యూ) మెరుగవుతుంది.
- వ్యాయామం.. మీ జ్ఞాపకశక్తిని, లక్ష్యంపై దృష్టిని కేంద్రీకరించగలిగే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- మనం వేసుకునే దుస్తులు మన గురించి ఇతరులకు చెప్పడమే కాదు, మనకూ ఎంతో ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయి.
- మీకు ముఖ్యమైన వారితో సన్నిహిత పరిచయాలను విస్తరించుకోవడానికి, బలోపేతం చేయడానికి ప్రతిరోజు సమయం కేటాయించండి. సంతోషం అనేది మిమ్మల్ని ఆరాధించే వ్యక్తులతో మీచుట్టూనే ఉంటుంది.

మీ డైరీలో పేజీ ఎలా ఉండాలంటే..

- పేజీ ప్రారంభంలోనే మీ లక్ష్యాలు, తీర్మానాల్లోంచి ఓ దానిని రాసుకోండి
- ఎడమవైపు ఉదయం సమయంలో చేయాల్సిన పది కార్యక్రమాలు, కుడివైపు రాత్రిపూట చేయాల్సిన పది కార్యక్రమాలు రాసుకోండి.
- నీరు తాగడం, వ్యాయామం, ధ్యానం వంటి ఉదయపు దైనందిన కార్యక్రమాలు పూర్తిచేశారా? లేదా? అనేది రోజూ ఒకసారి సరిచూసుకోండి.
- అలాగే రాత్రిపూట చేయాల్సిన పనులు పూర్తిచేసి రాసుకోండి.
- ఆరోజు చేసిన అత్యంత ప్రాధాన్య కార్యక్రమాలు, ఇతరులతో సంబంధాలను పెంచుకోవడానికి చేసిన కృషిని రాసుకోండి
- మధ్యలో చేయాల్సినవి, వదిలిపెట్టాల్సిన అంశాలు, పఠన ప్రణాళికలు నమోదుచేయండి.

(మోహన్‌రావు విద్యా విషయాల కౌన్సిలర్. పలు ప్రముఖ కళాశాలలు, పాఠశాలలతోపాటు.. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, బెంగళూరులోని అజీంప్రేమ్‌జీ యూనివర్సిటీల్లో అతిథి ఉపన్యాసాలు ఇస్తారు)

మది మెచ్చే పచ్చదనం


ప్రతి రంగుకూ ప్రత్యేకత ఉంటుంది. ఆకుపచ్చకు మరీనూ! ఇది... ప్రాణానికి ప్రతీక ప్రకృతికి కోక ఆశలకు ఊపిరి మనసుకు నెచ్చెలి నయనాలకు చల్లన అభ్యుదయ సూచన శుభాలకు తోరణం ఆనందానికి కారణం!

ప్రకృతి అందాలను, ఆహ్లాదకర పచ్చికలను తిలకిస్తుంటే... ఎలాంటి వారికైనా ఆనందం కలుగుతుంది. మనసులో భారమంతా దిగిపోయి, ఉల్లాసం ఉబుకుతుంది. ఇంకొంతసేపు అక్కడే ఉండాలనిపిస్తుంది. నిజానికి ప్రకృతిలో విహరించడమన్నది... కుంగుబాటు తదితర మానసిక సమస్యలతో బాధపడేవారికి మంచి చికిత్స కూడా. దీనంతటికీ కారణం...

పచ్చదనం! అందులో ఉండే స్వచ్ఛదనం!! పట్టణాలు, నగరాలు కాంక్రీటు జంగిల్స్‌గా మారి జనజీవనం అస్తవ్యస్తమవుతోందని బ్రిటన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ సోషల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆ మధ్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై ఒక పరిశోధన కూడా చేపట్టింది. ఇందులో తేలిన ఆశ్చర్యకర విషయమేంటంటే- పట్టణాల నుంచి పచ్చని లోగిళ్లకు వెళ్లినవారి ఆనందపు స్థాయిలు గణనీయంగా పెరగడమే కాకుండా, అది నిలకడగా వారి మనసులను ఉత్తేజపరుస్తున్నట్లు గుర్తించారు.

ప్రకృతి మనిషికి ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడమే కాదు... సామాజిక సంబంధాలను దృఢపరుస్తుంది. వ్యాయామం చేయాలన్న ప్రేరణ కూడా కలిగిస్తుంది. అలసిన మనసుకు అమూల్యమైన విశ్రాంతినిస్తుంది. ఇందుకు మనం ఎక్కడో మైళ్ల దూరంలో ఉన్న బీచ్‌లు, నదీ తీరాలు, అటవీ ప్రాంతాలకే వెళ్లనక్కర్లేదు...ట! మనం నివసించే పరిసరాల్లోని ఆకుపచ్చని చెట్లు, గడ్డి గుబురుగా ఉండే పార్కులు, పొలాలు, చెరువు గట్లకు వెళ్లినా ఇవే ప్రయోజనాలను పొందుకోవచ్చంటున్నారు... ఇంగ్లండ్‌లోని వార్విక్ విశ్వవిద్యాలయ పరిశోధకులు.

నాణ్యమైన ప్రకృతి..! ఇదేంటి! అని ఆశ్చర్యపోకండి. ఈ భూమ్మీద ఎన్నిరకాల మొక్కలు, చెట్లు ఉంటాయో ఎవరికి తెలుసు! అందుకే, అధికంగా ఆనందం పంచే మొక్కలేంటన్నది కూడా అంచనాగట్టారు అధ్యయనకర్తలు. పెద్ద ఆకులుండే చెట్లు, నీటి మడుగులు ఉండే పార్కులు, జీవ వైవిధ్య ప్రాధాన్యంతో నెలకొల్పిన పార్కులు... మిగతా ప్రదేశాల కంటే ఎక్కువ ఆనందం కలిగిస్తాయట. అందుక్కారణం ఇవి కళాత్మక, రసజ్ఞ భావన (ఈస్తటిక్ ఫీల్)ను అధికంగా కలిగించడమే!



ఛాంపియన్స్



రోహిత్.. తండ్రయ్యాడు

దిల్లీ: టీమ్‌ఇండియా బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ తండ్రయ్యాడు. అతని భార్య రితిక ఆదివారం ముంబయిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న రోహిత్ ఈ విషయం తెలుసుకొని స్వదేశానికి పయనమయ్యాడు. గురువారం సిడ్నీలో ఆరంభం కానున్న చివరి టెస్టుకు అతను దూరం కానున్నాడు. "భార్యా బిడ్డల్ని చూడడానికి రోహిత్ ముంబయి వెళ్లాడు. తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన రోహిత్‌కు శుభాకాంక్షలు. నాలుగో టెస్టుకు అతను దూరం కానున్నాడు. జట్టులో అతని స్థానంలో వేరే ఆటగాణ్ని తీసుకోవడం లేదు. రోహిత్ వన్డే సిరీస్ కోసం ఈ నెల 8న మళ్లీ జట్టుతో చేరతాడు" అని బీసీసీఐ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.



ఐసీసీ మెచ్చిన మంధాన

దుబాయ్: ఐసీసీ ఈ ఏడాది ఉత్తమ మహిళా క్రికెటర్‌గా భారత యువతార స్మృతి మంధాన ఎంపికైంది. ఈ సీజన్లో మంధానా 12 వన్డేలు ఆడి 669 పరుగులు, 25 టీ20ల్లో 622 పరుగులు చేసింది. ఉత్తమ వన్డే క్రికెటర్ అవార్డు కూడా మంధానానే వరించింది. టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్ చేరడంలో మంధానాది కీలక పాత్ర. టోర్నీలో ఆమె 125.35 స్ట్రైక్ రేట్‌తో 178 పరుగులు సాధించింది. "మన ప్రదర్శనను అవార్డుల ద్వారా గుర్తించినప్పుడు ఎంతో సంతోషం కలుగుతుంది. ఇది మరింతగా రాణించేందుకు స్ఫూర్తిగా నిలుస్తుంది" అని మంధాన చెప్పింది. ఈ సంవత్సరం ఐసీసీ మహిళల టీ20 జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ ఎంపికైంది. ఈ జట్టులో మంధానతో పాటు పూనమ్ యాదవ్ కూడా చోటు సంపాదించారు.



విరాటే నంబర్‌వన్

దుబాయి: టీమ్‌ఇండియా సారథి విరాట్ కోహ్లి ఐసీసీ టెస్టు బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంతో ఏడాదిని ముగించాడు. 931 పాయింట్లతో ఉన్న కోహ్లి.. రెండో స్థానంలో ఉన్న విలియమ్సన్ కంటే 34 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. పుజారా నాలుగో ర్యాంకులో ఉన్నాడు. బౌలర్ల జాబితాలో దక్షిణాఫ్రికా పేసర్ రబాడ అగ్రస్థానంలో ఉన్నాడు. బుమ్రా 16 స్థానాలు మెరుగుపర్చుకొని 12వ ర్యాంకులో నిలిచాడు.



మొర్తజా ఇక ఎంపీ

ఢాకా: బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్ మష్రాఫె మొర్తజా పార్లమెంట్ సభ్యుడయ్యాడు! తాజాగా బంగ్లాలో జరిగిన జాతీయ ఎన్నికల్లో తన స్వస్థలం నరైల్ నుంచి అవామీ లీగ్ తరఫున పోటీ చేసిన మొర్తజా భారీ మెజార్టీతో విజయం సాధించాడు. నియోజకవర్గంలో 317844 ఓట్లు ఉంటే.. మొర్తజాకు రికార్డు స్థాయిలో 274418 ఓట్లు పడడం విశేషం. అతని సమీప ప్రత్యర్థికి కేవలం 8 వేల ఓట్లే పడ్డాయి.. జాతీయ జట్టులో ఆడుతూ ఇలా ఎంపీ అయిన తొలి ఆటగాడు మొర్తజానే.

చూస్తుండగానే ఏడాది గడచిపోయింది. 2018లో భారత క్రీడా రంగంలో ఎన్ని మెరుపులో.. ఎంత వినోదమో! ఇప్పుడిక కొత్త ఏడాది వచ్చింది. ఈసారి కూడా వినోదానికి కొదవే లేదు. ఏడాది ఆద్యంతం ఆటలే ఆటలు. భారత క్రీడాభిమానుల ఫేవరెట్ టోర్నీ.. వన్డే ప్రపంచకప్ ఈ ఏడాదే జరగబోతోంది. ఈ కప్పులో టీమ్‌ఇండియా మెరుపుల కోసం అభిమాని ఆశగా చూస్తున్నాడు. దీంతో పాటుగా కొత్త ఏడాదిలో అతడి కోరికల చిట్టా పెద్దదే. మరి భారత క్రీడాభిమాని అభిమాని ఆశలేంటో.. అంతరంగమేంటో చూద్దాం పదండి.

ఈనాడు క్రీడావిభాగం



2019 ప్రపంచకప్ నామ సంవత్సరం


ఈ కప్పును వదలొద్దు..!

అన్ని ఆటలూ చూస్తాం.. అందరి విజయాలనూ ఆస్వాదిస్తాం.. కానీ మా అభిమానుల్లో ఎక్కువ మందిని ఆకర్షించేది క్రికెట్టేనండోయ్! ఇక ఆ ఆటలో ప్రపంచకప్ వచ్చిందంటే ఇక మా ఆనందం ఎలా ఉంటుందో కొత్తగా చెప్పాలా? నాలుగేళ్లకోసారి వచ్చే వన్డే ప్రపంచకప్ సంబరానికి ఈసారి క్రికెట్ పుట్టిల్లు ఇంగ్లాండ్ వేదిక కాబోతోంది. వన్డే ప్రపంచకప్ జరిగే సంవత్సరంలోకి అడుగుపెట్టబోతుంటే ఉత్సాహానికి లోటేముంది? టోర్నీ మొదలయ్యేది మే నెలాఖర్లో కానీ.. ఇప్పట్నుంచే మా

వన్డే ప్రపంచకప్
మే 30 - జులై 15 ఇంగ్లాండ్‌లో

అభిమానుల్లో ఉద్వేగం కట్టలు తెంచుకుంటోంది. టోర్నీలో ఆకాంక్షల గురించి చెప్పేదేముంది? ప్రపంచ క్రికెట్లో ఇప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్న టీమ్‌ఇండియా.. ముచ్చటగా మూడోసారి కప్పును ముద్దాడాల్సిందే. ఐతే భారత జట్టు ఏకపక్షంగా మ్యాచ్‌లు గెలిచేసి.. తేలిగ్గా కప్పు అందుకుంటే మజా ఏముంటుంది? మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాలి. లీగ్ దశలో భారత్-పాకిస్థాన్ పోరు ఉద్రూతలూగించాలి. ఈ చిరకాల ప్రత్యర్థులే ఫైనల్ చేరి.. నువ్వా నేనా అన్నట్లు తలపడి కోహ్లీసేన కప్పు సొంతం చేసుకుంటే అప్పుడుంటుంది మజా!

విసిరితే స్వర్ణం ఎగిరి పడాలోయ్!



ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పతకం సంగతలా ఉంచితే.. ఏదైనా పోటీలో ఒక భారత అథ్లెట్ టాప్-10లో నిలిచినా ఆశ్చర్యపోయే పరిస్థితి. అలాంటి మాకు టోక్యోలో పతక ఆశలు రేపుతున్నావ్ నీరజ్ చోప్రా! నీ సంచలనాల గురించి వినే ముందు వరకు జావెలిన్ త్రో గురించి ఎప్పుడూ పట్టించుకున్నది లేదు. కానీ ప్రపంచ మేటి క్రీడాకారులతో పోటీ పడి పెద్ద పెద్ద టోర్నీల్లో పతకాలు సాధిస్తుంటే.. కొత్త రికార్డులు నెలకొల్పుతుంటే.. వీడెవడండీ బాబూ అని ఆశ్చర్యపోయి చూడటం మొదలుపెట్టాం. 2016 అండర్-20 ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో.. గత ఏడాది డైమండ్ లీగ్‌లో.. ఈ ఏడాది ఆసియా క్రీడల్లో నీ మెరుపులకు ముగ్ధులైపోయాం! ఇప్పటికే 88 మీటర్ల మార్కును దాటేశావ్. ఇక నువ్వు 90 మీటర్ల దూరాన్ని ఎప్పుడు అందుకుంటావా అని ఉత్కంఠగా ఉంది. ఈ ఏడాది డైమండ్ లీగ్ అందుకు వేదికవుతుందని ఆశ. మేం ఆశించిన ప్రదర్శన చేస్తే.. టోక్యోలో నీ పేరిట ఒక పతకం రాసి పెట్టేసుకుంటాం నీరజ్!

పక్కా లోకల్..





భారత క్రీడా రంగంలో 'తెలుగు' ముద్ర ప్రత్యేకం. 2018లో అంతర్జాతీయ వేదికలపై మెరుపులు మెరిపించిన లోకల్ స్టార్లను చూసి మురిసిపోయాం. కొత్త ఏడాదిలోనూ మీపై ఎన్నో ఆశలున్నాయి. బ్యాడ్మింటన్‌లో సింధు మాత్రమే కాదు.. పాటు కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్, సాత్విక్ సాయిరాజు సహా చాలామంది తారలు ఇప్పటికే అద్భుత ప్రదర్శనలతో మమ్మల్ని అలరించారు. కొత్త ఏడాదిలో వీళ్లంతా కొత్త శిఖరాల్ని తాకాలి. భారత క్రికెట్ జట్టులో కొంత విరామం తర్వాత 'లోకల్' మెరుపులు చూస్తున్నాం. టెస్టుల్లో హనుమ విహారి, పరిమిత ఓవర్ల క్రికెట్లో మహ్మద్ సిరాజ్ తొలి అడుగులు వేస్తున్నారు. వాళ్ల స్థానాలు సుస్థిరం కావాలి. అంతర్జాతీయ క్రికెట్లో తమదైన ముద్ర వేయాలి. టెన్నిస్‌లో సాకేత్ మైనేని, వెయిట్‌లిఫ్టింగ్‌లో రాగాల వెంకట రాహుల్, ఆర్చరీలో జ్యోతి సురేఖ.. లాంటి తారలపై ఎన్నో ఆశలున్నాయి. కొత్త ఏడాదిలో అందరూ సత్తా చాటాలి. మమ్మల్ని అలరించాలి.

ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్
సెప్టెంబరు 16- 25 థాయ్‌లాండ్‌లో





పట్టేయ్ నంబర్‌వన్!

బ్యాటు, బంతి మాత్రమే కాదు.. రాకెట్, షటిల్ కూడా మునివేళ్లపై నిలబెట్టగలవని.. కావాల్సింత కిక్ ఇస్తాయని మా అభిమానులకు చూపించింది మన తెలుగుతేజం పి.వి.సింధు. రియో ఒలింపిక్స్‌లో ఒక్కో పోరుతో నువ్వు పంచిన వినోదాన్ని, రగిల్చిన ఉద్వేగాన్ని ఎలా మరిచిపోతాం సింధూ? రియో రజతం తెచ్చిన పేరు ప్రఖ్యాతుల మాయలో పడిపోకుండా.. ఆట మీదే దృష్టి పెట్టి చక్కటి ప్రదర్శనను కొనసాగిస్తున్న నిన్ను చూస్తే ప్రశంసించకుండా ఉండలేం! ఐతే నువ్వెంత బాగా ఆడుతున్నా ప్రధాన టోర్నీల్లో తుది మెట్టుపై బోల్తా కొడుతుండటం మాత్రం నిరాశ కలిగించే విషయమే. 2018 చివర్లో బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్‌లో ఈ తడబాటును బాగానే అధిగమించావ్.. టైటిల్ నెగ్గావ్. కొత్త ఏడాదిలో ఈ ఊపు కొనసాగించి మరిన్ని టైటిళ్లు సాధించాలన్నది ఆశ. అంతే కాదు.. ప్రపంచ నంబర్‌వన్ కిరీటాన్ని కూడా సొంతం చేసుకుంటే చూడాలని కోరిక. సాధిస్తావ్‌గా సింధూ!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్
ఆగస్టు 19 - 25 స్విట్జర్లాండ్‌లో



బెర్తు బుక్ చేయండబ్బా!

ఒక టోర్నీలో గొప్పగా ఆడతారు.. ఆశలు రేపుతారు. ఇంకో టోర్నీలో పేలవ ప్రదర్శన చేస్తారు. నిరాశ పరుస్తారు. హాకీ వీరులతో ఎప్పుడూ ఇదే తంటా! హాకీలో పూర్వ వైభవాన్ని చూడాలన్న మా ఆశ ఎప్పటికి నెరవేరేనో! ఈ మధ్య ఆసియా క్రీడల్లో హాకీ జట్టు నుంచి ఎంతో ఆశించాం. ఆ ఆశల్ని నెరవేర్చేలాగే కనిపించింది భారత బృందం. కానీ సెమీస్‌లో బోల్తా కొట్టి నిరాశ పరిచారు. ఈ క్రీడల్లో స్వర్ణం సాధిస్తే.. నేరుగా ఒలింపిక్స్ బెర్తు సొంతమయ్యేది. ఈ ఏడాది ప్రశాంతంగా టోర్నీలు ఆడుకుని ఉండొచ్చు. కానీ ఇప్పుడు టోక్యో బెర్తు కోసం కష్టపడాలి. హాకీ ప్రొ లీగ్, హాకీ సిరీస్ ఫైనల్స్ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేయాలి. ర్యాంకు మెరుగు పరుచుకోవాలి. బెర్తు ఖరారు చేసుకోవాలి. మొత్తానికి సులువుగా దక్కాల్సిన అవకాశం సంక్లిష్టంగా మారింది. జరిగిందేదో జరిగిపోయింది. ఈ టోర్నీల్లో అయినా హాకీ వీరులు చెలరేగుతారా? ఒలింపిక్స్ బెర్తు బుక్ చేసుకుంటారని మా ఆకాంక్ష! హాకీ వీరులారా.. నమ్మకాన్ని నిలబెడతారా?

హాకీ సిరీస్ ఫైనల్
జూన్ 6 - 16 భువనేశ్వర్‌లో



ఫైనల్లో బెంగళూరు బుల్స్

కొచ్చి: బెంగళూరు బుల్స్ ప్రొ కబడ్డీ ఆరో సీజన్ ఫైనల్లో అడుగుపెట్టింది. రైడర్ పవన్ (13) ఫామ్ కొనసాగించడంతో సోమవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 41-29 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఫైనల్ చేరేందుకు గుజరాత్‌కు మరో అవకాశం ఉంది. గురువారం క్వాలిఫయర్-2లో యూపీ యోధతో పోటీపడనుంది. ఎలిమినేటర్-3 మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 33-45తో యూపీ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.



ముంబయి జోరు

పుణె: ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబయి రాకెట్స్ జోరు కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి రాకెట్స్ 5-2 తేడాతో అవధె వారియర్స్‌పై విజయం సాధించింది. 2-2తో స్కోరు సమమైన దశలో పురుషుల సింగిల్స్‌లో అండర్స్ గెలిచి ముంబయి 3-2 ఆధిక్యం అందించాడు. మరో పురుషుల సింగిల్స్‌లో సమీర్ 15-11, 8-15, 15-11తో లీ డాంగ్‌పై గెలవడంతో ముంబయి విజయం ఖరారైంది.

ప్రత్యేక రైళ్లలో అదనపు భారమెంత?

- వివరణ కోరిన రైల్వే మంత్రి గోయల్
- 'ఈనాడు' కథనానికి స్పందన

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రత్యేక రైళ్లు, సువిధ ప్రత్యేక రైళ్లలో భారీగా ఉన్న అదనపు ఛార్జీలపై రైల్వేశాఖ మంత్రి గోయల్ స్పందించారు. ప్రత్యేక రైళ్లు, వాటిలో అదనంగా వసూలు చేస్తున్న ఛార్జీల వివరాలు పంపాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌ను ఆదేశించారు. సంక్రాంతి సమయంలో ప్రత్యేక రైళ్లలో, ముఖ్యంగా సువిధ రైళ్లలో గరిష్ఠంగా మూడురెట్లు వరకు అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్న వైనంపై "పండుగ వేళ.. ఛార్జీల మోత" శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ కథనాన్ని చూసి.. సువిధ రైళ్లలో అధిక ఛార్జీలపై రైల్వే మంత్రి గోయల్‌ను ఆరా తీసినట్లు తెలిసింది. గోయల్ దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌కు ఫోన్ చేసి నివేదిక అడిగినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో సంక్రాంతి సమయంలో నడుపుతున్న రైళ్లు, ఛార్జీల విధానాలపై స్టేటస్ రిపోర్టును దక్షిణ మధ్య రైల్వే అధికారులు సిద్ధం చేసి పంపించారు. సంక్రాంతి సమయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 51 ప్రత్యేక రైళ్లు, అందులో 9 సువిధ రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు. సువిధ రైళ్లలో వసూలు చేస్తున్న ఛార్జీలు బోర్డు నిర్ణయించినవే అని దక్షిణ మధ్య రైల్వే ఖరారు చేసినవి కాదని అధికారులు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. సువిధలో టెలిస్కోపిక్ విధానంలో ఛార్జీలు పెరుగుతాయని, చివరి 20శాతం టికెట్లు మాత్రమే మూడు రెట్లు అధిక ఛార్జీలని వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈనాడులో ప్రచురితమైన కథనాన్ని సైతం దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వే బోర్డు ద్వారా మంత్రి గోయల్‌కు పంపించారు.

రైల్వే బోర్డు ఛైర్మన్‌గా వినోద్‌కుమార్ యాదవ్

రైల్వేబోర్డు ఛైర్మన్‌గా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) వినోద్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శిగా, ఐఆర్ఎస్ఈఈ ఛైర్మన్‌గా సైతం ఆయన కొనసాగుతారు. ఈయన నియామకాన్ని కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ సోమవారం ఆమోదించింది. ప్రస్తుత బోర్డు ఛైర్మన్ అశ్వనీ లోహానీ పదవీకాలం తరువాత ఆయన స్థానంలో వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన 1982లో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీరుగా రైల్వేలో ఉద్యోగంలో చేరి పలు కీలక పదవుల్లో పనిచేశారు. దిల్లీ డివిజన్ ఆపరేషన్స్ విభాగంలో ఏడీఆర్ఎంగా, లఖ్‌నవూ డివిజన్ డీఆర్ఎంగా విధులు నిర్వహించారు. కేంద్ర పరిశ్రమల శాఖలో, ఐక్యరాజ్యసమితిలో పారిశ్రామికాభివృద్ధి సంస్థలో డిప్యుటేషన్‌పై పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.13,673 కోట్ల ఆదాయాన్ని సాధించి రికార్డు సృష్టించారు. గతేడాది ఈ జోన్‌లో ఆరు విభాగాల్లో ఉత్తమ పనితీరు పురస్కారాలు పొందారు. రెండేళ్లలో 186 కిలోమీటర్ల నూతన మార్గాల నిర్మాణం, 63 కి.మీ.డబ్లింగ్, 700 కి.మీ. విద్యుదీకరణ పూర్తి చేయించారు. రైల్వే ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి వారి మన్నన పొందారు. దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు రెగ్యులర్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ అత్యున్నత రైల్వే బోర్డు ఛైర్మన్‌గా ఎంపికైన తొలి అధికారి ఈయనే కావడం గమనార్హం. రైల్వే మంత్రిత్వశాఖలో కీలక నిర్ణయాలన్నీ ఈ బోర్డే తీసుకుంటుంది.

పంచాయతీ అభ్యర్థులకు అవగాహన సదస్సు

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: వచ్చే పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఈ నెల 6, 7 తేదీల్లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, 'జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్' ఛైర్మన్ వి.వి.లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.jdfoundation.in వెబ్‌సైట్ ద్వారా జనవరి 3లోగా ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాలు అభివృద్ధి సాధించినపుడే జాతిపిత గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా సాధించుకున్న హక్కులపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రముఖ సామాజికవేత్త అన్నా హజారే, ముల్కనూరు సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, ఆదర్శగ్రామం గంగదేవిపల్లి మాజీ సర్పంచి కె.రాజమౌళి, మేధావులు, పంచాయతీరాజ్ నిపుణులు, ఆదర్శ గ్రామాల సర్పంచుల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సుపై పూర్తి వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని లక్ష్మీనారాయణ కోరారు.

మిఠాయి ఉత్సవానికి 20 దేశాల ప్రతినిధులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌కు అనుబంధంగా 'అంతర్జాతీయ మిఠాయి ఉత్సవం' నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. ఈ ఉత్సవంలో 20 దేశాల ప్రతినిధులు మిఠాయిల ప్రదర్శన ఏర్పాటు చేస్తారన్నారు. పది లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తూ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌వీఎన్‌ఎల్ జీఎంగా ఉమాశంకర్



ఈనాడు, హైదరాబాద్: రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) జీఎంగా దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎం.ఉమాశంకర్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1997 ఇండియన్ రైల్వే సర్వీసెస్ సిగ్నల్ ఇంజినీర్స్ బ్యాచ్‌కు చెందిన ఆయన రైల్వేలో పలు విభాగాల్లో పనిచేశారు. రైల్వేలో చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు రైల్వే మంత్రిత్వశాఖ అవార్డు కూడా లభించింది.

జస్టిస్ లోకుర్ పదవీ విరమణ

- కొలీజియంలోకి జస్టిస్ అరుణ్ మిశ్ర

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్ సోమవారం పదవీ విరమణ చేశారు. 2012 జూన్ 4న ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆపాలంటూ ఒడిశా దాఖలు చేసిన ఒరిజినల్ సూట్, కృష్ణా జలాల వివాదం వంటి ముఖ్యమైన కేసులను ఆయన సుప్రీంకోర్టులో విచారించారు. జస్టిస్ లోకుర్ పదవీ విరమణతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 26కు తగ్గింది. ఖాళీల సంఖ్య ఐదుకు చేరింది.

కొలీజియంలో నాలుగో సభ్యుడిగా జస్టిస్ రమణ: నూతన సంవత్సరం నుంచి సుప్రీంకోర్టు నూతన కొలీజియం అమలులోకి రానుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జస్టిస్ ఎన్.వి. రమణ కొలీజియంలో నాలుగో సభ్యుడయ్యారు. నవంబరు 30న జస్టిస్ కురియన్ జోసెఫ్ పదవీ విరమణ చేయడంతో కొలీజియంలోని ఐదో సభ్యుడిగా జస్టిస్ రమణ నియమితులయ్యారు. తాజాగా జస్టిస్ లోకుర్ పదవీ విరమణతో నాలుగో స్థానానికి చేరుకున్నారు. అయిదో సభ్యుడిగా జస్టిస్ అరుణ్ మిశ్ర నియమితులయ్యారు. ప్రస్తుతం కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ ఎ.కె. సిక్రీ, జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే, జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ అరుణ్‌మిశ్రలు సభ్యులుగా ఉన్నారు. నూతన కొలీజియం జనవరి 4న భేటీ కానున్నట్లు సమాచారం.

నేటి నుంచి పశ్చిమ బెంగాల్లో రైతు బంధు, బీమా పథకాలు

మమతా బెనర్జీ వెల్లడి

కోల్‌కతా: నూతన సంవత్సరం సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి రైతుల కోసం రెండు సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 'కృషి కృషక్ బొంధు'లో భాగంగా వీటిని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం వెల్లడించారు. ప్రతి రైతుకు ఎకరాకు ఏడాదికి రూ.5,000 వంతున సహాయం అందించనున్నట్లు చెప్పారు. రూ.2,500 చొప్పున రెండు వాయిదాల్లో ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండో సంక్షేమ పథకంగా రైతులకు బీమా సౌకర్యం కల్పించనున్నామన్నారు. 18-60 ఏళ్ల రైతులకు రూ.2 లక్షల వంతున జీవిత బీమా ఇస్తామని తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు ఇస్తామని, అయితే ఇవి జనవరి ఒకటి నుంచే అమల్లోకి వచ్చేలా చూస్తామని వివరించారు. వీటివల్ల 72 లక్షల రైతు కుటుంబాలకు మేలు కలుగుతుందని చెప్పారు.

నదుల పునరుజ్జీవంపై ప్రణాళిక

- 15లోగా రూపొందించాలని సీఎస్ ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నదుల పునరుజ్జీవంపై జనవరి 15లోగా నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశంలో జోషి మాట్లాడారు. నీటిపారుదల, భూగర్భ జలాలు, మెట్రోవాటర్ వర్క్స్, మున్సిపాలిటీ, పరిశ్రమల శాఖలు నదులకు సంబంధించి తమ దగ్గరున్న సమాచారాన్ని ఈ నెల 5లోగా జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థకు అందజేయాలన్నారు. రాష్ట్ర వాటర్ షెడ్‌మ్యాప్‌ను రూపొందించి, దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను మానిటరింగ్ చేయాలన్నారు. నదీ కాలుష్యాన్ని నివారించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటి నిర్వహణ ప్లాంట్లు నిర్మించేందుకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించడానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఎన్ఈఈఆర్ఐ ఇచ్చే ముసాయిదా నివేదికపై జనవరి మూడో వారంలో మరోసారి కమిటీ సమావేశం కావాలని నిర్ణయించారు. సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, మున్సిపల్, పరిశ్రమల శాఖల ముఖ్యకార్యదర్శులు అర్వింద్ కుమార్, జయేష్ రంజన్, మెట్రోవాటర్ వర్క్స్ ఎండీ దానకిషోర్, పీసీబీ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి, నీటిపారుదల ఈఎన్‌సీ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00



2019

తొలి అడుగు మంచిదైతే..

ఆ ఆరోగ్యమే వేరప్పా!

కొత్త సంవత్సరం.. సరికొత్త ఆశలు..
చదువులో రాణించాలి
ఉద్యోగంలో పైకెదగాలి
వ్యాపారంలో వృద్ధి చెందాలి
ఇలా పిల్లల నుంచి పెద్దల వరకూ..
అందరికీ కోటి కలలు.. శతకోటి కోరికలు!
మరి ఆరోగ్యమో..?
ఎన్ని సాధించినా ఆరోగ్యం సరిగా లేకపోతే
అన్నీ సున్నానే!
ఏ విజయాన్నీ ఆస్వాదించలేం..
ఆనందించలేం.. అనుభవించలేం!
అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమనే పెద్దల
మాటను మన్నిస్తూ..
ఆ దిశగా కొత్త సంవత్సరం ఆరంభాన తొలి
అడుగులు వేద్దాం. ఆరోగ్యానికీ ఒక
క్యాలెండర్ రూపొందించుకుందాం.
నిజానికి ఆరోగ్య పరిరక్షణకు గొప్ప
తీర్మానాలేం అవసరం లేదు
చిన్న జాగ్రత్తలతోనే పెద్ద ఫలితాలు
సాధించొచ్చు!

జబ్బులు ఊరికే రావు. అన్నీ మన కష్టార్జితాలే! అదేంటి.. జబ్బులు రావాలని ఎవరు కోరుకుంటారు? వాటి కోసం ఎవరు కష్టపడతారని అనుకుంటున్నారా? అయితే రోజూ ఏమేం చేస్తున్నారో ఒకసారి తలచుకోండి. మనకు నిత్య వ్యాయామం, శారీరక శ్రమ అవసరమని తెలుసు. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలని తెలుసు. మాంసం, కొవ్వులు తగ్గించుకోవాలని తెలుసు. ఒత్తిళ్ల బారినపడకుండా చూసుకోవాలని తెలుసు. అయినా ఎంతవరకు పాటిస్తున్నాం? ఎంతవరకు ఆచరిస్తున్నాం? పాత అనుభవాలను, పాత రోజులను విడిచిపెట్టి కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న తరుణంలో మనమంతా వేసుకోవాల్సిన ప్రశ్నలివి. ఒకప్పటితో పోలిస్తే- మధుమేహం, గుండెజబ్బులు, క్యాన్సర్ల వంటి సాంక్రమికేతర జబ్బులే ఆధునిక ప్రపంచానికి పెద్ద ముప్పులుగా పరిణమిస్తున్నాయని.. వీటి మూలంగానే ఇప్పుడు ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ దగ్గర్నుంచి.. ఎందరెందరో శాస్త్రవేత్తలు, పరిశోధకులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఇది తక్షణావసరం కూడా. కొన్ని జబ్బులకు జన్యువులే దోహదం చేస్తుండొచ్చు. కానీ వాటికి చుట్టుపక్కల పరిసరాలు, వాతావరణం, మన ఆహార విహార అలవాట్ల వంటివన్నీ తోడైనప్పుడే అవి వ్యక్తమై.. జబ్బులను తెచ్చిపెడతాయి. కాబట్టి రోజూ ఆచరించదగిన చిన్న చిన్న మార్పులతోనే మహా జబ్బుల మూలాలను మట్టుపెడదాం.

నీటితో ఆరంభం

ఉదయం నిద్ర లేవగానే నోరు పుక్కిలించి.. ఒకట్రెండు గ్లాసుల నీళ్లు తాగటం మొదలెట్టండి. రాత్రంతా నిద్రలో మునిగిన శరీరంలో తగ్గిపోయిన నీటిశాతాన్ని ఇది భర్తీ చేస్తుంది. దీంతో వెంటనే శక్తి పుంజుకుంటుంది. మెదడు చురుకుదనం పెరుగుతుంది. మూడ్ మెరుగవుతుంది. ఈ ఉత్సాహం రోజంతా కొనసాగుతూ వస్తుంది కూడా. ఒంట్లో ద్రవాల మోతాదులు తగినంతగా ఉంటే విషతుల్యాలు త్వరగా బయటకు వెళ్లిపోతాయి. జీర్ణక్రియ సరిగా సాగుతుంది. మలబద్ధకం దరిజేరదు. జీవక్రియలూ ఉత్తేజితమవుతాయి. కాబట్టి నిద్రలేస్తూనే కాఫీ, టీ కప్పులకు బదులు నీటి గ్లాసును అందుకోండి.

దంతం.. ధావనం.. శుభ్రం

రోజూ పళ్లు తోముకుంటాం. ఇందులో చెప్పుకోవటానికేముంది? చాలానే ఉంది. పళ్లు సరిగా శుభ్రం చేసుకోకపోతే చిగుళ్లవాపు వంటి సమస్యలకు దారితీస్తుంది. ఇది నోటికే పరిమితం కాదు. మధుమేహం, గుండెజబ్బుల వంటి సమస్యలకూ చిగుళ్లవ్యాధికీ సంబంధం ఉంటోందని అధ్యయనాలు నిగ్గుతేల్చాయి. చిగుళ్లవాపుతో మహిళల్లో రొమ్ముక్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్టూ బయటపడింది. నోటిలోని బ్యాక్టీరియా రక్తం ద్వారా రొమ్ముకణజాలానికి చేరుకొని, కణితులు పుట్టుకురావటానికి దోహదం చేస్తుండటం గమనార్హం. కాబట్టి ఉదయమే కాదు, రాత్రి పడుకోబోయే ముందూ దంతాలను శుభ్రం చేసుకోవటం మరవరాదు.

అల్పాహారం అతిముఖ్యం

ఉదయంపూట తినే అల్పాహారంతో అవయవాలన్నీ కొత్త శక్తిని పుంజుకుంటాయి. రోజంతా కేలరీలు ఖర్చు కావటానికి మార్గం పడుతుంది కూడా. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగటానికీ.. చెడ్డ కొలెస్ట్రాల్ తగ్గటానికీ అల్పాహారం తోడ్పడుతుంది. మధుమేహంతో బాధపడేవారు కాస్త దండిగానే అల్పాహారం తీసుకోవటం మంచిది. దీంతో రక్తంలో గ్లూకోజు స్థాయులతో పాటు రక్తపోటు కూడా తగ్గుముఖం పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక ప్రోటీన్లు ఎక్కువగా ఉండే అల్పాహారం తీసుకుంటే ఆకలిని ప్రేరేపించే గ్రెలిన్ హార్మోన్ విడుదల తగ్గి.. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చూసుకోవచ్చు. దీంతో బరువు కూడా అదుపులో ఉంటుందన్నమాట.

వేళకు భోజనం

రోజూ ఒకే సమయానికి భోజనం చేయాలి. దీంతో తిన్నది బాగా ఒంట పడుతుంది. వేళకు భోజనం చేసేవారిలో రక్తపోటు, శరీర ఎత్తు బరువుల నిష్పత్తి తక్కువగా ఉంటున్నట్టు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. వేళాపాళా లేకుండా తింటే మళ్లీ ఎప్పుడు తిండి లభిస్తుందో తెలియక శరీరం తికమకపడిపోతుంది. దీంతో ఒత్తిడిని పెంచే కార్టిజోల్ హార్మోన్ విడుదలవుతుంది. దీని మోతాదులు పెరిగితే కణస్థాయిలో వాపు ప్రక్రియ ఆరంభమవుతుంది. ఫలితంగా క్యాన్సర్ల ముప్పూ పెరుగుతుంది. అందువల్ల ఒకే సమయానికి భోజనం చేయటం మంచిది. కుటుంబ సభ్యులతో కలిసి తినటం ఇంకా ఉత్తమం. అనుబంధాలూ పెంపొందుతాయి.



ప్రతిక్షణమూ 'పండు'గే

పండ్ల కోసం ప్రత్యేకించిన గిన్నెను ఇంట్లో అందరికీ కనిపించే చోట పెట్టండి. ఇలా పండ్లు అందుబాటులో ఉండేలా చూసుకుంటే మరచిపోయే ప్రసక్తే ఉండదు. పండ్లలోని విటమిన్లు, పోషకాలు.. ముఖ్యంగా యాంటీఆక్సిడెంట్లు మనల్ని ఎన్నెన్నో జబ్బుల బారినపడకుండా కాపాడతాయి.

సత్సంబంధం సగం బలం

తరచుగా తోబుట్టువుల, స్నేహితుల ఇంటికి వెళ్లండి. ఆనందం, ఆయుష్షు రహస్యం ఇదేనని చెబుతున్నారు పరిశోధకులు. బంధువులతో, స్నేహితులతో మంచి సంబంధాలు గలవారు మరింత ఆనందంగా, ఎక్కువకాలం జీవిస్తున్నట్టు హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. మనకేదైనా ఆపద వచ్చినపుడు ఆదుకోవటానికి ఎవరో ఒకరు అండగా ఉన్నారన్న భరోసానే కొండంత బలాన్నిస్తుంది. నాడీ వ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా, చురుకుగా ఉండటానికి తోడ్పడుతుంది. చెడు అలవాట్లు దరిజేరవు. శారీరక బాధలూ తగ్గుముఖం పడతాయి. ఇవన్నీ ఆనందాన్ని, ఆయుష్షును పెంచేవే కదా.




నవ్వు నాలుగిందాల మేలు

నవ్వినపుడు ఎండార్ఫిన్లనే రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. దీంతో మనసు తేలికపడి బాధలు, చింతలు మటుమాయం అవుతాయి. హాస్య వీడియోలు చూడటం ద్వారా ఆత్మ విశ్వాసం కూడా పెరుగుతున్నట్టు, ఇది క్లిష్టమైన పనులనైనా సునాయాసంగా చేయటానికి తోడ్పడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

సంగీతాస్వాదనలో..

సమయం దొరికినప్పుడల్లా శ్రావ్యమైన సంగీతం వినండి. ఇది మనసుకు హాయినిస్తుంది. కొత్త హుషారును అందిస్తుంది. హడావుడి, గందరగోళం లేని సంగీతం వింటే అధిక రక్తపోటు తగ్గుతున్నట్టు, గుండె వేగం స్థిరపడుతున్నట్టు, ఆందోళన తగ్గుముఖం పడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. సంగీతం మూలంగా జ్ఞాపకశక్తి, గుండె పనితీరు మెరుగవుతాయి. అంతగా అలసట అనిపించకపోవటం వల్ల శారీరక సామర్థ్యమూ పెంపొందుతుంది. దీంతో క్లిష్టమైన పనులైనా అలవోకగా చేయటానికి వీలవుతుంది. కాబట్టి రోజూ వీనుల విందైన సంగీతం వినటానికి ప్రయత్నించండి.



హుషారు ధ్యానం

ధ్యానంతో మనోస్థితి (మూడ్) మెరుగవుతుంది. కొత్త ఉత్సాహం, హుషారు చేకూరుతాయి. కుంగుబాటు, ఆందోళన వంటి మానసిక సమస్యల ముప్పూ తగ్గుతున్నట్టు పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇందుకోసం పెద్దగా కష్టపడాల్సిన అవసరం కూడా లేదు. కుదురుగా ఒకచోట కూచొని, కళ్లు మూసుకొని ఏదో ఒక విషయం మీద మనసును కేంద్రీకరిస్తే చాలు.

'ఇనుము' వంట

వీలైనప్పుడల్లా ఇనుప పాత్రల్లో వంట చేసుకోండి. ఇలా ఒంటికి తగినంత ఐరన్ అందేలా చూసుకోవచ్చని కొలంబియా విశ్వవిద్యాలయ పరిశోధకులు చెబుతున్నారు.

సేవారోగ్యం

ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేస్తే లభించే తృప్తే వేరు. ఇలాంటి దయాగుణం, సేవా దృక్పథం మానసికంగానే కాదు.. శారీరకంగానూ ఎంతో మేలు చేస్తుంది. స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనేవారికి గుండెజబ్బు వచ్చే అవకాశం తక్కువని పరిశోధకులు చెబుతున్నారు. అందువల్ల వీలు కుదిరినప్పుడల్లా స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనండి. అలాగని ఖర్చయ్యే పనులే చేయాల్సిన అవసరం లేదు. చుట్టుపక్కల ఎవరైనా వృద్ధులు, వికలాంగుల వంటి వాళ్లు చేసుకోలేని పనుల్లో సాయపడినా చాలు. ఇంటి పక్కల వీధులు శుభ్రం చేసినా మేలే. ఇలాంటివి చిన్న చిన్న పనులైనా పెద్ద ప్రభావమే చూపుతాయి.

మెట్టుమెట్టుకో కేలరీ..

మోకాళ్ల నొప్పుల వంటి సమస్యలేవీ లేకపోతే లిఫ్టుకు బదులు కాళ్లకు పని చెప్పండి. మెట్లు ఎక్కటం మొదలెట్టండి. దీంతో విద్యుత్తు ఆదా అవటమే కాకుండా వ్యాయామమూ చేసినట్టు అవుతుంది. కేలరీలు కూడా ఎక్కువగానే ఖర్చవుతాయి. ఒక నిమిషం పాటు మెట్లు ఎక్కినా 10 కేలరీలు ఖర్చవుతాయి. అంటే ఐదేసి నిమిషాల సేపు రోజుకు రెండు సార్లు మెట్లు ఎక్కితే 100 కేలరీలు ఖర్చవుతాయన్నమాట. మన శరీరంలో అతి పెద్దవైన కాళ్ల కండరాలు మంచి బలం పుంజుకుంటాయి. మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి సమస్యలు దరిజేరకుండానూ చూసుకోవచ్చు.


'పుస్తక' నిద్ర

రాత్రి పడుకోబోయే ముందు మొబైల్‌ఫోన్లు, డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల వంటివి కట్టిపెట్టి మంచి పుస్తకం ముందేసుకోండి. ఇది మెదడు ఆరోగ్యానికే కాదు, కంటి నిండా నిద్ర పట్టటానికీ దోహదం చేస్తుంది. ఈ-బుక్ వంటి డిజిటల్ పుస్తకాలకు బదులు మామూలు పుస్తకాలు చదివినవారు త్వరగా నిద్రలోకి జారుకోవటమే కాదు, మరింత గాఢంగానూ నిద్రపోతుండటం విశేషం. సెల్‌ఫోన్ల వంటి డిజిటల్ పరికరాల నుంచి వెలువడే నీలం కాంతి మెదడు పనితీరుపై విపరీత ప్రభావం చూపుతుందని, ఇది నిద్ర తీరుతెన్నులను దెబ్బతీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.



జ్ఞాపకాల 'రాత'

డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక చేతిరాతే బంగారమైంది. ఎవర్ని చూసినా కీబోర్డు నొక్కుతూ టైప్ చేయటమే. ఉత్తరాల కన్నా ఈ-మెయిళ్లే ముఖ్యమైపోయాయి. అయితే ఇలా టైప్ చేయటం కన్నా చేత్తో రాసినప్పుడే మెదడులోని చాలా భాగాలు అనుసంధానమవుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే చేతిరాతతో మెదడు కూడా పదునెక్కుతోందన్నమాట. ఇందుకు కొత్త హాబీల వంటివీ ఎంతగానో ఉపయోగపడతాయి. చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుంటే మెదడు వాటికి అలవాటు పడిపోతుంది. ఎలాంటి శ్రమ లేకుండానే యథాలాపంగా వాటిని చేసేస్తుంటుంది. అదే కొత్త పనిని ఆరంభించినపుడు చురుకుగా స్పందిస్తుంది. నాడీ కణాల మధ్య కొత్త అనుసంధానాలు ఏర్పడతాయి. దీంతో జ్ఞాపకశక్తీ పుంజుకుంటుంది.



యోగానందం

శారీరక సామర్థ్యం మెరుగుపడటానికే కాదు, కొన్ని సమస్యలు తగ్గటానికీ యోగా తోడ్పడుతుంది. యోగా సాధనతో వేగస్ నాడి బలోపేతం అవుతుంది. ఒంట్లో వాపు ప్రక్రియ, అధిక రక్తపోటు తగ్గుముఖం పడతాయి. ఫలితంగా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, రోగనిరోధకశక్తి మెరుగవుతాయి. ఒత్తిడి నుంచీ ఉపశమనం లభిస్తుంది.

ఇంటి తిండి ఆయుష్షు

బయటి తిండి తినేవారితో పోలిస్తే ఇంట్లో వండుకున్న ఆహారం తినేవారిలో 50% మంది పదేళ్లు ఎక్కువగా జీవిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. బయటి తిండిలో నూనెలు, కొవ్వులు, ఉప్పు, చక్కెర ఎక్కువ. అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ల వంటి జబ్బుల్లో వీటి పాత్రే ఎక్కువ కావటం గమనార్హం. ఇంట్లో వండుకోవటం వల్ల లభించే మరో ప్రయోజనం మెదడు పనితీరు మెరుగుపడటం. వంట ఎలా వండాలి? ఏమేం దినుసులు కావాలి? ఎంత మోతాదులో వాడాలి? అనేవి గుర్తుపెట్టుకోవటానికి మెదడు నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. దీంతో మెదడులో అనుసంధానాలూ మెరుగవుతాయి.

చేతులు శుభ్రం!

వంట వండటానికి, భోజనం చేయటానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కుంటే కలుషితాహార జబ్బులను సగం వరకు నివారించుకున్నట్టే. అలాగే బయటకు ఎక్కడికైనా వెళ్లివచ్చినపుడు, జలుబు వంటి జబ్బులతో బాధపడుతున్నప్పుడు తరచుగా చేతులు కడుక్కోవటం మంచిది. మనం సగటున ప్రతి అరగంటకు 300 రకాల వస్తువులను తాకుతామని అంచనా. ఇలా 8.40 లక్షల సూక్ష్మక్రిములు చేతులకు అంటుకునే అవకాశముంది. కాబట్టి తరచుగా చేతులను కడుక్కుంటే సూక్ష్మక్రిములతో వ్యాపించే జబ్బులను ఎన్నెన్నో నివారించుకోవచ్చు. అవి ఇతరులకు వ్యాపించకుండానూ చూసుకోవచ్చు.

గింజపప్పుల తోడు

అప్పుడప్పుడూ బాదం, జీడిపప్పు వంటి గింజ పలుకులు, పప్పులు (నట్స్) కాస్త నోట్లో వేసుకోండి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. రోజుకు సుమారు 30 గ్రాముల గింజపప్పులు తినేవారికి అకాల మరణం ముప్పు గణనీయంగా తగ్గుతోందని న్యూఇంగ్లాండ్ వైద్య పత్రికలో ప్రచురితమైన అధ్యయనం చెబుతోంది. బాదం, జీడిపప్పు, అక్రోట్లు, పిస్తా వంటి వాటిల్లో అసంతృప్త కొవ్వులు దండిగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌తో పాటు ఒంట్లో వాపు ప్రక్రియనూ తగ్గించటంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఫలితంగా గుండెజబ్బు, క్యాన్సర్ వంటి సమస్యల ముప్పులూ తగ్గుముఖం పడతాయి.

విహార 'ఉత్సాహం'

వీలున్నప్పుడల్లా విహార యాత్రలకు వెళ్తే రోజువారీ పనుల విసుగు తొలగిపోతుంది. ఉద్యోగాల్లో, పనుల్లో సామర్థ్యం, నైపుణ్యమూ మెరుగవుతాయి. ఏడాదికి రెండు సార్లు విహార యాత్రలకు వెళ్లి వచ్చే పురుషులకు 30%, మహిళలకు 50% గుండెపోటు ముప్పు తగ్గుతున్నట్టూ అధ్యయనాలు చెబుతున్నాయి. నిద్రకు ఆటంకం కలిగించే అలవాట్లకూ విహార యాత్రలతో ముకుతాడు పడుతుంది. ఇలా నిద్ర బాగా పట్టటానికీ యాత్రలు తోడ్పడతాయన్నమాట.

కూచుంటే పడినట్టే!

గంటలకొద్దీ అదేపనిగా కూచుంటే ట్రైగ్లిజరైడ్ల స్థాయులు పెరిగిపోతాయి. మంచి కొవ్వు తగ్గుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు ముప్పులూ ముంచుకొస్తాయి. కాబట్టి ఆఫీసులో, ఇంట్లో అదేపనిగా కూలబడకుండా మధ్యమధ్యలో లేచి అటూఇటూ తిరగండి. తరచుగా కాళ్లకు పనిచెబితే మధుమేహం ముప్పు 40%, అధికబరువు ముప్పు 20%, అధిక రక్తపోటు ముప్పు 17% తగ్గుముఖం పడుతున్నట్టు బ్రిటన్ అధ్యయనం ఒకటి పేర్కొంటోంది. నడవటం వల్ల కాళ్ల కండరాలే కాదు.. పొట్ట, వీపు కండరాలు కూడా బలోపేతమవుతాయి. దీంతో వెన్నెముకకు మంచి దన్ను లభిస్తుంది. నడుంనొప్పి వంటివీ దూరమవుతాయి.

'గాలి' సాంత్వన


ఎప్పుడూ తలుపులు, కిటికీలు బిగించుకోకుండా వీలైనప్పుడు వాటిని తెరచి పెట్టండి. ఇంట్లోకి గాలి, వెలుతురు ధారాళంగా రానివ్వండి. ఇది ఇంటికి కొత్త వెలుగును తెచ్చిపెడుతుంది. లోపలి గాలి శుభ్రపడుతుంది. ఇలాంటి శుభ్రమైన గాలి శక్తిమంతమైన యాంటీబయోటిక్స్ కన్నా మంచి ఫలితాలు ఇస్తోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తాజా గాలిలోని 'హైడ్రాక్సిల్ ర్యాడికల్స్' హానికర సూక్ష్మక్రిముల పని పడుతున్నాయని వివరిస్తున్నారు. అయితే ఈ హైడ్రాక్సిల్ ర్యాడికల్స్ గాలిలో అట్టే సేపు ఉండవు. అందువల్ల ఎప్పటికప్పుడు తాజా గాలి వీచేలా.. కిటికీలు తెరచి ఉంచుకోవటం మంచిది.

ఉపవాస 'వ్రతం'

కుదిరినప్పుడల్లా ఒక పూట కడుపు మాడ్చండి. ఇలా అప్పుడప్పుడు ఉపవాసం చేయటం మంచిదేనని శాస్త్రవేత్తలు కూడా చెబుతున్నారు. ఇది బరువు పెరగకుండా చూడటంతో పాటు ఇన్సులిన్ నిరోధకత, మధుమేహం ముప్పులనూ తగ్గిస్తోందని వివరిస్తున్నారు. అధిక రక్తపోటు, గుండె కొట్టుకునే వేగం, కొలెస్ట్రాల్ మోతాదులూ తగ్గుముఖం పడుతుండటం గమనార్హం. ఫలితంగా గుండెజబ్బు, పక్షవాతం వంటి సమస్యల బారినపడకుండానూ కాపాడుతుందన్నమాట. ఉపవాసం మూలంగా ఆయుర్దాయమూ పెరుగుతుంది. నాడీ సమస్యలు.. ముఖ్యంగా అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి జబ్బులు దరిజేరకుండానూ చూసుకోవచ్చు.

వ్యాయామ 'శృంగారం'

వ్యాయామంతో శృంగార సామర్థ్యమూ పుంజుకుంటుంది. లైంగికాసక్తి పెరగటంతో పాటు పటుత్వమూ మెరుగవుతుంది. శారీరక శ్రమ చేయనివారితో పోలిస్తే- రోజుకు కనీసం అరగంట సేపు వ్యాయామం చేసే పురుషుల్లో అంగస్తంభన సమస్యలు తక్కువని పరిశోధకులు గుర్తించారు.



ఎండ 'బంగారం'

ఒంటికి రోజూ కాసేపు ఎండ 'బంగారం' తగిలేలా చూసుకోండి. దీంతో ఎలాంటి ఖర్చు లేకుండా విటమిన్ డిని పొందొచ్చు. సూర్యరశ్మి సమక్షంలోనే మన చర్మం విటమిన్ డిని తయారుచేసుకుంటుంది మరి. ఇది ఎముకల ఆరోగ్యానికే కాదు.. రోగనిరోధకశక్తి బలోపేతం కావటానికీ, శరీర కణాలు ఇన్సులిన్‌ను గ్రహించేలా చూడటానికీ తోడ్పడుతుంది. కణ విభజన ప్రక్రియనూ నియంత్రించటం ద్వారా క్యాన్సర్ల ముప్పులు తగ్గేలా చేస్తుంది. ఒళ్లునొప్పులు, నిస్త్రాణ వంటివి మటుమాయం అవుతాయి.

ఉందిలే మంచి కాలం ముందు ముందునా...!

2019

నిన్నటి రోజు నేటి జ్ఞాపకం. అలా నిన్నటితో పూర్తయిన 2018 అప్పుడు జ్ఞాపకాల దొంతరగా మారి... అనుభవాల అనుభూతుల్ని నెమరేసుకొంటోంది. కొత్త ఆశలతో... మరింత ఉత్సాహంతో ముందడుగు వేయమంటోంది. మన ముందు కొత్త డైరీ, కొత్త పేజీ. అందంగా నింపుకొంటూ వెళ్లడమే ఆలస్యం. మన తారలు ఆ విషయంలో ఒక అడుగు ముందే ఉన్నారు. వచ్చే ఏడాది ఎలా వినోదాలు పంచాలో ఇప్పటికే ప్రణాళికలు రచించేశారు. మరి వారి ప్రయాణం ఎలా సాగనుందో చూద్దాం పదండి...







కథలు సిద్ధమవుతున్నాయ్

చిరంజీవి గతేడాది మొత్తాన్ని 'సైరా నరసింహారెడ్డి' కోసమే కేటాయించారు. ఈ ఏడాది ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ తర్వాత ఆయన వేగం పెంచే అవకాశాలున్నాయి. కొరటాల శివతో పాటు, మరికొంతమంది ప్రముఖ దర్శకులు చిరంజీవి కోసం కథలు సిద్ధం చేస్తున్నారు. చిరు మరో చిత్రాన్ని ఈ ఏడాది పట్టాలెక్కించడం ఖాయంగా కనిపిస్తోంది. ఆయన కొత్త సంవత్సర వేడుకల్ని కుటుంబ సభ్యుల తోనే జరుపుకొంటున్నారు. ఈమధ్యే ఆయన కూతురు శ్రీజ ఓ పాపకి జన్మనిచ్చారు. ఆ చిన్నారి సందడి మధ్య కొత్త ఏడాదికి స్వాగతం పలకబోతున్నారు చిరు.



మూడు ఖాయం

ఈ ఏడాది బాలకృష్ణ సినిమాల స్కోరు పరుగులు పెట్టనుంది. ఇప్పటికే మూడు సినిమాల విడుదల కావడం ఖాయమని తేలింది. బాలకృష్ణ జోరు చూస్తుంటే ఆ స్కోరు మరింత పెరిగేలా ఉంది. సంక్రాంతికి 'ఎన్టీఆర్ కథానాయకుడు' విడుదల కానుండగా, ఫిబ్రవరి 7న 'ఎన్టీఆర్ మహానాయకుడు' రాబోతోంది. అదే నెల్లోనే బోయపాటి శ్రీను దర్శకత్వం వహించనున్న సినిమా ప్రారంభమవుతుంది. ఆ తర్వాత బాలకృష్ణతో సినిమాలు చేయడానికి వి.వి. వినాయక్, అనిల్ రావిపూడి సిద్ధంగా ఉన్నారు.

దుబాయ్‌లో వేడుకలు

మహేష్ కొత్త ఏడాది సంబరాలు జరుపుకొనేందుకు వీలుగా రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతున్న 'మహర్షి' షెడ్యూల్ డిసెంబరు 25నే ముగిసింది. ఆ వెంటనే కుటుంబంతో కలిసి దుబాయ్ వెళ్లారు. 'మహర్షి' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయడానికి ఇప్పటికే పచ్చజెండా ఊపేశారు. పలువురు దర్శకులు మహేష్‌ని దృష్టిలో ఉంచుకొని కథలు సిద్ధం చేస్తున్నారు కాబట్టి, కొత్తగా ఒకట్రెండు చిత్రాల్ని ప్రకటించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. కొత్త ఏడాదిని పురస్కరించుకొని 'మహర్షి' సెకండ్ లుక్‌ని విడుదల చేశారు. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఉగాదికి విడుదల కానుంది.

దటీజ్ మహాలక్ష్మి

మూడు సినిమాల్లో కథానాయికగా నటించి... మరో రెండు చిత్రాల్లో ప్రత్యేక అందాలతో అదరగొట్టి 2018ని ముగించింది తమన్నా. కొత్త ఏడాదిలోనూ అదే స్కోరు కనిపించేలా ప్లాన్ చేసుకొంది. సంక్రాంతికి 'ఎఫ్2'తో రానున్న ఆమె, ఆ తర్వాత 'దట్ ఈజ్ మహాలక్ష్మి', 'సైరా..'తో పాటు, 'దేవి2' మెరవనుంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆమె కొత్త ఏడాది వేడుకల్ని జరుపుకొంటోంది.



మరో మజిలీ

తెలుగు, తమిళ భాషల్లో కలిపి గతేడాది ఐదు సినిమాలతో సందడి చేశారు సమంత. చేసిన ప్రతి సినిమాలోనూ సమంత నటనకి ప్రశంసలే లభించాయి. ఈ యేడాది ఆమె తన భర్త నాగచైతన్యతో కలిసి నటిస్తున్న 'మజిలి' చిత్రంతోనూ, నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్న 'ఓ బేబీ... ఎంత సక్కగున్నావే' చిత్రంతోనూ ప్రేక్షకుల్ని అలరించబోతున్నారు. 'ఓ బేబీ'లో ఆమె వృద్ధురాలిగా కనిపించి సందడి చేస్తారని సమాచారం. ప్రాధాన్యమున్న పాత్రల్నే ఎంచుకొంటూ ప్రయాణం చేస్తున్న సమంత, ఈ యేడాది కూడా నటన పరంగా తన ప్రతిభని చాటే ప్రయత్నాల్లో ఉన్నారు.




బంగార్రాజు వస్తాడా?

గతేడాది 'దేవదాస్'తో విజయాన్ని అందుకొన్నారు నాగార్జున. ఈసారి ఆయన రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. అలాగే నాగ్ కోసం 'సోగ్గాడే చిన్ని నాయనా'కి ఫ్రాంఛైజీగా 'బంగార్రాజు' కథ సిద్ధం చేస్తున్నారు దర్శకుడు కల్యాణ్‌కృష్ణ. ఈ రెండు చిత్రాలతో పాటు, హిందీ, తమిళ భాషల్లోనూ సినిమాలు చేస్తున్నారు నాగ్. మరి ఈ యేడాది బంగార్రాజు సందడి చేస్తాడో లేదో చూడాలి.



'సాహో' ఏడాది

ప్రభాస్ దృష్టంతా 'సాహో'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపైనే ఉంది. ఆగస్టు 15న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. జయపురలో రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ పెళ్లి వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపిన ప్రభాస్ అక్కడే మూడు రోజులు ఉండి కొత్త ఏడాదికి స్వాగతం పలకనున్నారట. రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో చిత్రమూ ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి. మరి ఈ సంవత్సరమైనా ఆయన పెళ్లి కబురు వినిపిస్తారో లేదో చూడాలి.



కొడితే కొట్టాలిరా

నాని గతేడాది కావాలనే వేగాన్ని తగ్గించారు. ఈసారి 'జెర్సీ' సినిమాతో కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి అంటూ క్రికెటర్ అవతారమెత్తారు. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో నాని 36 యేళ్ల క్రికెటర్‌గా సందడి చేయబోతున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. 'జెర్సీ' లుక్‌ని చిత్రం బృందం విడుదల చేసింది. 'జెర్సీ' సెట్స్‌పై ఉండగానే, విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో నటించేందుకు అంగీకారం తెలిపారు. ఆయన ఈ కొత్త సంవత్సర వేడుకల్ని జయపురాలోనే జరుపుకొంటున్నారు.



సినిమాలే సినిమాలు

2018లో వెండితెరపై వెంకటేష్ దర్శనభాగ్యం దక్కలేదు. సంక్రాంతికి అల్లుడిగా ఆయన 'ఎఫ్2'తో సందడి చేయబోతున్నారు. ఆ తర్వాత వరుస సినిమాలతో బిజీ కాబోతున్నారు. బాబీ దర్శకత్వంలో 'వెంకీమామ'తో పాటు, త్రినాథరావు నక్కిన దర్శకత్వంలోనూ ఓ చిత్రం చేయబోతున్నారు. భాస్కర్, త్రివిక్రమ్ దర్శకత్వంలోనూ ఆయన సినిమా చేయడానికి అంగీకారం తెలిపినట్టు సమాచారం. ఈ యేడాది ఆయన ఎక్కువ సినిమాలతో సందడి చేసేలా కనిపిస్తున్నారు.



మనసంతా 'ఆర్.ఆర్.ఆర్'పైనే

రెండేళ్లుగా ఒకొక్క సినిమానే చేస్తూ వస్తున్న ఎన్టీఆర్, ఈ ఏడాదీ అదే తరహాలో ప్రయాణం చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆర్.ఆర్.ఆర్'పైనే ఆయన మనసు పెట్టారు. ఈ ఏడాదంతా దాని కోసమే కాల్షీట్లు కేటాయించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 'ఆర్.ఆర్.ఆర్' బృందం, తన కుటుంబంతో కలిసి జయపురలో గడుపుతున్నారు ఎన్టీఆర్. అక్కడే కొత్త ఏడాది వేడుకల్ని జరుపుకొంటారు.



ముహూర్తం కుదిరింది

కొత్త ఏడాది సందర్భంగా తన కొత్త సినిమా వివరాల్ని ప్రకటించారు అల్లు అర్జున్. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఆ చిత్రం తెరకెక్కబోతోంది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' తర్వాత ఆ కలయికలో మరో చిత్రం కుదిరిందన్నమాట. ఈ చిత్రం ఇదే నెలలోనే ప్రారంభమవుతుందని నిర్మాతలు అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు ఈ ఏడాది మరో రెండు చిత్రాల్నీ అల్లు అర్జున్ ఖరారు చేయబోతున్నారని గీతాఆర్ట్స్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి బీరట్ ప్రాంతంలో కొత్త ఏడాది వేడుకల్ని జరుపుకొంటున్నారు.

కల్యాణ వైభోగం



వధూవరులతో రాజమౌళి, రామ్‌చరణ్ దంపతులు

దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ వివాహం ఆదివారం రాత్రి రాజస్థాన్‌లోని జయపురలో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో కార్తికేయ, పూజా ప్రసాద్ ఒక్కటయ్యారు. మూడు రోజుల పాటు పెళ్లి వేడుక జరిగింది. అనుష్క, నాగార్జున, ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రానా, నాని, అఖిల్ తదితర అగ్ర కథానాయకులు కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి వేడుకలో పాల్గొన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకి చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకి హాజరయ్యారు. పెళ్లికూతురు కూర్చున్న పల్లకిని ఆమె బంధువులతో పాటు ప్రభాస్ మోస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.

కుర్రాళ్లకి అర్థమవుతుందా?

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా నాయకానాయికలుగా పరిచయమవుతున్న చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే... అనేది ఉపశీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకుడు. దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ "నవతరం ప్రేమాయణాలకి అద్దం పట్టే కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. నటీనటులు కొత్తవాళ్లయినా చక్కటి అభినయం ప్రదర్శించారు. 'కలుసుకోవాలని' తర్వాత నేను తెలుగులో తెరకెక్కిస్తున్న చిత్రమిది" అన్నారు. "త్వరలోనే పాటల్ని, సినిమా విడుదల తేదీల్ని ప్రకటిస్తాం" అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: చిట్టిబాబు.కె, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



ఈశ్వర్, టువ చక్రవర్తి

చిన్నతనం నుంచే ఎన్టీఆర్ గురించి వింటున్నా



విద్యాబాలన్... ఎలాంటి పాత్రల్లోనైనా ఇట్టే ఒదిగిపోయే నటి. బాలీవుడ్‌లో ఆమె పేరే ఓ బ్రాండ్. జనవరి 9న విడుదలదవుతున్న 'ఎన్టీఆర్ కథానాయకుడు'తో తొలి సారి తెలుగు తెరపై కనిపించబోతోంది. ఆ చిత్రంలో ఆమె ఎన్టీఆర్ అర్ధాంగి బసవతారకం పాత్రని పోషించారు. జనవరి 1న విద్యాబాలన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె 'ఎన్టీఆర్ కథానాయకుడు' గురించి 'ఈనాడు సినిమా'తో పంచుకున్న వివరాలివీ...

'ఎన్టీఆర్..'తోనే తెలుగులోకి అడుగు పెట్టాలని ఎందుకనిపించింది?

తెలుగులో ఇంతకుమించిన గొప్ప ఆరంభం నాకు దొరకదు. 'ఎన్టీఆర్..' గురించి నిర్మాతల్లో ఒకరైన విష్ణువర్ధన్ ఇందూరి, బాలకృష్ణలతో మాట్లాడాక అప్పటికప్పుడే ఈ సినిమా చేయాలని నిర్ణయించుకొన్నా.

ఎన్టీఆర్ జీవితంలో మిమ్మల్ని బాగా ఆకట్టుకొన్న విషయాలేమిటి?

ఒకటని కాదు. ఆయన సినీ జీవితం, రాజకీయ ప్రయాణంలో ఎన్నో మలుపులు. ఎన్టీఆర్ జీవితంలో ఆయన అర్ధాంగి బసవతారకం పోషించిన పాత్ర చాలా గొప్పది.

సినిమా చేయడానికి ముందు ఎన్టీఆర్ గురించి మీకెంతవరకు తెలుసు?

నాకు తొమ్మిదేళ్లున్నప్పుడు తొలిసారి హైదరాబాద్ వచ్చా. ఇక్కడ మా మామయ్య, అత్త ఉండేవారు. అప్పుడు ఇంట్లో ఎన్టీఆర్ గురించి మాట్లాడుకోవడం తొలిసారి విన్నాను. ఆయన్ని ఒక వ్యక్తిలా కాకుండా, దేవుడిగా చూస్తారని అప్పుడే అర్థమైంది.

బసవతారకం పాత్ర ఈ సినిమాకి ఆత్మ అని దర్శకుడు క్రిష్ చెప్పారు...

ఎన్టీఆర్, బసవతారకంల మధ్య బంధం అందమైంది. బసవతారకం గారికి ఎన్టీఆర్‌పై ఉన్న నమ్మకం, ఆయనకి అందించిన సహకారం చాలా గొప్పది. నా సంభాషణలన్నింటినీ ముందే రికార్డ్ చేసి వాట్సాప్ చేసేవారు క్రిష్. దాంతో పాత్రలో లీనమై నటించాను.

బాలకృష్ణ సెట్‌లో ఎలా ఉండేవారు?

బాలకృష్ణ తన తండ్రిని ఎంత ప్రేమిస్తుంటారో మాటల్లో చెప్పలేను. ఆయన సెట్‌లో ఉన్నారంటే తన తండ్రికి సంబంధించిన ఫొటోలు చూపిస్తూ, వాటి వెనక విశేషాలు గురించి వివరించేవారు. బాలకృష్ణ ఎనర్జీ, అచ్చం తన తండ్రిలా కనిపించడం చూసి సెట్‌లో ఆశ్చర్యపోయేదాన్ని.

పుట్టినరోజుకి కొత్త నిర్ణయాలేంటి?

అలాంటివి నమ్మను. జీవితంలో ఎప్పుడూ సంతోషంగా గడపాలనేది నా సిద్ధాంతం.

వసుంధర

మంచు తెరలు చీల్చుకుంటూ తొలికిరణం.. ఆశా సుమాలు వెదజల్లుతూ కొత్త సంవత్సరం ఏడాది పొడవునా ఆనందం నింపాలని.. మనసు ముంగిట్లోకి ఆశల రంగులద్ది స్వాగతిద్దాం! రాబోయే రోజులన్నీ... మనజీవితాల్లో రమ్యమైన రంగవల్లుల రహదారులవ్వాలని ఆశిద్దాం! ఒత్తిడిని జయిస్తూ.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ.. ఆడుతూ పాడుతూ పనిచేస్తూ.. కుటుంబాన్ని దిద్దుకుంటూ.. కొత్త బంగారు లోకానికి బాటలేసుకుందాం!

పాంచ్ పటాకా



1

ఒత్తిడి, చిన్నచిన్న వాటికే మానసిక ప్రశాంతత కోల్పోవడం మనలో చాలా మందికి అలవాటే. ఆ పరిస్థితి ఎదురు కాకుండా మనవంతుగా ఏం చేయాలంటే...

మానసికంగా దృఢమవుదాం

● ఆరోగ్యం, ఆహారం, అభిరుచులు, ఆసక్తులు ఏవయినా సరే... కుటుంబం తరువాతే అని అనుకుంటారు చాలామంది. ఇకపై ఆ పంథా కాస్త మార్చండి. మీకోసం మీరు కొంత సమయం పెట్టుకోవాలి. మీ గురించి ఆలోచించుకోవడం మొదలుపెట్టాలి. ఆరోగ్యంగా ఉండేందుకు ఏం చేయాలనేది ఆలోచించాలి.

● ఇష్టం లేకపోయినా, నచ్చకపోయినా చాలా పనులను తప్పని పరిస్థితుల్లో చేస్తుంటాం. ఒత్తిడికి, ఆందోళనకు అదీ కారణమే. నచ్చని విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పడం మంచిది. అవసరం అనుకుంటే కారణం వివరించొచ్చు. అని అనుకుంటాం కానీ చెప్పలేం. కానీ ఇకపై చెప్పండి. మీకు ఇబ్బంది కలిగించిన ప్రతి సందర్భం ఇతరులకు తెలిస్తే ఏమనుకుంటారో అని భయపడకూడదు. ఇబ్బందిగా, బాధగా అనిపించిన విషయాలను నిర్మొహమాటంగా చెప్పడానికి వెనుకాడొద్దు. ఇంట్లో, ఆఫీసులో... ఎక్కడైనా మన పట్ల ఎదుటివారు ఉండే తీరులో ఏ మాత్రం సమస్య ఉన్నా మొదట్లోనే తెలియజేయాలి. చెప్పకపోతే సమస్య మరింత ముదురుతుంది.

● మన ఆలోచనలు, అభిప్రాయాలు ఇంటా బయటా ఎక్కడైనా సరే ఆత్మవిశ్వాసంతో చెప్పేందుకు సంకోచించవద్దు. మీరు చేస్తున్నది సరైనదని మీకు అనిపిస్తే దాన్ని చెప్పడానికి సిద్ధంగా ఉండండి. ఇది ఒత్తిడిని తగ్గించే మంత్రమే. ప్రయత్నించండి.

● అందరి సంతోషంలోనే నా ఆనందం అని అనుకోవడం ఎంతవరకూ సబబు చెప్పండి...! సంతోషం అనేది మీలో, మీ నుంచి మొదలవ్వాలి. అందులోనూ ఆరోగ్యం ఉంటుందని మర్చిపోకండి. కాబట్టి కనీసం ఈ సంవత్సరం అయినా... ఆ దిశగా మీకు నచ్చిన పనులు చేసేందుకు ప్రయత్నించండి. ఆసక్తులకు ప్రాధాన్యం ఇవ్వండి. ఇది ఒకరోజుతో ఆగిపోకూడదు. రోజూ ఉండాలి.



2

వ్యాపారం, ఉద్యోగం... రంగం ఏదయినా ఎలాంటిదైనా సాధికారత దిశగా సాగాలంటే... మనకు మనం పెట్టుకోవాల్సిన నియమాలు కొన్ని ఉన్నాయి.

వృత్తిలో గెలిచేలా...

● జీవితంలో అన్నీ అనుకున్నట్లుగా జరగకపోవచ్చు. కాబట్టి దేన్నయినా సానుకూలంగా స్వీకరించగలగాలి. సమస్యకు పరిష్కారం ఆలోచించాలే తప్ప ఎప్పుడూ కుంగిపోకూడదు. ఇంట్లో కావచ్చు, విధుల్లో కావచ్చు. ఎవరితోనైనా సమస్య ఉన్నా, వృత్తిపరంగా ఇబ్బంది ఉన్నా అసలు కారణం తెలుసుకోవాలి. మరోసారి అలా జరగకుండా చూసుకోవాలే తప్ప అనవసర చర్చలకు తావివ్వకూడదు. వీలైతే ఆ సందర్భంలో కాసేపు మౌనం ఎంతో మేలు చేస్తుంది.

● స్త్రీలు అన్నీ చేయలేరు అనే అభిప్రాయానికి స్వస్తి పలకండి. ఎలాంటి రిస్కులు అయినా స్వీకరించి చేయగలరు అనే నమ్మకాన్ని కలిగించాలి. ఇది ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అంతేనా విధుల్లో ఉన్నతస్థాయికి చేరుకోవడానికీ ఓ మార్గంగా మారుతుంది.

● వ్యక్తిత్వం అనేది లేకపోతే దేన్నీ సాధించలేం. ఇతరుల ప్రశంసలు, విమర్శల మీద ఆధారపడటం సరికాదు. మీ స్థాయి మీకు తెలియాలి. ఎవరో మెచ్చుకుంటేనే మీరు అత్యుత్తమ వ్యక్తి అయిపోరు. ఒకరు తిట్టినా మీరు కిందకు చేరుకోరు. కాబట్టి మీ వ్యక్తిత్వం, మీపై మీకు నమ్మకం ఉండాలి.

● ఉద్యోగం, పనులు, వైవాహిక జీవితం ఎన్ని ఉన్నా సరే... మీకంటూ స్నేహితులు ఏర్పరచుకోవాలి. దాన్నే నెట్‌వర్కింగ్ అంటారు. మీ పరిధిని విస్తరించుకోవాలి. బాల్య స్నేహ బంధాలను కొనసాగించాలి. మీ సంతోషాలు రెట్టింపవుతాయి. బాధలు సగమవుతాయి. ఎన్నో విషయాలూ తెలుస్తాయి.

● ఉన్నతస్థాయికి చేరుకోవాలనో, గుర్తింపు రావాలనో కాకుండా ఏ పని అయినా ఇష్టంగా, ప్రేమతో చేయాలి. అప్పుడే ఆ పనిలో పరిపూర్ణత కనిపిస్తుంది.



3

చదువులు, ఉద్యోగాలు, ఇతర బాధ్యతలతో క్షణం తీరిక లేని రోజులివి. దాంతో చుట్టూ ఉన్నవారికి దూరంగా జరిగిపోతాం. అలా మనకంటూ ఓ ప్రపంచం అని గిరిగీసుకుని ఉండిపోతాం. ఇకనైనా దాన్ని ఛేదిద్దాం.

బంధాలే ఎంతో బలం...

● కుటుంబసభ్యులతో ఎంత సమయం గడిపామన్నది కాదు.. ఎంత నాణ్యమైన సమయం కేటాయించాం అనేది ముఖ్యం. ఆఫీసు నుంచి ఇంటికి చేరుకున్నాక సాధ్యమైనంత వరకూ ఆఫీసు వ్యవహారాలు కాకుండా కుటుంబం గురించి ఆలోచించడం మంచిది.

● కొందరు టీవీ చూస్తూనో, ఫోన్ మాట్లాడుతూనో, ఛాటింగులు, సామాజిక మాధ్యమాలతో సేద తీరుతుంటారు. వాటిని తగ్గిస్తే అనుబంధాలు పెరుగుతాయి. కాబట్టి వారంలో వీలైనంత ఎక్కువ సమయం వాటికి దూరంగా ఉండాలనే నియమాన్ని పెట్టుకుని చూడండి.

● రోజులో ఒకసారి కుటుంబసభ్యులతో కబుర్లు చెబుతూ కలిసి భోంచేయడం, అప్పుడప్పుడూ బయటకు వెళ్లడం చేస్తుండాలి. అంతేకాదు ఇంట్లో వాళ్లందరికీ ఎలాంటి సమస్యలున్నాయో చెప్పకపోయినా తెలుసుని వాటిని తీర్చేలా చూడాలి.

● కుటుంబంలో మహిళ స్థానం మరెవరూ పోషించలేనిది. ఉద్యోగం చేసినంత మాత్రాన కుటుంబ సభ్యులు మనల్ని అర్థం చేసుకోవాలనే ఆలోచన సరికాదు. అలానే రోజూ ఇరుగు పొరుగుతో ఏదో ఒక సమయంలో మాట కలపడం లేదా చిరునవ్వుతో పలకరించడం.. వంటివి అవసరం. ఆఫీసులో, చదువుకునే చోట మనతోపాటు ఉన్న వాళ్లు కూడా కుటుంబసభ్యుల్లాంటి వాళ్లే అనే భావన ఉండాలి. నవ్వుతూ పలకరించడం, గౌరవించడం, మర్యాద, ప్రేమ పూర్వకంగా మాట్లాడం తప్పనిసరి. కలిసి భోంచేయడం, కెఫెటేరియాకు వెళ్లడం వంటివీ సత్సంబంధాలను మరింత పెంచుతాయి. ఉద్వేగాలకు దూరంగా ఉండాలి. ఏ మాట వచ్చినా, ఏ మనస్పర్థ తలెత్తినా ఇంట్లో సమస్యని పరిష్కరించుకున్నట్లు వ్యవహరించాలి.



4

ఇంటి పనులు, పిల్లల పెంపకం, ఉద్యోగం.. ఇలా రకరకాల బాధ్యతల వల్ల చాలామంది మహిళలు వ్యాయామానికి సమయం కేటాయించలేరు. అలాగని మీరు వదిలేయకండి.

వ్యాయామానికీ కాస్త సమయం

● ఎన్ని బాధ్యతలున్నా ఉదయం ఏడు గంటలలోపు నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేస్తే జీవక్రియలు బాగుంటాయి. విటమిన్ డి లోపం ఉండదు.

● రోజులో కనీసం అరగంటైనా సరే ఏకాంతంగా గడపాలి. ఓ పదినిమిషాలు ప్రాణాయామం చేయాలి. అదీ ఖాళీ పొట్టతోనే. కపాలభాతి, అనులోమవిలోమ ప్రాణాయామాల వల్ల మంచి ఫలితం ఉంటుంది. కపాలభాతి నెలసరి సమయంలో చేయకూడదు. యోగా, ధ్యానం వల్ల ఒత్తిడి దూరమవుతుంది. హార్మోన్ల అసమతుల్యత బాధించదు. గోముఖాసనం, శశాంకాసనం, మండూకాసనం, సర్వాంగాసనం, ఉష్ట్రాసనం వంటివి ఎంచుకోవాలి. వీటివల్ల శరీరం ఫిట్‌గా మారతుంది. హార్మోన్ల అసమతుల్యత దూరమవుతుంది. థైరాయిడ్, పీసీఓఎస్ వంటివీ బాధించవు.

● నడక... ఇది ప్రతిఒక్కరికీ చాలా అవసరం. కాబట్టి నడిచేందుకు సమయం పెట్టుకోవాలి. ఇంట్లోనే ఓ ముప్ఫై నిమిషాలు నడవొచ్చు. అయితే శరీరానికి చెమట పట్టినప్పుడే నడక వల్ల ప్రయోజనం ఉంటుంది

● ఇంట్లోనే స్క్వాట్స్, క్రంచెస్, స్ట్రెచెస్ చేయొచ్చు. స్క్వాట్స్ 7 - 40 వరకూ చేయొచ్చు. లెగ్ రైజెస్ వ్యాయామాలు అని ఉంటాయి. వెల్లకిలా పడుకుని.. కాళ్లని నిటారుగా పైకిలేపి దించుతూ ఉండాలి. దీనివల్ల పొట్ట తగ్గుతుంది.



5

మహిళలు తమ ఆరోగ్యంపై ముఖ్యంగా తినే ఆహారంపై అస్సలు శ్రద్ధ పెట్టరు. ఇదే అనేక సమస్యలకి మూలం. ఈ కొత్త ఏడాది నుంచైనా సరే! వేసుకునే దుస్తులకు, చేసే పనులకు ప్రణాళిక ఉన్నట్లే తినాల్సిన ఆహారానికీ ప్రణాళిక పెట్టుకుందాం.

రోజుకో పండు చాలు

● పండ్లు, కూరగాయలు, పాలు, పాలసంబంధిత ఉత్పత్తులు... ఇలా ప్రతిదీ రోజూ అందేలా చూసుకోవాలి.

● నిజానికి మన శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు చాలావరకూ అన్నం, టిఫిన్ల నుంచి అందినా విటమిన్ సి కోసం రోజూ దానికి సంబంధించిన ఓ పండు తినడం అలవాటు చేసుకోవాలి. కాబట్టి ఇకపై మీ రోజువారీ ఆహార ప్రణాళికలో ఓ పండుని చేర్చుకోండి. మర్నాడు ఏ పండు తినాలనేది ముందు రోజే నిర్ణయించుకోండి. అలాగని కివీ, లిచీ వంటి ఖరీదైనవే అవసరం లేదు. సగం అరటిపండు తిన్నా చాలు. జామకాయ సరిపోతుంది. ఆయా కాలాన్ని బట్టి ఎంచుకుంటే ఏ ఇబ్బందీ ఉండదు.


● ఆరోగ్యంగా ఉండాలంటే తినేటప్పుడు కెలోరీలు లెక్కేసుకోవడం కాదు. జంక్‌ఫుడ్‌ని తగ్గించి పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఇనుము, క్యాల్షియం వంటివి మహిళల ఆరోగ్యంలో కీలకం. అందుకే తప్పనిసరిగా విటమిన్‌సి, ఇనుము, క్యాల్షియం ఆహారం నుంచి అందేలా చూసుకోవాలి.


● చాలా మంది చక్కెర మంచిది కాదు, ఉప్పు, నూనె అసలే వద్దు అంటారు. అయితే అవన్నీ కూడా అవసరానికి మించి తీసుకున్నప్పుడే సమస్య. అందుకే వాటిని మోతాదు ప్రకారం మాత్రమే తీసుకునేలా చూడాలి. పూర్తిగా ప్రాసెస్ చేసిన పదార్థాలకు, నిల్వ ఉంచినవాటికి దూరంగా ఉండాలనే నియమాన్ని పాటించి చూడండి. అప్పుడే అనారోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్త పడగలరు.

పగడపు రంగు ప్రత్యేకంగా...

ఏటికేడు మేటి అనిపించే డిజైన్లతో, రంగులతో కొత్త ఫ్యాషన్‌లు సందడి చేస్తాయి. ఈ సంవత్సరం కూడా కొత్త రంగు కొంగొత్తగా వచ్చేసింది. అదే ఆహ్లాదంగా కనిపించే పగడపు రంగు(కోరల్). పీచ్‌కలర్‌కి కాస్త ఎక్కువగా, కాషాయానికి కాస్త తక్కువగా అనిపించే ఈ పగడపు రంగు ఎవరికైనా ఇట్టే నప్పేస్తుంది. థీమ్ పార్టీలు, పెళ్లి వేడుకలు... సందర్భం ఏదైనా మెప్పిస్తుంది. నీలం రంగులో అన్ని ఛాయలూ దీనికి చక్కగా జతకడతాయి. తెలుపు, నలుపు, గులాబీ, ఊదా...వంటి వాటితోనూ కలబోసుకుని ఆకట్టుకుంటుంది. డ్రెస్‌లు, చెప్పులు వంటివే కాదు...ఆభరణాలు, అలంకరణ వస్తువులను దీని ఛాయల్లో ఎంచుకోవచ్చు.









email: vasundhara@eenadu.net

తెలుసా సమంత తీర్మానాలు!

కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే ముందు చాలామంది ఏవేవో తీర్మానాలు చేసుకుని.. వాటిని అవలంబిస్తుంటారు. మరి ఈ ఏడాది సమంతా అక్కినేని ఏమని తీర్మానించుకుందో తెలుసా!



'క్రిస్మస్ తరువాత వచ్చే పండగ కొత్త సంవత్సరం తొలి రోజు. ఆ రోజంతా చాలా సంతోషంగా ఉంటా. అప్పుడే ఏడాదంతా ఆ ఉత్సాహం సొంతమవుతుంది. అలానే నేను 2019లో ఎలా ఉండాలో మూడు తీర్మానాలు చేసుకున్నా. వాటిలో మొదటిది గొప్పగా, ఉన్నతంగా ఉండాలి. రెండోది సాటివారిపట్ల మరింత సానుభూతి కలిగి ఉండాలి. మూడోది పూర్తిగా శాకాహారం మాత్రమే తీసుకుంటూ శాంతిని, సంతోషాన్ని పంచాలి. ఈ మూడు తప్పక పాటిస్తా. ఇలా ఏటికి ఏడు ఏవో కొన్ని సానుకూల గుణాలను పెంచుకుంటూ వెళ్తున్నా. మరి ఈసారి మీ సంగతి...' అని అంటూనే సమంత ఈ విషయాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

రంగవల్లిక

12 చుక్కలు, 4 వరుసలు 4 వచ్చేవరకు.



ఆర్యాని
విశాఖపట్నం



బంగారం-వెండి

31న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	32,700	32,650	32,500	32,650
ఆర్నమెంట్	30,540	30,500	30,150	30,250
వెండి (కిలో)	39,525	39,270	39,600	39,600
	ప్రొద్దుటూరు		**రాజమహేంద్రవరం**	
బంగారం(24క్యా)	32,540	32,540	32,710	30,640
ఆర్నమెంట్	30,110	30,110	30,170	30,190
వెండి (కిలో)	39,400	39,400	39,500	39,400
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	32,410	32,490	-------	-------
ఆర్నమెంట్	30,140	30,220	3,017	3,022 గ్రా
వెండి (కిలో)	39,500	39,500	41.50	41.40 గ్రా

సెన్సెక్స్ ▼ 08 **36068**

నిఫ్టీ ▲ 03 **10863**

డోజోన్స్ 23134 ▲ 71 | నాస్‌డాక్ 6575 ▼ 09

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.30కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10:00 గంటలకు).

రూపాయి 69.77 ▲ 18 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 52.90 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+) నిఫ్టీ	31న	మార్పు%	గ్రహణం (-) నిఫ్టీ	31న	మార్పు%
JSW STEEL	306.75	2.90	BHARTI INFRATEL	259.00	-1.52
TATA STEEL	521.05	1.60	BHARTI AIRTEL	312.50	-1.28
VEDANTA	202.20	1.40	HPCL	253.25	-1.04
TECH MAHINDRA	723.15	1.28	HERO MOTOCORP	3104.25	-0.59
SUN PHARMA	430.50	1.25	INDIAN OIL CORP	137.05	-0.83
KOTAK MAHI BANK	1256.50	1.22	AXIS BANK	619.90	-0.82
HINDALCO	226.20	1.21	COAL INDIA	240.75	-0.64


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	63.49	73.62	బహ్రెయిన్ దీనార్	171.84	196.61
పౌండ్ స్టెర్లింగ్	80.58	93.46	కువైట్ దీనార్	189.78	236.47
యూరో	72.62	84.21	ఒమన్ రియాల్	168.15	192.62
జపనీస్ యెన్/100	57.50	66.68	సౌదీ రియాల్	16.88	20.01
ఆస్ట్రేలియా డాలరు	44.85	51.89	యూఏఈ దిర్హమ్	17.28	20.19
సింగపూర్ డాలరు	46.51	55.11	మలేషియా రింగిట్	15.02	18.47
థాయ్ బాత్/100	194.99	233.20	చైనీస్ యువాన్	7.17	11.64

సోమవారం నిఫ్టీ కదలికలు



2018.. ఏం జరిగింది

• ఎగవేతలపై ఉక్కుపాదం

పన్ను ఎగవేతల నియంత్రణలో గతేడాది ప్రభుత్వ యంత్రాంగం విజయవంతం అయ్యింది. ముఖ్యంగా అధికారుల కృషిని ఇక్కడ మెచ్చుకోవాలి. 2018 ఏప్రిల్- నవంబరులో పన్ను ఎగవేత కేసులు పరిమితం గానే ఉండటం కాకుండా.. ఎగ్గొట్టిన పన్ను మొత్తం రూ.38,896 కోట్ల వరకు చేరాయి. వందలో సంఖ్యలో అరెస్టులూ నమోదయ్యాయి.

• పన్ను రేట్ల ఊరట

గతేడాది రెండు సార్లు పెద్ద సంఖ్యలో ఉత్పత్తుల పన్ను రేట్లను ప్రభుత్వం మార్పు చేసింది. ఒకటేమో జులైలో.. రెండోది డిసెంబరులో. ఇవే కాకుండా అడపాదడపా అప్పుడప్పుడు కొన్ని వస్తువులు పన్ను రేట్లను కూడా తగ్గించింది.

• అక్రమ లాభాలకు కళ్లెం

2018లో యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ పనితీరు అమోఘం అని చెప్పాలి. పన్ను రేట్ల తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేయని పలు వ్యాపారులను గుర్తించి, జరిమానా విధించింది. ఇటీవల హిందుస్థాన్ యునిలీవర్‌కు రూ.330 కోట్ల జరిమానా విధించడమే ఆ అథారిటీ పని తీరుకు ఓ మచ్చుతునక.

• చెక్‌పోస్ట్‌లు కనుమరుగు

ఒకటే దేశం.. ఒకటే విపణి ఉద్దేశం సాకారమయ్యేందుకు దోహదం చేసే ఇ-వేబిల్లు విధానాన్ని గతేడాదే ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ విధానం రాకతో దేశవ్యాప్తంగా చెక్‌పోస్ట్‌లు మాయవుతున్నాయి. సరకు రవాణా సమయంలో ఎదురయ్యే అవరోధాలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి.

• రిఫండ్‌లు చకాచకా

జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తొలినాళ్లలో భారీ మొత్తంలో రిఫండ్‌లు నిలిచిపోవడంతో ఎగుమతిదార్లు మూలధన కొరత ఇబ్బందిని ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టిసారించిన ప్రభుత్వం పదిహేను రోజుల పాటు ప్రత్యేక విండో ఏర్పాటు చేసి చాలా వరకు రిఫండ్‌లను మంజూరు చేసింది.

• అయోమయ ఆదేశాలు..

జీఎస్‌టీ చట్టంలోని వివిధ నిబంధనలపై సందేహాల స్పష్టతకు 600కి పైగా ఆదేశాలను అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్స్ (ఏఏఆర్) జారీ చేసింది. అయితే కొన్ని సందర్భాల్లో వివిధ ఏఏఆర్‌లు పలు రకాలుగా స్పష్టతను ఇవ్వడం అయోమయ పరిస్థితిని సృష్టించింది. ఇటీవల జీఎస్‌టీ మండలి సమావేశంలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని సెంట్రల్ అప్పిలేట్ అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్స్ ఏర్పాటుకు సిఫారసు చేశారు. ఇది ఏర్పాటయ్యాకైనా జీఎస్‌టీపై మరింత స్పష్టత వస్తుందని ఆశిద్దాం.

• టీడీఎస్.. టీసీఎస్‌కు శ్రీకారం

జీఎస్‌టీ చట్టంలోని టీడీఎస్, టీసీఎస్‌కు సంబంధించిన నిబంధనలు కూడా గతేడాదే అమల్లోకి వచ్చాయి. వ్యవస్థలో మరింత పారదర్శకత తెచ్చేందుకు, పన్ను ఎగవేతల నియంత్రణకు ఇవి ఓ ఆయుధంగా ఉపయోగపడనున్నాయి.

210 | గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఆర్డర్ల మొత్తం సంఖ్య.



సతీష్ సరాఫ్,
చార్టర్డ్ అకౌంటెంట్

2018లో జీఎస్‌టీకి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలు అటు సామాన్య ప్రజలకే కాదు ఇటు వ్యాపారులకు కొంతలో కొంత ఊరటనిచ్చాయని చెప్పొచ్చు. చాలా వస్తువుల పన్ను రేట్లను తగ్గించడం, రిటర్న్‌ల ప్రక్రియ సరళీకరణ చర్యలు లాంటివి ఇందులో ప్రధానమైనవి. అంతేకాదు.. జరిమానాల విధింపు ద్వారా పన్ను ఎగవేతదార్లకు, అక్రమ లాభాలను జేబులో వేసుకుంటే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలూ ఇచ్చింది. గతేడాది సంగతి సరే.. కొత్త సంవత్సరంలో జీఎస్‌టీకి సంబంధించి ప్రభుత్వం నుంచి వ్యాపారులు ఎలాంటి నిర్ణయాలను ఆశిస్తున్నారో ఓసారి చూద్దాం.



రెండే పన్ను రేట్లు

• చట్టం మరింత సమర్థంగా..



జీఎస్‌టీ చట్టం అమల్లోకి వచ్చి 18 నెలలు అవుతున్నప్పటికీ.. జీఎస్‌టీ చట్టాన్ని ఆశించినంత సమర్థంగా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లలేకపోయిందనే చెప్పొచ్చు. కొత్త సంవత్సరంలోనైనా ఈ దిశగా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ క్రమంలో చేపట్టే చర్యలు మునుపటి ఇన్‌స్పెక్టర్ రాజ్ విధానాన్ని తలపించకూడదు.

• వ్యాపారం సాఫీగా.. సరళంగా



వ్యాపారానికి అనుకూల పరిస్థితులున్న దేశాల జాబితాల్లో భారత్‌కు మూడంకెల ర్యాంకు ఉండేది. ఇప్పుడు అది అర్ధ సెంచరీకి చేరువయ్యింది. త్వరలో అత్యుత్తమ-10 దేశాల్లో ఒకటిగా నిలవాలి. ఇదే జరిగితే ప్రపంచ మొత్తం మనవైపే చూస్తుంది. వృద్ధి రేటులో ప్రపంచంలోనే అగ్రగామిగా మన దేశం నిలుస్తుంది.

• పెట్రోలు తెస్తారా




జీఎస్‌టీలోకి పెట్రోలియమ్ ఉత్పత్తులను తీసుకొని వస్తారని చాలా రోజులుగా అనుకుంటున్నాం. ఈ ఏడాదైనా ఆ పరిణామం చోటుచేసుకుంటుందో లేదో చూడాలి. జీఎస్‌టీలోకి పెట్రోలియమ్ ఉత్పత్తులను తెస్తే.. ప్రస్తుతం వీటిపై విధిస్తున్న పన్ను మీద పన్ను భారం తగ్గుతుంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కూడా లభిస్తుండంతో ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గుతుంది. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గేందుకు ఈ పరిణామం దోహదం చేస్తుండటంతో ప్రజలకూ ఊరట లభిస్తుంది.

• స్థిరాస్తికి మోత తగ్గేనా



జీఎస్‌టీ వచ్చాక తీవ్ర ప్రభావం పడిన రంగం స్థిరాస్తి. ఇంతకుమునుపు ఈ రంగానికి 6-7 శాతం పన్ను ఉండగా.. ఇప్పుడది 12-18 శాతనికి చేరింది. దీనికి తోడు స్టాంప్‌డ్యూటీ అదనం. 2019లో కనీసం స్టాంప్‌డ్యూటీనైనా జీఎస్‌టీ పరిధిలోకి ప్రభుత్వం తీసుకొని వస్తుందో చూడాలి. ఇది జరిగితే అటు స్థిరాస్తి పరిశ్రమకే కాదు.. కొనుగోలుదార్లకూ ఉపశమనం లభిస్తుంది.

• రెండే పన్ను రేట్లు



దేశీయ పరోక్ష పన్నుల విధానంలో రెండు లేదా మూడు పన్ను రేట్ల కంటే ఎక్కువ ఉండకూడదన్నది ఎప్పటినుంచో మనం కంటున్నకల. కనీసం జీఎస్‌టీ అమల్లోకి వచ్చాకైనా ఈ కల సాకారమవుతుందని అనుకున్నాం. కాని అది జరగలేదు. పైగా ఇప్పుడు కూడా డజను వరకు పన్ను రేట్లు ఉన్నాయి. అందువల్ల భవిష్యత్‌లోనైనా జీఎస్‌టీ పన్ను రేట్ల సంఖ్యను రెండు లేదా మూడుకు ప్రభుత్వం పరిమితం చేస్తుందని ఆశిద్దాం.

• టర్నోవర్ పరిమితి పెంపు



ప్రస్తుతం జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ నిమిత్తం నిర్ణయించిన రూ.20 లక్షల టర్నోవరు పరిమితి చాలా తక్కువనే భావన ఉంది. దీనిని కనీసం రూ.50 లక్షల వరకు పెంచితే చిన్న, మధ్య తరహా వ్యాపారులకు, సంస్థలకు ప్రయోజనం ఉంటుంది. అయితే ఈ విషయంపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టి పెట్టినందున కొత్త సంవత్సరంలో ఆ దిశగా అడుగులు పడతాయేమో చూడాలి.

అవరోధాలు

• రిటర్న్‌ల సరళీకరణ

జీఎస్‌టీ విధానంలో రిటర్న్‌ల దాఖలు ఓ సంక్లిష్ట ప్రక్రియగా ఉంది. పలు రకాల రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉండటంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న జీఎస్‌టీ మండలి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త రిటర్న్‌ల విధానం అమలుకు ఇటీవల నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం వచ్చాకైనా వ్యాపారులకు ఇబ్బందులు తొలుగుతాయని ఆశిద్దాం.

• తక్షణ స్పందన ఉండాలి

వ్యాపారులు చేసే ఫిర్యాదులపై ప్రభుత్వం వేగంగా స్పందించడం లేదనే విమర్శ చాన్నాళ్లగానే ఉంది. సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణం స్పందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

• దుర్వినియోగం తగ్గించాలి

జీఎస్‌టీ పేరుతో కొంత మంది వ్యాపారులు ప్రజల దగ్గర నుంచి అక్రమంగా పన్నులు వసూలు చేస్తున్న సంఘటనలు పలుమార్లు వెలుగులోకి వచ్చాయి. ఈ తరహా వ్యక్తులపై నిఘా పెట్టడం ద్వారా మోసాల నుంచి ప్రజల రక్షించడంపై దృష్టి సారించాలి.

రూ.97,000 కోట్లు

గతేడాది సగటున నెలకు వసూలైన జీఎస్‌టీ విలువ. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ.

• అప్పిలేట్ అథారిటీల ఏర్పాటు



జీఎస్‌టీ అమల్లోకి వచ్చి 18 నెలలు పూర్తయినా ఇంతవరకు అప్పిలేట్ అథారిటీలను, జీఎస్‌టీ ట్రైబ్యునల్‌ను ప్రభుత్వం చేయలేకపోయింది. దీంతో అధికారులు ఇచ్చిన ఆదేశాలపై అప్పీలుకు వెళ్లేందుకు హైకోర్టును ఆశ్రయించడం తప్ప వేరే మార్గం ఉండటం లేదు. అందువల్ల కొత్త సంవత్సరంలో అప్పిలేట్ అథారిటీల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

• రివర్స్ ఛార్జీ వస్తుందా



జీఎస్‌టీ కింద నమోదుకాని వ్యక్తుల ద్వారా లావాదేవీలు నిర్వహించినప్పుడు రివర్స్ ఛార్జీ వర్తిస్తుంది. ఇప్పుడు ప్రభుత్వం దీనిని అమలు చేయడం నిలుపుదల చేసింది. ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చినప్పుడే జీఎస్‌టీ అసలు ఉద్దేశం నెరవేరుతుంది. ముఖ్యంగా నల్లధన నియంత్రణకు ఇది దోహదం చేస్తుంది.

మీ సందేహాలు పంపండి | జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

ముగింపు నిరాశే

సమీక్ష

2018ని స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా ముగించాయి. చివరి రోజు ట్రేడింగ్‌లో సెన్సెక్స్ స్వల్ప నష్టంతో ముగియగా, నిఫ్టీ లాభం నమోదు చేసింది. అయితే అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు, రూపాయి బలోపేతం కావడంతో వరుసగా మూడో ఏడాదీ మార్కెట్లు లాభాలు సాధించాయి. ఏడాది మొత్తంగా చూస్తే సెన్సెక్స్ 2011 పాయింట్లు, నిఫ్టీ 332 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేసింది. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ మాత్రం 2018లో రూ.7.25 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుని పోయింది. రూ.7.25 లక్షల కోట్లు తగ్గిన సంపద రూ.144.48 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 36,239.19 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగిస్తూ 36,285.46 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. అనంతరం లాభాల స్వీకరణ ఎదురుకావడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఒకానొకదశలో 36,033.95 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 8.39 పాయింట్లు నష్టంతో 36,068.33 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 2.65 పాయింట్లు పెరిగి 10,862.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,853.20-10,923.55 పాయింట్ల మధ్య కదలాడింది.

2019లో నిఫ్టీ... 12,400

కార్పొరేట్ల ఆదాయాలు మెరుగయ్యే సూచనలు ఉండటంతో ఈ ఏడాదిలో నిఫ్టీ సూచీ 12,400 స్థాయికి చేరుకుంటుంది. సార్వత్రిక ఎన్నికల తరవాత విదేశీ సంస్థాగత మదుపరులు భారత మార్కెట్లపై దృష్టి సారించే అవకాశం ఉండటమూ దీనికి దోహదం చేయనుంది. స్థూలంగా ఈ ఏడాది రెండో త్రైమాసికంలో మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరుస్తాయని చెప్పొచ్చు. ఆర్థిక పెట్టుబడులపై ఆసక్తి పెరిగిన నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్లు మార్కెట్ వృద్ధిలో గణనీయమైన పాత్ర పోషించనున్నాయి. ముడి చమురు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు, రాబోయే సార్వత్రిక ఎన్నికలు మార్కెట్‌ను కొంత మేర ప్రభావితం చేయవచ్చు.

– ధీరజ్ రెల్లి, ఎండీ–సీఈఓ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

16 నెలల కనిష్ఠానికి మౌలికం

నవంబరులో 3.5 శాతం

దిల్లీ: దేశ మౌలిక రంగం మందగమనం పాలైంది. నవంబరులో 16 నెలల కనిష్ఠ స్థాయి అయిన 3.5 శాతానికి పరిమితమైంది. ముడి చమురు, ఎరువుల ఉత్పత్తి తగ్గడం ఇందుకు కారణమని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుదుత్పత్తితో కూడిన 8 మౌలిక రంగాల వృద్ధి 2017 నవంబరులో 6.9 శాతంగా నమోదైంది. 2018 నవంబరులో ముడి చమురు, ఎరువుల ఉత్పత్తిలో వరుసగా 3.5%, 8.1 శాతం చొప్పున క్షీణత నమోదైంది. సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఉక్కు, సిమెంటు రంగాల్లో వృద్ధి 0.5%, 2.3%, 6%, 8.8 శాతానికి పరిమితమైంది. ఇక పారిశామికోత్పత్తి సూచీ(ఐఐపీ)లో ఈ ఎనిమిది కీలక రంగాల వాటా 41 శాతం ఉన్నందున ఆ సూచీపైనా ప్రభావం పడనుంది. అయితే బొగ్గు, విద్యుత్పత్తి రంగాల్లో వృద్ధి వరుసగా 3.7%, 5.4 శాతం చొప్పున నమోదైంది. అంతక్రితం ఏడాది నవంబరులో నమోదైన 0.7%, 3.9 శాతాలతో పోలిస్తే మెరుగైనట్లే లెక్క. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో ఎనిమిది కీలక రంగాలు 5.1 శాతం మేర వృద్ధి చెందడం విశేషం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వృద్ధి 3.9 శాతమే.

విమానాల్లో మొబైల్ సేవలపై 4న సమావేశం

దిల్లీ: విమానాలు, నౌకల్లో ప్రయాణిస్తున్నపుడూ సెల్‌ఫోన్ల ద్వారా కాల్స్ చేసుకునేందుకు, ఇంటర్నెట్ వినియోగించుకునేందుకు అనుమతులు ఏ విధంగా ఇవ్వాలనే అంశంపై జనవరి 4న కీలక సమావేశం జరగనుంది. టెలికాం విభాగం నిర్వహించే ఈ సమావేశానికి టెలికాం, విమానయాన, నౌకాయాన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారు. ఇప్పటి వరకు ఈ సేవలందించేందుకు టాటా టెలినెట్, హ్యూస్ ఇండియా సంస్థల నుంచి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి.


టెక్ మహీంద్రాకు హైకోర్టులో ఊరట

ఈడీ జప్తు చెల్లదని ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: టెక్ మహీంద్రాకు ఉమ్మడి హైకోర్టులో ఊరట లభించింది. ఈ కంపెనీకి చెందిన సత్యం కంప్యూటర్ సర్వీసెస్ లిమిటెడ్ పేరు మీద ఉన్న రూ.822 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఈ సొమ్మును జప్తు చేస్తూ ఈడీ జారీ చేసిన ఆదేశాలను న్యాయస్థానం రద్దు చేసింది. దశాబ్ద కాలం క్రితం ఖాతాల కుంభకోణంలో చిక్కుకున్న సత్యం కంప్యూటర్ సర్వీసెస్‌ను, టెక్ మహీంద్రా టేకోవర్ చేసిన విషయం తెలిసిందే. 2012లో సత్యం కంప్యూటర్‌కు చెందిన రూ.822 కోట్ల మొత్తాన్ని ఈడీ జప్తు చేసింది. దీన్ని సవాలు చేస్తూ టెక్ మహీంద్రా హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ వి.రామసుబ్రమణ్యం, జస్టిస్ పి.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. టెక్ మహీంద్రా తరపున న్యాయవాది కె వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సత్యం కంప్యూటర్స్‌లో అక్రమ సొమ్ము లేదని, ఈ సొమ్ము టెక్ మహీంద్రాకు చెందినదేనని తెలిపారు.

31న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	439	వరంగల్	441
చిల్లరగా(ఒక గుడ్డు)	5.00	విశాఖపట్నం	458
బెంగళూరు	445	చెన్నై	445
1వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	430

ఎన్‌ఎస్‌ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 387.70 (387.40) 2062181
ASIAN PAINTS 1373.05 (1366.00) 698593
AXIS BANK LT 619.90 (625.05) 6030093
BAJAJ AUTO L 2720.15 (2717.50) 406069
BAJAJ FINANC 2645.15 (2634.80) 1453327
BAJAJ FINSER 6476.95 (6502.90) 204888
BHARTI AIRTE 312.50 (316.55) 3795043
BHARTI INFRA 259.00 (263.00) 1577464
BPCL 362.75 (361.90) 3391001
CIPLA 519.50 (522.00) 1897948
COAL INDIA L 240.75 (242.30) 3549194
DR. REDDYS 2616.50 (2621.90) 1026529
EICHER MOTOR 23158.35 (23124.10) 43103
GAIL 360.30 (356.30) 2659906
GRASIM IND 825.60 (824.60) 654406
HCL TECH 964.35 (958.35) 718502
HDFC 1968.35 (1979.95) 2289993
HDFC BANK 2121.70 (2122.90) 1466632
HERO MOTOCOR 3104.25 (3122.60) 279055
HINDALCO IND 226.20 (223.50) 6944360
HINDUSTAN UN 1819.65 (1822.05) 757071
HPCL 253.25 (255.90) 4248514
ICICI BANK 360.15 (360.75) 7314108
INDIABULLS H 853.85 (849.25) 5424039
INDIAN OIL 137.05 (138.20) 7360454
INDUSINDBANK 1599.30 (1583.25) 933039
INFOSYS LTD 658.95 (656.95) 3373319
ITC 281.65 (282.25) 5452405
JSW STEEL LT 306.75 (298.10) 7167399
KOTAK MAHIND 1256.50 (1241.35) 2324352
LARSEN & TOU 1437.55 (1439.40) 1487860
M&M 803.85 (803.55) 2232551
MARUTI SUZIK 7465.50 (7505.55) 547975
NTPC LTD 149.05 (149.85) 4175741
ONGC 149.90 (150.50) 5778308
POWER GRID C 198.65 (197.05) 3553755
RELIANCE IND 1121.25 (1125.55) 7222817
SBI 295.90 (294.80) 9526067
SUN PHARMA 430.50 (425.20) 6368707
TATA CONSULT 1893.05 (1896.05) 1879740
TATA MOTORS 172.70 (170.85) 8511388
TATA STEEL L 521.05 (512.85) 7965812
TECH MAHINDR 723.15 (714.00) 1814655
TITAN IND 931.00 (922.70) 4917511
ULTRATECH 3990.95 (4004.95) 157905
UPL LIMITED 758.25 (758.40) 1499975
VEDANTA LIMI 202.20 (199.40) 9580784
WIPRO 330.85 (330.05) 2136121
YES BANK LTD 181.80 (181.45) 18970865
ZEE ENTERTAI 476.45 (474.45) 2663133

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1336.75 (1313.30) 104257
ACC 1508.10 (1479.70) 791436
ADITYA BIRLA 100.00 (99.90) 1884090
AMBUJA CEMEN 225.10 (220.95) 2836456
ASHOK LEYLAN 102.50 (102.75) 11768308
AUROBIND PHA 732.95 (723.95) 1869123
AVENUE SUPER 1606.65 (1654.95) 1175518
BANDHAN BANK 550.15 (535.85) 1166345
BANK OFBAROD 118.80 (118.35) 10237262
BEL 87.95 (87.90) 10512423
BHEL 73.10 (72.05) 7130426
BIOCON LTD 629.05 (620.80) 1385682
BOSCH LTD 19611.20 (19629.75) 9793
BRITANNIA 3115.40 (3098.50) 184698
CADILA HEALT 348.45 (345.30) 1171717
COLGATE PALM 1343.55 (1320.15) 538109
CONTAINER 687.70 (670.40) 2504924
DABUR INDIA 430.65 (433.25) 2076007
DLF LIMITED 177.55 (177.95) 4653719
GENERAL INS 259.00 (255.65) 117473
GODREJ CONSU 810.65 (810.85) 482685
HAVELLS INDI 691.50 (690.10) 485613
HDFC STAND L 387.15 (387.35) 380439
HINDUSTAN ZI 278.65 (275.40) 1085705
ICICI LOMBAR 864.45 (850.65) 331390
ICICI PRU LI 324.50 (327.90) 604759
IDEA CELLULR 37.75 (37.50) 7315409
INTERGLOBE A 1165.05 (1178.50) 625133
L&TFIN.HOLD 152.60 (154.45) 4509762
LIC HOUS.FIN 488.70 (488.75) 1752029
LUPIN 844.30 (840.30) 1149648
MARICO LIMIT 373.40 (378.10) 842223
MCDOWELL 635.80 (638.65) 1354900
MOTHERSON 166.85 (162.70) 4595515
MRF 66984.70 (67036.95) 5943
NHPC LTD 26.00 (25.95) 1357499
NMDC LTD 96.85 (95.50) 2112880
OIL INDIA 174.80 (177.80) 761462
ORACLE FIN S 3707.75 (3660.85) 20750
P&G HYG&HEAL 9884.10 (9884.10) 2708
PETRONET LNG 224.15 (226.10) 1227510
PIDILITE IND 1107.85 (1101.95) 401950
PIRAMAL ENTE 2381.75 (2358.15) 823504
SAIL 56.35 (54.65) 21021929
SBI LIFE INS 597.85 (598.80) 169943
SHREE CEMENT 17236.10 (17227.05) 10698
SHRIRAM TRAN 1239.95 (1224.45) 1141657
SIEMENS 1046.90 (1043.35) 480175
SUN TV LTD 607.75 (615.30) 2495824

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 7.89 (7.90) 3000
AISHWARYA TE 2.55 (2.45) 205
ALPHAGEO 474.80 (477.45) 231
AMAR RAJA BA 742.75 (736.35) 6185
ANDHRA BANK 29.30 (29.50) 27084
ANDHRA CEMEN 5.95 (5.94) 7176
ANDHRA PAPER 444.15 (445.35) 9507
ANDHRA PETRO 57.40 (56.25) 41259
ANDHRA SUGAR 333.25 (332.05) 401
ANJANI PORTL 130 (134.95) 1000
ASTRA MICROW 77.35 (77.85) 13554
AUROBINDO PH 730.95 (723.35) 80972
AVANTEL SOFT 230.25 (228.90) 653
AVANTI FEEDS 385.55 (388) 20263
AVON ORG 6.99 (6.69) 25
BALAJI AMIN 459.35 (448.35) 1649
BARTRONICS 7.39 (7.50) 16309
BHAGIRA CHEM 449.45 (438.95) 3749
BHAGYA NAG 32.30 (29.60) 6619
BN RATHI SEC 27.35 (26.10) 1193
BRILLIANT SE 1.11 (1.06) 200323
CAMBRIDGE TE 41.60 (42) 603
CONT COFFEE 270.25 (271.55) 618
COROMAN FERT 450.05 (449.70) 2225
CUBEX TUB 14.50 (14.30) 248
CYBERMATE 2.33 (2.39) 21566
CYIENT LIMIT 619.05 (613.20) 8951
DECCAN CEMEN 419.50 (402.50) 161
DIVI'S LAB 1482.20 (1465.85) 16383
DIVYA GRANIT 90.40 (86.45) 455
DR REDDY 2617 (2622.05) 41774
FOUR SOFT 40.30 (33.60) 7651
GATI CORPN 86.90 (86.95) 75640
GAYATRI PROJ 175.85 (181) 1479
GMR INFRASTR 16.40 (16.20) 1152429
GOLDST INFRA 233.45 (244.60) 37843
GOLDSTONE EN 16.70 (16.80) 2469
GRANULES (I) 89.65 (89.70) 18103
GSS AMERICA 129.65 (129.70) 23073
GVK POWER 7.75 (7.87) 201456
HBL NIFE POW 28.80 (28.75) 44093
HERITAGE FOO 527.60 (533.30) 4022
HIFCO MARWEL 72.75 (69.30) 124
HIL LTD 2063.70 (2051) 1486
HIND FLUROCA 17.30 (17.25) 457
IDL INDUSTRS 293.65 (295.10) 239
IKF SOFT 0.31 (0.32) 69045
ILFS ENGINEE 17.07 (17.96) 1932
INCAP 42.40 (42.40) 11
IVRCL INFRAS 1 (0.98) 26093
JEEVAN SCIEN 38 (37.55) 1600
KAKATIYA CEM 202.90 (202.65) 6751
KALLAM SPG 18.20 (18) 16819
KAVERI SEED 574.25 (576.65) 20360
KCP LTD 92.35 (92.30) 3783
KERNEX MICRO 23.90 (23.95) 531
KNR CONSTRUC 213.50 (212.15) 9001
KREBS BIO 108.25 (109) 150
LANCO INDUS 188.55 (187.20) 1043
LAURUS LABS 379.70 (385) 1624
LOKESH MACH 48.05 (45.70) 16128
MADHUCON PRO 6.66 (6.98) 8406
MEDINOVA DIA 17 (17.20) 260
MEGA SOFT 7.89 (7.75) 24273
MIC ELECTRON 1.47 (1.54) 71481
MOLD-TEK.TEC 42.50 (42.50) 2041
MOLDTK PLA 267 (264) 1646
MSR INDIA LT 12.35 (12.95) 6189
NAGARJAGRICH 27.70 (28.45) 2305
NATCO PHARMA 680.80 (684.20) 2558
NAVA BH VENT 120.50 (118.90) 11956
NCC 88.10 (86.50) 911509
NCL IND 135.75 (134.05) 1566
NEHA INTER 4.89 (4.83) 21060
NETTLINX 50 (50.40) 42100
NEULAND LAB 459 (466.60) 170
NIHAR INFO 13.65 (13) 275
NILE 385.65 (380) 1645
NORTHGATE TE 0.90 (0.86) 6700
OIL COUNTRY 16.58 (16.50) 8553
PANYAM CEMEN 13.40 (13.83) 3126
PENNER IND 36.40 (36.45) 6766
PHYTOCHEM I 49 (48.95) 887
PIONEER DIST 175.50 (174.95) 5004
PITTI LAMIN 72.85 (74.70) 14487
POKARNA 166.45 (161.15) 666
PRAJAY ENGS 8.88 (9) 2165
PREMIER EXPL 240.25 (244.10) 1302
PRISM CEMENT 88.90 (88.25) 28777
PRUDENTL PHA 3.81 (3.70) 63851
RAGSAN PETRO 55.20 (56.10) 70
RAIN INDUSTR 134.25 (132.95) 89079
RAJ PACKAGIN 28.05 (28.20) 3303
RAM INFORMAT 41.55 (40.10) 634
REG.CERAMIC 3.06 (2.92) 10
SAGAR CEM 683.25 (684) 103
SAMKRG PIST 192.50 (191.05) 2507
SAMPRE NUTRI 39 (37.25) 406
SATVAH. ISPA 9.98 (9.78) 12517
SMS PHARMA 67.50 (68.50) 1701
SREE RAYAL A 33.90 (32.70) 304638
SRINIVASA SH 44.90 (42.85) 20
SS ORGANICS 9.45 (9.45) 300
STEEL EXCHAN 15.40 (15.10) 459
SUJANA TOWER 1 (0.97) 2900
SURANA TELE 4.60 (4.65) 20166
SURYALAKSH.C 42.10 (42.10) 198
SUVEN PHARMA 227.35 (229.90) 26956
TAJ GVK HOTE 175.40 (179.80) 7201
TANLA 30.55 (30.75) 8953
TERA SOFTWAR 36.50 (36.30) 3736
TRANS BIOTEK 3.32 (3.31) 517
TRENDY KNIT 0.19 (0.19) 240940
VAMSHI RUBB 31.10 (33.20) 688
VBC FERRO 45.35 (43.55) 150
VICEROY HOTE 5.15 (4.92) 36433
VIJAY TEXTIL 43.90 (41.65) 450
VIMTA LABS 314.25 (310) 2652
VISAKA IND 430.20 (427.55) 655
VISTA PHARMA 29 (29.50) 2732
VIVIMED LABS 36.85 (37.05) 67523
VJIL CONSULT 39.30 (37.45) 2780
YBRANT DIGIT 2.68 (2.69) 1736203
ZENOTECH LAB 37.85 (37.30) 1716
ZENTECH 78.70 (80) 2949



ఈనాడు

బిజినెస్

కదిలే కాలం ఎవ్వరి కోసం ఆగదు.. 2018 చరిత్ర పుటల్లోకి చేరిపోయింది.. కొత్త ఏడాది కోటి ఆశలతో తొలి అడుగులు వేస్తోంది.. మరి ఈ నూతన సంవత్సరంలో దేశ ప్రగతి ఎలా ఉండబోతోంది? ఏయే అంశాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయబోతున్నాయి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు 2019 సమాధానం చెప్పబోతోంది. సార్వత్రిక ఎన్నికలు ఒకవైపు.. రూపాయి, ముడిచమురు కదలికలు మరోవైపు.. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు ఇంకోవైపు.. ఇలాంటివన్నీ ఈ ఏడాది దేశ వృద్ధిలో ప్రధాన భూమిక పోషించబోతున్నాయి. అందుకే

2019 'కీలక' నామ సంవత్సరం!



రూపాయి: క్షీణత

2018లో భారత కరెన్సీ 12 శాతం వరకు క్షీణించింది. ఇదే ధోరణి కొత్త సంవత్సరంలోనూ కొనసాగవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో ఆర్‌బీఐ పరపతి విధానం నుంచి కొంత మద్దతును ఇది కూడగట్టుకోవచ్చు. కీలక రేట్లు పావు శాతం మేర తగ్గడానికి ఏప్రిల్, జూన్ 2019లో 50% అవకాశాలు; ఆగస్టు 2019లో 100 శాతం అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. అయితే ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రజాదరణ పథకాలను ప్రకటిస్తే మాత్రం రూపాయికి నష్టభయం ఎదురైనట్లే. దీని వల్ల దేశీయ మూలాలపై ప్రభావం పడుతుంది. దేశీయ ఆర్థిక మందగమనం అంచనాల కంటే వేగంగా దిగజారితే.. దేశం నుంచి విదేశీ పెట్టుబడులు బయటకు వెళతాయి. అపుడు రూపాయిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇక ఇతర వర్ధమాన దేశాల కరెన్సీలు కూడా రూపాయిపై ఒత్తిడి తెచ్చే అవకాశం లేకపోలేదు. కాబట్టి 2019లో రూపాయి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే. మొత్తం మీద మాత్రం 70 స్థాయిల్లో చలించవచ్చని విశ్లేషకులు అంచనా కడుతున్నారు.

చమురు: హెచ్చుతగ్గులు


2018లో చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు కనిపించాయి. బ్రెంట్ చమురు ధర రెండు నెలల కిందట 85 డాలర్ల(పీపా)కు చేరడంతో ప్రపంచ వ్యాప్తంగా దిగుమతిపై ఆధారపడ్డ అన్ని దేశాలూ హాహాకారాలు చేశాయి. అయితే ఒక్కసారిగా 40% మేర తగ్గి 52 డాలర్లకు అటూ ఇటూగా చలిస్తుండడంతో ఊరట కలిగింది. మరి ఇదే ధోరణి కొత్త ఏడాదిలోనూ కొనసాగుతుందా అంటే.. స్వల్పకాలంలో మాత్రం తీవ్ర హెచ్చుతగ్గులు తప్పవని విశ్లేషకులు అంటున్నారు. అయితే మొత్తం ఏడాది మీద 55-65 డాలర్ల మధ్య చలించవచ్చని చెబుతున్నారు. ఇక నైమెక్స్ చమురు ధర అయితే 45-55 డాలర్ల మధ్య కదలాడవచ్చని అంటున్నారు. అంటే అంతక్రితం అనుకున్నట్లు 100 డాలర్లకయితే వెళ్లే ప్రసక్తి లేదు. ఎందుకంటే డిసెంబరులో జరిగిన సమావేశంలో ఒపెక్ దేశాలు తమ ఉత్పత్తిలో రోజుకు 1.2 మిలియన్ బారెళ్ల మేర కోత విధించడానికి అంగీకరించాయి. అయినా ఇతరత్రా కారణాల వల్ల ధరలు తగ్గడానికీ అవకాశాలు లేకపోలేదు. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మరింతగా పెరిగితే చైనా నుంచి గిరాకీ తగ్గుతుంది. అపుడు అది ధరలపై ప్రభావం చూపుతుంది.





బంగారం: మెరుపులు

కొత్త ఏడాదిలో బంగారం ఆకర్షణీయంగా కనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. 2018లో అంతర్జాతీయంగా పసిడి ధరలు దాదాపు 5 శాతం వరకు పడ్డాయి. స్టాక్ మార్కెట్లు రాణించడం ఇందుకు నేపథ్యం. ఇక భారత్ విషయానికొస్తే పసిడి ధర గతేడాది(2018) 10% దాకా ప్రియమైంది. అయితే అందుకు కారణం రూపాయి 10 శాతం మేర క్షీణించడమే. కొత్త ఏడాదిలోనూ పసిడి రాణించే అవకాశాలే కనిపిస్తున్నాయి. 2019లో భారత్, చైనాల నుంచి పెట్టుబడులు తిరిగి పుంజుకోవడానికి అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ కూడా కొత్త ఏడాదిలో కేవలం ఒక ట్రెండు సార్లు మాత్రమే వడ్డీ రేట్లు పెంచే అవకాశాలుండడం ఇందుకు ఊతమివ్వవచ్చు. మొత్తం మీద యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్‌లు కఠినంగా వ్యవహరించనుండడం; అమెరికా ఫెడ్ కాస్త సరళంగా ఉండడం వల్ల అమెరికా డాలరుపై ప్రభావం పడి బులియన్ ధరలకు మద్దతు లభించే అవకాశం ఉంది. అంటే ఈ ఏడాది బంగారం మెరుస్తుందన్నమాట.



2019 కీలక నామ సంవత్సరే..

బ్రిటన్‌ను అధిగమించి!

అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఇంకా ఎన్నాళ్లు కొనసాగుతామన్న ప్రశ్నకు ఈ ఏడాది సమాధానం దొరకబోతోందా...!! భారత్, చైనా, బ్రెజిల్ వంటి వర్ధమాన దేశాలు 2018లో అంచనాలకు అనుగుణంగా రాణించలేకపోయాయి. అయితే బ్రెజిల్ 2020లో ఇటలీని అధిగమించనుందని సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ బిజినెస్ రీసెర్చ్(సీఈబీఆర్) నివేదిక చెబుతోంది. వాస్తవానికి 20018లోనే బ్రెజిల్ ఆ ఘనత సాధించాలి. కానీ సాధ్యం కాలేదు. ఇక అమెరికాను అధిగమించి ప్రపంచ నం.1 స్థానానికి 2032లో కానీ చైనా చేరే అవకాశాలు కనిపించడం లేదు. ఇది కూడా లెక్క తప్పింది. రెండేళ్లు ఆలస్యంగా ఆ ఘనతను చేజిక్కించుకోనుంది. ఇక భారత్ విషయానికొస్తే బ్రిటన్‌ను 2019లో అధిగమించనుందని అంచనా. ఒక వేళ 2019లో సాధ్యం కాకుంటే 2020లో అవకాశం ఉందట. అంతక్రితం 2018లోనే ఇది సాధ్యమవుతుందని అంచనాలుండేవి. కానీ మందగమనం ప్రభావంతో అలా జరగలేదు. మరి కొత్త సంవత్సరంలో భారత్ ఏ మేరకు రాణిస్తుందనేది కొన్ని విషయాలపై ఆధారపడి ఉంది. అవేమిటంటే..

ముడి చమురు ధరలు, రూపాయి మారకపు విలువలో హెచ్చుతగ్గులు, రుతు పవనాలు, ఎన్నికలు, ద్రవ్య లోటు తదితరాలు. ఇవన్నీ సానుకూలంగా కనిపిస్తే భారత వృద్ధి రేటు అంచనాలను మించి రాణించే అవకాశం ఉంది. ప్రపంచ బ్యాంకు ఈ ఏడాది భారత్ 7.5 శాతం వృద్ధి కనబరుస్తుందని అంచనా వేసింది. ఏడీబీ, ఐఎమ్ఎఫ్ వంటివి కూడా అటూ ఇటూగా అదే అంకెను చెబుతున్నాయి. వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ తన స్థానాన్ని, అయితే భారత్ నిలబెట్టుకుంటుంది. కానీ అభివృద్ధి చెందిన దేశాలను ఎపుడు అధిగమిస్తుందన్నదే అసలు ప్రశ్న.

మార్కెట్ సెలవులు - 2019

1. మహాశివరాత్రి	మార్చి 4	సోమవారం
2. హోలి	మార్చి 21	గురువారం
3. మహావీర్ జయంతి	ఏప్రిల్ 17	బుధవారం
4. గుడ్‌ఫ్రైడే	ఏప్రిల్ 19	శుక్రవారం
5. మహారాష్ట్ర దినోత్సవం	మే 1	బుధవారం
6. రంజాన్	జూన్ 5	బుధవారం
7. బక్రీద్	ఆగస్టు 12	సోమవారం
8. స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15	గురువారం
9. వినాయక చవితి	సెప్టెంబరు 2	సోమవారం
10. మొహర్రం	సెప్టెంబరు 10	మంగళవారం
11. గాంధీ జయంతి	అక్టోబరు 2	బుధవారం
12. దసరా	అక్టోబరు 8	మంగళవారం
13. దీపావళి బలిప్రతిపద	అక్టోబరు 28	సోమవారం
14. గురునానక్ జయంతి	నవంబరు 12	మంగళవారం
15. క్రిస్మస్	డిసెంబరు 25	బుధవారం

ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ - అక్టోబరు 27న ఆదివారం
(ట్రేడింగ్ వేళలు తర్వాత నిర్ణయిస్తారు)

వృద్ధి రేటు అంచనాలు
2019/(2019-2020)

ప్రపంచ బ్యాంకు	7.5
ఐఎమ్ఎఫ్	7.4
ఏడీబీ	7.6
మూడీస్	7.3
ఆర్‌బీఐ ★	7.5

★ తొలి ఆరు నెలలకు

సెన్సెక్స్ అంచనాలు

47,000
బుల్ ర్యాలీ వస్తే సెన్సెక్స్ 2019 డిసెంబరుకు చేరొచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా

'కొత్త'గానే ఉంటుందా?

కొత్త ఏడాదిలో సాఫ్ట్‌వేర్ రంగానికి 'డిజిటల్' పెద్ద అవకాశంగా కనిపిస్తోంది.

★ 2017-18లో ఐటీ పరిశ్రమ 8-9% వృద్ధిని సాధిస్తే, డిజిటల్ విభాగంలో 20-22% పురోగతి కనిపించింది. ఈ విభాగంలో రాబోతున్న అవకాశాలను టీసీఎస్ ఎంతో ముందుగానే గుర్తించింది. అందువల్ల దాదాపు 3 లక్షల మంది ఉద్యోగులకు డిజిటల్ ప్రాజెక్టులు చేపట్టటానికి అవసరమైన శిక్షణ ఇచ్చాం. వచ్చే రెండు, మూడేళ్లలో టీసీఎస్ ఆదాయాల్లో మూడింట రెండు వంతులు డిజిటల్ నుంచే లభిస్తుందని అంచనా.

★ డిజిటల్‌లోనూ యాంత్రీకరణ, అగైల్, క్లౌడ్, డేటా అనలిటిక్స్ కీలకం.



★ ప్రస్తుత కంప్యూటర్ వ్యవస్థలను పూర్తిగా అప్‌గ్రేడ్ చేయాల్సి వస్తుంది. అధిక వేగంతో పనిచేసే ప్రాసెసర్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సరికొత్త పరికరాలు కావాల్సి వస్తుంది. దీనివల్ల డిజిటల్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగంలోనూ భారీ అవకాశాలు లభిస్తాయి.

★ ఆటోమేషన్ శరవేగంగా దూసుకువస్తోంది. గతంలో సులువైన పనులను మనుషులు చేస్తే, సంక్లిష్ట పనులను యంత్రాలు చేయాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడు సులువైన పనులను యంత్రాలకు అప్పగిస్తే అవి వేగంగా చేస్తాయి కదా- అనే ఆలోచన చేస్తున్నారు. ఇటువంటి భిన్నమైన ఆలోచనల వల్ల ఆటోమేషన్ పరిధి విస్తృతం అవుతోంది.

★ డిజిటల్, ఇంజనీరింగ్ విభాగాల్లో రాబోతున్న అవకాశాలు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మేలు చేస్తాయి. ఈ మార్పు వల్ల వచ్చే అవకాశాలను రెండు రాష్ట్రాలు అందిపుచ్చుకోగలుగుతాయి.

- వి.రాజన్న,
టీసీఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్

ఐరోపా అంది వస్తోంది

ముడి రసాయనాలు, ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్) కొరత ఔషధ పరిశ్రమను ఇబ్బంది పెడుతోంది. చైనాలో మళ్లీ నిబంధనలకు అనుగుణంగా బల్క్ ఔషధ రసాయనాల తయారీకి అనువైన భారీ కర్మాగారాలను ఏర్పాటు చేయటానికి జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. వచ్చే రెండు మూడేళ్ల వ్యవధిలో అక్కడి నుంచి సరఫరాలు పెరగవచ్చు.

బల్క్ ఔషధ రసాయనాల కొరత అనేది మనదేశంలో ఔషధ పరిశ్రమకు ఎప్పటికైనా సమస్యే. కాబట్టి అటు ప్రభుత్వం, ఇటు పరిశ్రమ దీన్ని అధిగమించేందుకు ప్రయత్నించాలి. యూఎస్ఎఫ్‌డీఏ (అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ) తనిఖీలు, ఆంక్షల వల్ల దేశీయ ఔషధ పరిశ్రమకు సమస్యలు ఎదురవుతున్నాయి. కానీ యూఎస్ఎఫ్‌డీఏ నిబంధనలను పాటించక తప్పదనే అవగాహన పరిశ్రమ వర్గాల్లో పెరిగింది. ఔషధ ఎగుమతుల కోసం యూఎస్ మార్కెట్‌పై మనం అధికంగా ఆధారపడి ఉన్నప్పటికీ కొత్తగా ఐరోపా మార్కెట్ అందివస్తోంది. లాటిన్ అమెరికా దేశాలకు ఔషధ ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. వ్యయాలు తగ్గించుకోగలిగితే దేశీయ ఔషధ పరిశ్రమకు అవకాశాలకు కొదవ ఉండదు. అదే సమయంలో పరిశోధన- అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఇందుకు అధిక నిధులు కేటాయించాలి. యూఎస్‌లో ఔషధ పంపిణీదార్ల సంఖ్య తగ్గిపోతోంది. దీనివల్ల ఔషధ తయారీ సంస్థలు తక్కువ ధరలకు ఔషధాలు ఇవ్వాల్సి వస్తోంది. ఇది యూఎస్ మార్కెట్‌కు ఔషధాలు అందిస్తున్న మనదేశంలోని కంపెనీలకు సమస్య అవుతోంది."



- వెంకట్ జాస్తి,
సువెన్ లైఫ్‌సైన్సెస్ ఛైర్మన్, సీఈఓ

నైపుణ్య శిక్షణ కావాలి

కొత్త సంవత్సరంలో ఐటీ రంగం 10 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉంది. కేవలం 2019లోనే కాకుండా వచ్చే కొన్నేళ్ల పాటు దేశీయ ఐటీ రంగం రెండంకెల వృద్ధి నమోదు చేసే అవకాశం ఉంది.

★ ఐటీలో ఎన్నో కొత్త అవకాశాలు వస్తున్నాయి. కాకపోతే వీటిని అందిపుచ్చుకోవటానికి గతంలో ఉన్నటువంటి నైపుణ్యాలు సరిపోవు. ప్రధానంగా సాంకేతిక ఆవిష్కరణలపై దృష్టి సారించాలి. మానవ వనరులను సిద్ధం చేసుకోవాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి.

★ ప్రస్తుత పరిస్థితులను సమూలంగా మార్చివేసే సాంకేతిక పరిజ్ఞానం కోసం కేంద్ర ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేయాలి. బిగ్ డేటా, కృత్రిమ మేధస్సు (ఏఐ), అనలిటిక్స్ కోసం సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ నెలకొల్పాలి.



★ ఐటీ రంగం మలిదశ విస్తరణకు అనువైన మౌలిక సదుపాయాలను కల్పించటంపై దృష్టి సారించాలి. ప్రతి సాంకేతిక సంస్థలో ఒక ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేయాలి.

★ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులను తీర్చిదిద్దటానికి ఏఐసీటీఈ (అఖిల భారత సాంకేతిక విద్యా మండలి) కృషి చేయాలి. ప్రస్తుత విద్యా విధానంలో మార్పులు తీసుకురావాలి. విద్యా సంస్థలు- పరిశ్రమలు కలిసి పనిచేసే అవకాశం కల్పించాలి. గ్రాడ్యుయేట్ విద్య స్థాయిలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై బోధన జరగాలి.

- బీవీఆర్ మోహన్‌రెడ్డి,
సైయెంట్ వ్యవస్థాపకుడు

ఎన్నికల ముందు.. తర్వాత

మిడ్, స్మాల్ క్యాప్ షేర్లలో 2018లో బాగా దిద్దుబాటు వచ్చింది. కొత్త సంవత్సరంలో ఈ విభాగానికి చెందిన షేర్లలో హెచ్చుతగ్గులు బాగా తగ్గిపోవచ్చు..

★ కొత్త సంవత్సరంలో ఎన్నికలు, వడ్డీ రేట్లు, కంపెనీల ఆదాయాల్లో వృద్ధి... వంటి అంశాల ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్‌పై ఉంటుంది. ప్రపంచ ఆర్థిక మాంద్యం వస్తుందని అనుమానపడే వారు కూడా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడ పెట్టుబడులు పెట్టాలనే విషయమై అప్రమత్తంగా ఉండాలి.

★ దేశీయ వినియోగం, భారీ యంత్రపరికరాల తయారీ, వ్యవసాయ రంగానికి అవసరమైన వస్తు-సేవలు అందించే సంస్థలు ఆకర్షణీయంగా ఉండవచ్చు. వ్యవసాయ రంగానికి అవసరమైన మద్దతు ఇచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. అందువల్ల వ్యవసాయ పరిశ్రమలకు సానుకూలత వస్తుంది.



★ 2018లో మాదిరి మార్కెట్ భారీ హెచ్చుతగ్గులకు లోనుకాకపోవచ్చు. అలాగని స్థిరంగా పెరుగుతుందనీ చెప్పలేం. అందువల్ల దశలవారీగా పెట్టుబడి పెట్టటం మేలు.

★ ఎన్నికల కంటే ముందు మార్కెట్‌లో ర్యాలీ వస్తే, ఎన్నికల తర్వాత 'కరెక్షన్'కు అవకాశం ఉంటుంది. అలాకాకుండా ముందే 'కరెక్షన్' వస్తే, ఆ తర్వాత మార్కెట్ ఆకర్షణీయంగా ఉండవచ్చు.

★ గత కొన్ని సంవత్సరాలుగా కొన్ని రంగాల్లో అదనపు సామర్థ్యం రాలేదు. అటువంటి రంగానికి చెందిన కంపెనీలు సమీప భవిష్యత్తులో అధిక ఆదాయాలను నమోదు చేసే పరిస్థితి ఉంటుంది.

- సతీశ్ కంతేటి,
జెన్ సెక్యూరిటీస్ సంయుక్త ఎండీ

కొత్త ఏడాదిలో

స్కూటర్లు



- ఏప్రిలియా స్టామ్ 125
- యమహా ఏరాక్స్ 155 ఎన్‌మాక్స్ 155
- హీరో జడ్ఐఆర్ 150
- హోండా పీసీఎక్స్ 150
- హోండా డ్యూయెట్ ఈ
- వెస్పా జీటీఎస్ 300
- టీవీఎస్ న్యూ జూపిటర్ 125
- న్యూ జెన్ టీవీఎస్ వెగో



కార్లు

అంకెలు రూ.లక్షల్లో

1. హోండా న్యూ సివిక్ 2019	15-20
2. టాటా హరియర్	13-18
3. మారుతీ న్యూవ్యాగన్ ఆర్	4.5-6
4. నిస్సాన్ కిక్స్	9-15
5. టాటా 45ఎక్స్	6-10
6. కియా ట్రేజర్ ★	10-15
7. మహీంద్రా ఎస్201	8-12
8. హ్యుందాయ్ ఎస్‌టీఐఎక్స్/కార్లినో	8-12
9. మారుతీ సుజుకీ జెన్/ఫ్యూచర్ ఎస్	5-7
10 హోండా హెచ్‌ఆర్-వి	12-16

★ కియా భారత్‌లో ప్రారంభించనున్న తొలి మోడల్ ఇది. అనంతపురంలోని ప్లాంటులో ఇది తయారవుతోంది.

బైక్‌లు

- 2019 బజాజ్ డామినర్
- కేటీఎమ్ 390 అడ్వెంచర్
- బెనెల్లి టీఆర్‌కే 502
- ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 1200
- బీఎమ్‌డబ్ల్యూ ఆర్ 1250 జీఎస్




కథనాలు - ఈనాడు, హైదరాబాద్ - ఈనాడు వాణిజ్య విభాగం



2019-చదువు

కొంగొత్త కెరియర్లు!

ఉద్యోగం కావాలంటే ఏం చేయాలి? పాత దారుల్లో వెళితే ఉద్యోగాన్వేషణ ప్రయాణం సుదీర్ఘంగా సాగవచ్చు. ఒక్కోసారి ఎంతకూ గమ్యం చేరలేక పోవచ్చు. అదే కొత్త మార్గంలో వెళితే నాలుగు అడుగులు వేయకముందే ఉద్యోగ వరమాల మీ మెడలో పడవచ్చు. ఉద్యోగం కావాలంటే మంచి కంపెనీలో చేరడం పాత పద్ధతి. ఆ మంచి కంపెనీ సరైన మార్గంలో లేకపోతే కొంతకాలానికే కనుమరుగై పోవచ్చు. అందుకే పదికాలాలపాటు నిలబడే ఉద్యోగం కావాలంటే కొత్త దృష్టి అవసరం. అలాంటి అంతర్నేత్రంతో చూస్తే సంక్షోభం, నియంత్రణ, విస్తరణ, భద్రత వంటివి కూడా ఉద్యోగాన్నిచ్చే అమృత కలశాలే! వీటిలో నిమగ్నమైన వేలాది కంపెనీలు లక్షల ఉద్యోగావకాశాలతో ఎదురు చూస్తున్నాయి. నూతన సంవత్సరంలో వీటిని అందుకునేందుకు మరి మీరు సిద్ధమవుతారా..!







యస్.వి. సురేష్
ఎడిటర్, ఉద్యోగసోపానం

కొత్త సంవత్సరంలో కొన్ని రంగాలు ఉరకలెత్తనున్నాయి. ఆ రంగాలేవో తెలుసుకోవడం ద్వారా ముందు నుంచే తగిన మార్గాలు వేసుకోవచ్చు. ఆర్థికాభివృద్ధికీ ఉద్యోగావకాశాలకూ అవినా భావ సంబంధం ఉందని అందరికీ తెలిసిందే. ఆర్థికవ్యవస్థ వృద్ధిరేటు 7% దాటితేనే ప్రతినెలా ఉద్యోగాల కోసం మార్కెట్‌లోకి దూసుకు వచ్చే 10 లక్షల మంది యువతకు విభిన్న రంగాలు తలుపులు తెరుస్తా యని ఆర్థికవేత్త రఘురాం రాజన్ పదే పదే చెబుతుంటారు.

2019 నుంచి రాబోయే సంవత్సరాల్లో ఆర్థికవృద్ధి పరుగులెడుతుందని ఆర్థిక రంగ నిపుణుల అంచనా. దేశంలో 100 కోట్ల మంది వినియోగదారులు నిత్యం వివిధ ఉత్పత్తులు, సేవలు వినియోగించుకుంటారు. తలసరి ఆదాయం కూడా బాగా పెరిగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. సరిగ్గా ఇక్కడే లక్షల ఉద్యోగావకాశాలు ఉద్భవిస్తాయి. వాటిని ఒడిసి పట్టుకోవడమే మన పని. దీనికితోడు అమెరికా, చైనాల మధ్య జరుగుతున్న వాణిజ్యం మనకి కలసి వస్తోంది. మొత్తమ్మీద మన ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటూ వివిధ రంగాలు కొత్త రంగులు అద్దుకుంటున్నాయి. వాటికి సరికొత్త ఆదాయ మార్గాలు కనిపిస్తున్నాయి. అవే యువతకు కొత్త ఉద్యోగ బాటలు వేస్తున్నాయి.

ఆతిథ్యం, ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్, ఆహార సరఫరా



గడిచిన ఏడాదిలో ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నా కొన్ని రంగాలు భేషుగ్గా ఉన్నాయి. ఆతిథ్య రంగంలో ఓయో రూమ్స్, ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ రంగంలో ఫ్లిప్‌కార్ట్, ఉడాన్, ఆహార సరఫరాకు స్విగ్గీ సంస్థలు వందల కోట్ల రూపాయల వ్యాపారాన్ని సృష్టించి లక్షల ఉద్యోగావకాశాలను కల్పించాయి. ఇదే తరహాలో 2019లో కొన్ని రంగాల ద్వారా సంబంధిత ఉద్యోగాలకు గిరాకీ రానుంది. వాటిని గ్రహిస్తే కెరియర్‌పరంగా సన్నద్ధం కావొచ్చు.

దేశ మార్కెట్‌పై భరోసాతో, ముందుచూపుతో పెట్టుబడులకు సాహసించే వెంచర్ కేపటలిస్టులు వందల కోట్ల డాలర్లను వివిధ రంగాల్లో గుమ్మరిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం విభిన్న రంగాల్లో ఉత్పత్తులు, సేవలు అందిస్తున్న కంపెనీలు, అంకుర సంస్థలు కొత్త ఆదాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. వాటికి అటువంటి నవీన మార్కెట్లు కనిపెట్టడానికి, వాటిలోకి ప్రవేశించడానికి, అదనపు ఆదాయాలను ఆర్జించి పెట్టేందుకు ఉపకరించేవారే ఎదుగుదల నిపుణులు (గ్రోత్ ఎక్స్‌పర్ట్స్). వీరినే బిజినెస్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ప్రస్తుతం తామున్న మార్కెట్లలో ఆదాయాల్లో ఎదుగుదల మందగించినపుడు వీటికి కొత్తగా సిరులు కురిపించే మార్కెట్లు అవసరం. అలాగే నవీన ఆలోచనలతో ఉత్పత్తులు, సేవలు అందిస్తున్న అంకురాలకు వాటిని, సరైన చోటు గుర్తించి అందించడం ద్వారా ఆదాయాలను కురిపించగలిగే నిపుణులు అవసరం.



సమాచార ఉద్యోగ గుప్తనిధి



ఒక సంస్థ నుంచి సేవలు పొందడానికి సాధారణ వినియోగదారుడు తన వ్యక్తిగత సమాచారం ఇవ్వాల్సి వస్తోంది. పేరు, వయసు, చిరునామా, ఆధార్ నంబరు (అవసరమైనచోట), బ్యాంకు ఖాతా వివరాలు తదితర సమాచారం సదరు సంస్థ వద్ద ఎప్పటికీ నిల్వ ఉంటాయి. అయితే ఇలాంటి వ్యక్తిగత సమాచారాన్ని సదరు సంస్థ ఇతరత్రా ప్రయోజనాలకు మళ్లించినా, సదరు సంస్థ నుంచి మరొకరు చౌర్యం చేసినా అది కంపెనీ మెడకు చుట్టుకుంటోంది. సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్, ఇంకా కొన్ని సంస్థలు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటూ ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థల ముందు దోషిలా నిలబడుతున్నాయి. ఇలాంటి విశ్వాస ఘాతుకాన్ని నివారించి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు వివిధ దేశాలు జీడీపీఆర్- జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ లాస్ (సాధారణ సమాచార పరిరక్షణ, నియంత్రణ చట్టాలు) తీసుకువస్తున్నాయి. ముఖ్యంగా యూరప్ దేశాలు దీనివైపు వడివడిగా అడుగులు వేస్తున్నాయి.

> **వేలాది సంస్థలు డిజిటల్ విపణికి వారధులు వేసుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఐటీ విద్యార్హతతోపాటు సేల్స్, మార్కెటింగ్‌లో అవగాహన పెంచుకుంటే మేలు!**

మరోపక్క ఎన్నో భారత కంపెనీలు ఐరోపా దేశాల మార్కెట్లలోకి ప్రవేశించాలని ఉవ్విళ్లూరుతున్నాయి. అయితే ఇలా ప్రవేశించే సంస్థలు తాము ఆయా దేశాల పౌరులకు వినియోగసేవలు అందించే క్రమంలో సమాచార సేకరణ, నిల్వ, వినియోగం విషయాల్లో అక్కడి చట్టాలకు అనుగుణంగా పనిచేయకపోతే భారీ జరిమానాలు చెల్లించాల్సి రావొచ్చు. దీనివల్ల కొత్తగా లాభాల మాట అటుంచి, అసలు సంస్థల భవిష్యత్తే బోల్తా కొట్టవచ్చు. అందువల్ల జీడీపీఆర్ నిబంధనలు అమలు చేసే ప్రాజెక్టు మేనేజర్లు, ఇతర నిపుణుల కోసం ఆసియా దేశాల్లో సంస్థలు జల్లెడ పట్టి వెతుకుతున్నాయి. ఎంత వేతనమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాయి.

★ మనదేశంలో లా కోర్సులను అందించే విద్యాసంస్థలు ప్రస్తుతం జీడీపీఆర్‌పై దృష్టిపెట్టాయి.

★ అంతర్జాతీయ గుర్తింపు పొందిన జీడీపీఆర్ స్వల్పకాల సర్టిఫికెట్ కోర్సులను కొన్ని సంస్థలు అందిస్తున్నాయి.

లా లేదా, సి.ఎ. చేసినవారు సైతం ఈ కోర్సుల పట్టాలను తమ రెజ్యూమెలో చేర్చుకోవడం ద్వారా వేగంగా ఆకర్షణీయమైన ఆఫర్లను పొందవచ్చు.

అంకుర సంస్థల హవా!



గత సంవత్సరం ఐటీ, ఇతర రంగాల్లో ఆరు లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. వీటిలో లక్షన్నర మందిని అంకుర సంస్థలే అక్కున చేర్చుకున్నాయి. దేశంలో ప్రస్తుతం 39 వేల స్టార్టప్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటికితోడు ఏటా 5 వేల అంకుర సంస్థలు వచ్చి చేరుతున్నాయి. 2019లో ఒక స్టార్టప్ సంస్థలే అయిదు లక్షల వరకూ ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మానవ వనరుల నిపుణుడు టీవీఎం పాయ్ అంచనా వేశారు.

దశాబ్దాల నుంచి నడుస్తున్న కంపెనీలు గానీ, కొత్తగా అంకురించిన సంస్థలు గానీ గ్రోత్ ఎక్స్‌పర్ట్స్ కోసం ఎదురుచూస్తున్నాయి. సేల్స్, ఛానెల్ డెవలప్‌మెంట్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో గతంలో మంచి అనుభవం గలవారుగానీ లేదా ఈ విషయాలతో తగిన అవగాహనతో వచ్చిన ఫ్రెషర్లను సంస్థలు ఎగరేసుకుపోతున్నాయి. ముఖ్యంగా వేగంగా అమ్ముడయ్యే వినియోగ ఉత్పత్తుల (ఎఫ్ఎంజీ) రంగం, ఈ-కామర్స్ రంగంలో నిమగ్నమైన సంస్థలకు ప్రస్తుతం ఈ అంశాల్లో అవగాహనతో పని చేసే అభ్యర్థుల కొరత వెంటాడుతోంది.

> **డేటాను విశ్లేషించి, వినియోగదారుల అభిరుచులు, అవసరాలను అంచనావేసి కొత్త వ్యాపార అవకాశాలకు ఊపు ఇవ్వగలిగే డేటా సైంటిస్టులు ఇప్పుడు ఈ-కామర్స్ రంగానికి అవసరం.**

❑ బీకాం, బీఏ ఆర్ట్స్ సబ్జెక్టుల్లో పట్టభద్రులైనవారు ఈ-కామర్స్‌లో వివిధ విద్యాసంస్థలు అందిస్తున్న ఏడాది కాలవ్యవధి కోర్సు చేయడం ద్వారా ఉద్యోగావకాశాలు అందుకోవచ్చు.

❑ కస్టమర్ రిలేషన్‌పైనా ఎంబీఏలో భాగంగానో లేదా విడిగా ప్రత్యేక కోర్సుగా డిగ్రీ పూర్తిచేసినవారికి వివిధ సంస్థలు కోర్సులను అందిస్తున్నాయి.

❑ ఇప్పటికే ఉత్పత్తులు, సేవల రంగాల్లో నాలుగైదేళ్ల నుంచి వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న ముప్పై, ఆపై వయసు ఉన్నవారు సేల్స్, ఈకామర్స్, వినియోగదారుల సంబంధాల విభాగాల్లోకి మారడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుంది.

ఈ ఉద్యోగాలు ఉజ్వలం

వందకోట్ల వినియోగదారులున్న భారత విపణిలో వినియోగదారుల అభిరుచులు, ఆలోచనలు, జీవనశైలిలో వస్తున్న మార్పుల వల్ల కొత్త ఉద్యోగావకాశాలు కెరటాల్లా తన్నుకు వస్తున్నాయి. వీటిని గుర్తించి ఎంత త్వరగా ఆవైపు వెళ్లగలిగితే అవకాశాలను చేజిక్కించుకోవచ్చు.

›› డిజిటల్ నిపుణులు



డిజటల్ జగత్తు ఈ విశ్వాన్ని కమ్మేస్తోంది. ఇప్పటి తరం వినియోగదారులు ఒక వస్తువు కొనేందుకు బైకులు వేసుకుని రోడ్ల వెంట తిరగడం లేదు. అరచేతిలోని బుల్లి మొబైల్ తెరపై ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. కొనాలనుకుంటున్న వస్తువును నఖశిఖ పర్యంతం పరిశీలిస్తున్నారు. ఆ వస్తువు లభ్యమయ్యే వివిధ విపణులను డిజిటల్ జగత్తులో విహరిస్తూ పరిశీలిస్తున్నారు. ఎక్కడ చవకో తెలుసుకుని, ఆపై నిర్ణయం తీసుకుంటున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ చేసి, ఇంటికి వస్తువును రప్పించుకుంటున్నారు. డిజిటల్ మార్కెట్‌లో లేని సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది.

ఇక్కడే ఐటీ నిపుణులకు ఉజ్వల ఉద్యోగావకాశాలున్నాయి. కేవలం కోర్సుల ద్వారానే ఉద్యోగాలు రావు. సంప్రదాయ మార్కెట్లపై లోతైన అవగాహన, వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా ఆన్‌లైన్ షాపింగ్ మలచగలిగే వెబ్ అనలిస్టులు, సెర్చ్ ఇంజిన్ నిపుణులు, కస్టమర్ రిలేషన్‌షిప్ సాఫ్ట్‌వేర్ నిపుణులకు సంస్థలు ద్వారాలు తెరచివున్నాయి.

›› సైబర్ భద్రత సామర్థ్యాలు



వినియోగదారుల సమాచార భద్రత సంస్థలను పీడకలలా వెంటాడుతున్న తరుణంలో సైబర్ సెక్యూరిటీ నిపుణుల కోసం సంస్థలు వలవేసి గాలిస్తున్నాయి. తమ సర్వర్‌లో నిక్షిప్తమైన వినియోగదారుల సమాచారాన్ని హ్యాకింగ్ గద్దలు ఎగరేసుకుపోకుండా కాపలా కాయగల సైబర్ భద్రతా వ్యవస్థ నిర్మాణంలో పనిచేయగల నిపుణులు భారతీయ సంస్థలకు వేల సంఖ్యలో అవసరం ఉంది.

ఈ విభాగంలోకి ప్రవేశించాలంటే కేవలం ఐటీ కోర్సు చేసి ఉంటే చాలదు. గంటలకొద్దీ సమయం కంప్యూటర్ ముందు ఒంటరిగా కూర్చుని తమ సంస్థ ఆన్‌లైన్ వ్యవస్థల్లోకి అక్రమంగా చొరబాటు చేయగల (హ్యాకింగ్) సాంకేతిక మార్గాలను నిరంతరం వేయి కళ్లతో వెదుకుతూ గుట్టుమట్టులను పట్టుకోగలగాలి. ఆపై ఆ మార్గాన్ని మానివేయడం, వ్యవస్థను పటిష్ఠం చేయడం మరో విభాగం చేపడుతుంది. ఐటీ కోర్సులతోపాటు ఎథికల్ హ్యాకింగ్‌పై పట్టు కోసం స్వల్పకాల సర్టిఫికెట్ కోర్సులను చేయడం అభిలషణీయం.

›› డిజిటల్ బదలాయింపులోనూ..



సాంప్రదాయిక మార్కెట్‌లో మాత్రమే ఉంటే మను గడ సాధించలేని తరుణమిది. వేలాది సంస్థలు తమ సాంప్రదాయిక మార్కెట్ నుంచి డిజిటల్ విపణికి వారధులు వేసుకుంటున్నాయి. ఈ సందర్భంగా డిజిటల్ బదలాయింపు నిపుణుల అవసరం ఉంది.

ఐటీ విద్యార్హతతోపాటు సేల్స్, మార్కెటింగ్‌లో లోతైన అవగాహన గలవారిని అవకాశాలు వెంటనే దరిచేరతాయి. వినియోగదారుల అవసరాలు గుర్తించి ఆన్‌లైన్‌లో వారి షాపింగ్‌ను థ్రిల్లింగ్‌గా మార్చగల నిపుణులకు మంచి భవిష్యత్తు ఉంది.

›› డేటా సైంటిస్టులు



ప్రయోగశాలలో విభిన్న పరీక్షలు నిర్వహించి కొత్త విషయాలను వెలుగులోకి తీసుకువచ్చే వారిని శాస్త్రవేత్తలంటున్నారు. నేటి ఐటీ యుగంలో సమాచార సేకరణ అత్యంత సులభమైంది. ఐఓటీ సెన్సార్ల ద్వారా లక్షలాది వినియోగదారుల డేటా నిక్షిప్తమై ఉంటోంది.

ఆ సమాచారాన్ని విశ్లేషించి, వాటిలో దాగి ఉన్న వినియోగదారుల అభిరుచులు, కొనుగోలు ఆసక్తులు, వారి భవిష్యత్ అవసరాలను విశ్లేషించి కొత్త వ్యాపార అవకాశాలకు ఊపు ఇవ్వగలిగే డేటా సైంటిస్టులు ఇప్పుడు ఈ-కామర్స్ రంగానికి అవసరం. డేటాసైన్స్‌లో డిగ్రీతోపాటు స్టాటిస్టిక్స్ సబ్జెక్టు తెలిసిన యువతీయువకులు డేటా సైంటిస్టులుగా రాణిస్తారు.

ప్రభుత్వ ఉద్యోగాలు — నోటీస్ బోర్డు

ఏపీలో 446 గ్రూప్ 2 పోస్టులు

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్ 2 సర్వీసు పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది. **పోస్టులు:** అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ తదితరాలు. **మొత్తం పోస్టుల సంఖ్య:** 446 (ఎగ్జిక్యూటివ్-154, నాన్ ఎగ్జిక్యూటివ్-292) **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి. **వయసు:** 18-42 సంవత్సరాల మధ్య ఉండాలి (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై పోస్టుకు 18-28 మధ్య). **ఎంపిక:** రెండంచెల రాతపరీక్షల ద్వారా. **స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** మే 5 **మెయిన్ ఎగ్జామ్ తేదీ:** జులై 18, 19 **దరఖాస్తు రుసుము:** అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు 250, ఎగ్జామ్ ఫీజు రూ.80 చెల్లించాలి. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 10 నుంచి 31 వరకు. **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in/

నార్త్ సెంట్రల్ రైల్వే

అలహాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న నార్త్ సెంట్రల్ రైల్వే 2018-19 సంవత్సరానికిగానూ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: క్రీడల కోటా-21, కల్చరల్ కోటా-02. **క్రీడాంశాలు:** క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, హాకీ తదితరాలు. **సాంస్కృతికాంశాలు:** సింగర్-హిందుస్థానీ లైట్, ఫ్లూట్ ప్లేయర్ **దరఖాస్తు:** ఆన్‌లైన్.

చివరితేది: జనవరి 28 **గమనిక:** పూర్తి వివరాలకు 2019 జనవరి 5 నాటి రోజ్‌గార్ సమాచార్/ ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు.

వెబ్‌సైట్: http://rrcald.org/

సిక్కిం యూనివర్సిటీ

సిక్కిం యూనివర్సిటీ (సెంట్రల్ వర్సిటీ) వివిధ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** హిందీ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, పర్సనల్ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 13

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: జనవరి 15 **హార్డు కాపీలను పంపడానికి చివరి తేది:** జనవరి 22

వెబ్‌సైట్: http://cus.ac.in/

కోజికోడ్ ఐఐఎం

కోజికోడ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, అకౌంటెంట్ తదితరాలు.

ఖాళీలు: 11 **అర్హత:** బీకాం/ బీబీఏ/ ఇంటర్ సీఏ/ ఐసీడబ్ల్యూఏ, గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ డిప్లొమా/ బీఈ/ బీటెక్, అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: జనవరి 26

హార్డు కాపీలను పంపడానికి చివరితేది: ఫిబ్రవరి 15 **వెబ్‌సైట్:** http://www.iimk.ac.in/

సీఎస్ఐఆర్ - ఆంప్రీలో సైంటిస్టులు

భోపాల్‌లోని సీఎస్ఐఆర్ - అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ ప్రాసెసెస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆంప్రీ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** సైంటిస్ట్/ గ్రేడ్-4(2) **ఖాళీలు:** 10 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణత (లేదా) పీహెచ్‌డీ థీసిస్ సమర్పించినవారూ అర్హులే. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** జనవరి 29

హార్డు కాపీలను పంపడానికి చివరితేది: ఫిబ్రవరి 13 **వెబ్‌సైట్:** https://ampri.res.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు